

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

తుది కీ విడుదల..
గంటలోపే తొలగింపు!
జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గందరగోళం
ఎలాంటి ప్రకటన చేయని ఎన్టీఏ
విద్యార్థుల్లో ఆందోళన
2

శుక్రవారం | 18-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 19 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: పంచమి సా.5.08 తదుపరి షష్ఠి, నక్షత్రం: జ్యేష్ఠ ఉ.8.21 తదుపరి మూల, వర్జ్యం: సా.5.01-6.45, దుర్ముహూర్తం: ఉ.8.30-9.20, మ.12.39-1.29, అమృతఘడియలు: తె 3.25-5.09, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.00, సూర్యాస్తమయం: 6.28 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెలంగాణకు జపాన్ దిగ్గజ కంపెనీ

మారుబెనీ

600 ఎకరాల్లో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్

- ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు.. 1000 కోట్ల పెట్టుబడి
- దశలవారీగా 5,000 కోట్లకు పెరిగే అవకాశం
- 30 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు
- లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై ఉభయ పక్షాల సంతకాలు
- తెలంగాణకు స్వాగతం.. మారుబెనీ ప్రతినిధులతో సీఎం
- మెట్రో, మూసీ, రేడియల్ రోడ్లకు సహకరించండి
- మెట్రో రెండో దశ విస్తరణకు 11,693 కోట్ల రుణమివ్వండి
- జైకా ప్రతినిధులను కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని స్పష్టం చేసిన జైకా
- సోనీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ బృందం
- అత్యాధునిక ఫిల్మ్ సిటీ ఏర్పాటుకు యోచన: సీఎం


మారుబెనీ కంపెనీ ప్రతినిధితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జపాన్‌కు చెందిన దిగ్గజ కంపెనీ మారుబెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. రూ.1000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఫ్యూచర్ సిటీలో 'నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌' ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం తొలిరోజైన గురువారం కీలకమైన పెట్టుబడుల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. టోక్యోలో మారుబెనీ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. అనంతరం

మిగతా 13వ పేజీలో...

త్వరలో 6 వేల మంది సర్వేయర్లతో
భూముల మ్యాపింగ్
- గ్రామాల్లో రెవెన్యూ అధికారుల నియామకం
- దేశానికి రోల్‌మోడల్‌గా భూభారతి అమలు
- ఆగస్టు 15 నాటికి భూ సమస్యల పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

13


మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దుద్దిళ్ల, పొంగులేటి

పుప్పాలగూడ 450 ఎకరాల్లో
ఐటీ నాలెడ్జ్ హబ్
- భట్టి ఆధ్వర్యంలోని మంత్రివర్గ ఉప సంఘం సమీక్షలో నిర్ణయం
- ఐఏఎస్‌లు, ఎమ్మెల్యేలకు కేటాయించిన భూమి ఇందులో భాగమే
- సుప్రీంకోర్టు కేటాయింపులను రద్దు చేసిందన్న అధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పుప్పాలగూడ పరిసరాల్లో 450 ఎకరాల్లో మొదటి దశలో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణపై భట్టి ఆధ్వర్యంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం గురువారం సచివాలయంలో సమావేశమై ఐటీ నాలెడ్జ్ హబ్ గురించి సమీక్షించింది. పుప్పాలగూడ పరిసరాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం గతంలో స్థలాలు కేటాయించింది. వీరితో కలిపి రెవెన్యూ అధికారులు, స్పెషల్ పోలీసు కో-ఆపరేటివ్ తదితర సొసైటీలకు 200 ఎకరాలకు పైచిలుకు భూమిని ప్రభుత్వం కేటాయించింది. పుప్పాలగూడ పరిధిలో సొసైటీలకు కేటాయించిన భూములను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు క్యాబినెట్ సబ్ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ భూమికి పక్కనే

మిగతా 13వ పేజీలో...

వక్ఫ్ ఆస్తుల
జోలికి వెళ్లం!

బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో నియామకాలూ చేపట్టం

- తదుపరి విచారణ వరకు యథాతథ స్థితి
- సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం హామీ
- కొత్త చట్టంపై స్టే ఇవ్వొద్దని అభ్యర్థన
- అంగీకరించిన ధర్మాసనం
- అభ్యంతరాలపై జవాబిచ్చేందుకు వారం గడువు
- ప్రభుత్వ కౌంటర్‌పై తర్వాతి ఐదు రోజుల్లో రిజాయిండర్లు వేయాలని పిటిషనర్లకు ఆదేశం
- విచారణ మే 5వ తేదీకి వాయిదా
- మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై ఆ రోజున నిర్ణయం తీసుకుంటామని వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లబోమని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. వక్ఫ్ సవరణ చట్టంపై ఎలాంటి స్టే ఇవ్వొదని అభ్యర్థించింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా నమోదైన పిటిషన్లపై, సుప్రీంకోర్టు లేవనెత్తిన అభ్యంతరాలపై సమాధానం ఇచ్చేందుకు వారం రోజులు గడువు ఇవ్వాలని కోరింది. దీనికి అంగీకరించిన కోర్టు.. తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

వక్ఫ్ సవరణ చట్టంలోని పలు సెక్షన్లను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 72కుపైగా పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. వాటిపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. అయితే పిటిషన్లలో లేవనెత్తిన అభ్యంతరాలు, ధర్మాసనం లేవనెత్తిన ప్రశ్నలపై సమాధానం ఇచ్చేందుకు వారం రోజులు గడువు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థించారు. ఈ క్రమంలో వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయకుండా, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులు, కేంద్ర కౌన్సిల్‌లో సభ్యులుగా నియమించకుండా చట్టంలోని ఆయా సెక్షన్లపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం సిద్ధమైంది. దీనిని సొలిసిటర్ జనరల్ వ్యతిరేకించారు. పార్లమెంటులో విస్తృతంగా చర్చించి, మెజారిటీ సభ్యుల ఆమోదంతో కేంద్రం వక్ఫ్ సవరణ చట్టం

మిగతా 2వ పేజీలో...

పేద ముస్లింల హితం కోసమే చట్ట సవరణ
తెలంగాణలో వక్ఫ్ బోర్డుకు రూ.5 లక్షల కోట్ల ఆస్తులు
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

14



పర్యావరణ అంశాల్లో
సీఈసీ కీలకం
- సుప్రీంకు జ్ఞానేంద్రియాల మాదిరి సంస్థ
- సంక్లిష్ట కేసుల్లో కోర్టుకు సహకారం
- సీఈసీ నో చెబితే.. పర్యావరణ అనుమతులు అసాధ్యం

2

మతమార్పిడిలో
విషాదం
- బాప్టిజం తీసుకుంటూ నదిలో మునిగి ఇద్దరి మృతి
- మరో ముగ్గురిని కాపాడిన స్థానికులు
- ఏపీలోని బాపట్ల జిల్లాలో ఘటన

14

ఎంత దూరం వెళితే..
అంతే టోల్!
- మే 1నుంచే జీఎన్ఎస్ఎస్ విధానం
- ఫాస్టాగ్ లేకుండా టోల్ చార్జీల వసూలు
- జీపీఎస్ ఆధారంగా దూరం లెక్కింపు
- తొలుత వాణిజ్య వాహనాలకు అమలు

2

మజ్లిస్ పార్టీకి
కాంగ్రెస్ దూరమే
- రాజకీయంగా ఇది రాహుల్ వైఖరి
- లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షలో మీనాక్షి నటరాజన్ వెల్లడి
- హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్ నేతలకు దిశానిర్దేశం

3

సుప్రీంకోర్టుకు ఆ అధికారం

అణు క్షిపణిలా..

- ప్రజాస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ఆర్టికల్ 142 అధికారాలు
- రాష్ట్రపతిని సుప్రీంకోర్టు ఎలా నిర్దేశిస్తుంది?
- ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో దొరికిన నగదుపై దర్యాప్తు ఏమైంది?
- ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు కాలేదు?.. జడ్జీలు అతీతమా?
- చట్టాలు చేసేది వారే.. అమలు చేసేది వారే.. వారే సూపర్ పార్లమెంట్ అన్నట్టు పరిస్థితి ఉంది
- ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బిల్లులు ఆమోదించేందుకు సుప్రీంకోర్టు రాష్ట్రపతికి గడువు విధించడాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తీవ్రంగా తప్పుపట్టారు. దేశంలో చట్టాలు చేసేదీ వారే, అమలు చేసేదీ వారే అన్నట్టుగా న్యాయమూర్తులు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. వారు చట్టాలకు అతీతమన్నట్టుగా, సూపర్ పార్లమెంటు అన్నట్టుగా పరిస్థితి మారిపోయిందని విమర్శించారు. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 142.. దేశంలో ప్రజాస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా 24 గంటలూ న్యాయవ్యవస్థకు అందుబాటులో ఉన్న అణు క్షిపణిలా మారిందని వ్యాఖ్యానించారు. దేశంలో అందరికంటే అత్యున్నత స్థానంలో ఉన్న రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చే పరిస్థితి ఉండకూడదని.. బిల్లులు ఆమోదించేందుకు రాష్ట్రపతికి గడువు విధించడం సరికాదని స్పష్టం చేశారు. గురువారం 6వ బ్యాచ్ రాజ్యసభ ఇంటర్నీలను ఉద్దేశించి ఉప రాష్ట్రపతి ప్రసంగించారు. రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నగదు దొరికిన

మిగతా 2వ పేజీలో...




తల్లి తేజస్వినిరెడ్డి, కుమారులు ఆశిష్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి (ఫైల్)

కన్నబిడ్డలపై.. తల్లి

కొడవలి వేటు!

ఇంట్లోనే ఇద్దరు కుమారులపై దారుణంగా దాడి

- పిల్లలు పారిపోతున్నా వెంటాడి నరికి చంపిన వైనం
- ఆపై అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య
- ఆమెకు, పిల్లలకు అనారోగ్యం.. భర్తతో నిత్యం గొడవలు
- సమస్యలు చెబితే ముగ్గురూ చావండి అని కసురుకున్న భర్త
- గాజులరామారంలో ఘటన.. 6 పేజీల సూసైట్ నోట్ లభ్యం

జీడిమెట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అప్పటికి కోపంకొద్దీ పిల్లలకు ఓ లెంపకాయ వేసినా.. బెత్తెంతో కొట్టినా ఏ తల్లికైనా ఆ రోజంతా మనసు చివుక్కుమంటుంది.. బిడ్డను అనవసరంగా కొట్టాను కదా అని! మరి.. ఆ మాతృమూర్తి మనసెంత పాషాణమో! పదేళ్లలోపు వయసున్న ఇద్దరు బిడ్డలను పట్టుకొని.. వేట కొడవలితో నరికింది! తల్లి అలా ఎందుకు

మిగతా 14వ పేజీలో...

గ్రూప్-1పై బ్రేక్

ప్రస్తుతానికి నియామక పత్రాలు ఇవ్వొద్దు

- సర్టిఫికెట్ల తనిఖీ కొనసాగించవచ్చు: హైకోర్టు
- మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్‌పై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 నియామకాల విషయంలో హైకోర్టు గురువారం కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతానికి నియామక పత్రాలు జారీచేయరాదని.. సర్టిఫికెట్ల తనిఖీ ప్రక్రియను యథాతథంగా కొనసాగించవచ్చని పేర్కొంది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల సమాధానపత్రాల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని.. దీనిపై న్యాయవిచారణకు ఆదేశించాలని కోరుతూ భువనగిరికి చెందిన మట్ట పరమేశ్, మరో 19 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై



జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. హైదరాబాద్‌లో కేవలం రెండు కేంద్రాల నుంచి పరీక్ష రాసిన 71 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం

మిగతా 12వ పేజీలో...

చారిత్రక కట్టడాలను కూల్చటం లేదు
పాతబస్తీలో మెట్రో పనులపై హైకోర్టుకు ప్రభుత్వ వివరణ

12



14

సర్కార్‌ను పడగొట్టే కర్మ మాకేంటి?

- ప్రజలే రోడ్లపైకొచ్చి ప్రభుత్వాన్ని కూలగొడతారు
- కాంగ్రెస్‌కు వచ్చే 20 ఏళ్ల పాటు ప్రజలు ఓట్లేయరు
- సిగ్గూశరం లేకనే రేవంత్ రాజీనామా చేయలేదు
- కొందరు పోలీసుల తీరుపై సుప్రీంకోర్టుకు వెళ్తాం
- పర్యావరణ ధ్వంసంపై విచారణ చేపట్టాలి: కేటీఆర్

10 రోజుల్లో బీజేపీకి కొత్త సారథి!
- పార్టీ జాతీయ అధ్యక్షుడి నియామకంపై ఆరెస్సెస్, బీజేపీ అగ్రనేతల మధ్య ఏకాభిప్రాయం
- మేలో పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ
- 4-5 రాష్ట్రాలకు గవర్నర్ల నియామకాలపై చర్చలు

2

మద్యం ప్రియం

ఆర్థిక లోటు భర్తీ కోసం త్వరలో ధరల పెంపు?

- సర్కారు ముందు రెండు ప్రతిపాదనలు
- బాటిల్‌పై నిర్దిష్ట మొత్తం పెంపు.. పన్నుల పునర్వ్యవస్థీకరణ
- వార్షికాదాయం రూ.4 వేల కోట్ల వరకు పెరిగే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్, 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక లోటు భర్తీకోసం త్వరలో మద్యం ధరలను పెంచడానికి సన్నద్ధమైనట్లు సమాచారం. ఇటీవలే బీర్లపై 15 శాతం ధరలు సర్కారు పెంచిన సంగతి తెలిసిందే. మద్యం ధరల పెంపునకు ప్రభుత్వానికి ఎక్సైజ్‌శాఖ అధికారులు రెండు రకాల ప్రతిపాదనలను సమర్పించారు. మద్యం బాటిల్‌పై రూ.10 చొప్పున పెంచడంతోపాటు పన్నుల విధానం పునఃసమీక్షించి పన్నులను పునర్వ్యవస్థీకరించాలని సూచించినట్లు సమాచారం. బాటిల్‌పై రూ.10 చొప్పున పెంచితే అదనంగా నెలకు రూ.180 కోట్లు.. పన్నుల పునర్వ్యవస్థీకరణతో బాటిల్‌పై రూ.20 చొప్పున రూ.360 కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనాలు రూపొందించారు. దీని ప్రకారం మద్యం అమ్మకాలతో వార్షికాదాయం రూ.2,000 కోట్ల నుంచి రూ.4,000 కోట్ల వరకూ పెరగనున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మద్యం ద్వారా ఆదాయం రూ.27,600 కోట్లు వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. చీప్ లిక్కర్ మినహా ప్రీమియర్ బ్రాండ్ల మద్యం ధరలు పెంచాలని యోచిస్తున్న సర్కార్.. ఈ విషయమై త్వరలోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.



ఎంత దూరం వెళ్తే.. అంతే టోల్ చార్జీ!

- మే 1వ తేదీ నుంచే జీఎన్ఎస్ఎస్ ఆధారిత విధానం
- ఫాస్టాగ్ లేకుండా టోల్ వసూలు
- తొలుత వాణిజ్య వాహనాలకు..
- 2027 నుంచి వ్యక్తిగత వాహనాలకు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: హైవే ఎక్కామంటే చాలు.. టోల్ చార్జీల మోత తప్పదు. పైగా టోల్‌గేట్ల వద్ద రద్దీ సమస్య. ఫాస్టాగ్ సరిగా స్కాన్ కాక సమయం వృథా.. టోల్ కట్టడం ఎలాగూ తప్పదు కానీ.. మిగతా సమస్యలు త్వరలోనే తీరిపోనున్నాయి. అంతేకాదు ఎంత దూరం ప్రయాణిస్తే అంత మేరకే చార్జీ పడుతుంది. టోల్‌గేట్ల వద్ద రద్దీ సమస్యను తీర్చడం, టోల్ వసూలు విధానాన్ని సులభతరం చేయడం కోసం కేంద్రం కొత్తగా తెచ్చిన జీఎన్ఎస్ఎస్ (గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం) ఆధారిత టోల్ విధానం.. మే 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. తొలుత వాణిజ్య వాహనాలకు దీన్ని వర్తింపజేస్తారు. 2027 నుంచి వ్యక్తిగత వాహనాలకు కూడా అమలు చేయనున్నారు. అప్పటి వరకు టోల్ గేట్లు కొనసాగుతాయి.

ఏమిటీ కొత్త విధానం?

మనం ఫోన్లలో వినియోగిస్తున్న జీపీఎస్ తరహా విధానమే జీఎన్ఎస్ఎస్. జీపీఎస్ కేవలం ఒక్క శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థ మాత్రమే. ఇలా గ్లోనాస్ (రష్యా), గెలీలియో (యూరప్), బైదు (చైనా), గగన్, నావిక్ (భారత్) తదితర నావిగేషన్ వ్యవస్థలు కూడా ఉన్నాయి. ఇలాంటి మేజూ ర్వేరు వ్యవస్థలకు చెందిన ఉపగ్రహాలకు ఒకే సమయంలో అనుసంధానమై.. అత్యంత కచ్చితమైన లొకేషన్ గుర్తింపు, నావిగేషన్ పొందే విధానమే జీఎన్ఎస్ఎస్.



వాహనాల్లో ప్రత్యేక పరికరం..

జీఎన్ఎస్ఎస్ టోల్ విధానం అమలు చేసేందుకు బస్సులు, లారీలు, ట్రక్కులు, కార్లు.. ఇలా టోల్ వర్తించే ప్రతి వాహనంలో ఆన్‌బోర్డ్ యూనిట్లు(ఓబీయూ)గా పిలిచే పరికరాలను బిగించుకోవాల్సి ఉంటుంది. ఈ పరికరాలు జీఎన్ఎస్ఎస్ ద్వారా శాటిలైట్లకు అనుసంధానం అవుతాయి. టోల్‌చార్జీలు వర్తించే హైవేలపై ఎక్కడి నుంచి ఎక్కడికి, ఎంతెంత దూరం సదరు వాహనం ప్రయాణించినదీ నమోదవుతూ ఉంటుంది. ఆ మేరకు నిర్ధారించిన టోల్ చార్జీల సొమ్ము వ్యాలెట్లు లేదా బ్యాంకు ఖాతాల్లోంచి కట్ అవుతుంది. ఈ పరికరం కోసం ఒక్కో వాహనానికి రూ.4 వేల వరకు ఖర్చు అవుతుందని అంచనా.

దీనిద్వారా వాహనాలు ఏయే రోడ్లపై, ఎంతెంత దూరం ప్రయాణించాయన్నది కచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

లోకం తీరు



భర్తను చంపి.. పాము కాటు అని నమ్మించి..

- ప్రియుడితో కలిసి భార్య ఘాతుకం
- గొంతు పిసికి చంపారని తేల్చిన పోస్టుమార్టం నివేదిక

మీరట్, ఏప్రిల్ 17: యూపీలోని మేరఠ్‌లో మరో ఘోరం వెలుగుచూసింది. ఇటీవల నేవీ అధికారి, 29 ఏళ్ల సౌరభ్ రాజ్‌పుత్‌ను అతడి భార్య, ఆమె ప్రియుడు కలిసి హత్యచేసి.. మృతదేహాన్ని ముక్కలుగా నరికి.. ఆ అవశేషాలను ఒక ప్లాస్టిక్ డ్రమ్‌లో ఉంచి పైనుంచి సిమెంట్‌తో కప్పిపెట్టిన ఘటన తరహాలోనే మరో నేరం జరిగింది. 25 ఏళ్ల అమిత్ కశ్యప్ అనే యువకుడిని అతడి భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి గొంతు పిసికి చంపారు. హత్యానేరం నుంచి బయటపడేందుకు రవిత పెద్ద ప్రణాళికే వేసింది. తన భర్త పాము కాటుకు గురై మరణించాడని లోకాన్ని నమ్మించేందుకు వెయ్యి రూపాయలు పెట్టి ఓ పామును కొనుగోలు చేసింది. హత్యచేసిన తర్వాత రాత్రి అతడి దుస్తుల్లోకి పామును వదిలింది. మరుసటి రోజు పాము కాటుతోనే తన భర్త చనిపోయాడంటూ చుట్టుపక్కల వారి ఎదుట గగ్గోలు పెట్టింది. మృతదేహంపై పదిచోట్ల పాము కాట్లు కనిపించడంతో తొలుత ఎవ్వరికీ అనుమానం కలగలేదు. అయితే పోస్టుమార్టం నివేదిక.. అమిత్‌ను గొంతు నులిమి చంపారంటూ తేల్చడంతో రవిత, ఆమె అమర్‌దీప్ నేరం అంగీకరించక తప్పలేదు. వాస్తవానికి అమిత్, అమర్‌దీప్ స్నేహితులు. ఈ స్నేహంనెపంతోనే తరచూ అమిత్ ఇంటికొచ్చే అమర్‌దీప్, అతడి భార్య రవితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇది అమిత్‌కు తెలియడంతో అతడికి, రవితకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్తను హత్యచేసినా.. నేరం మాత్రం తనపై పడకూడదనే ప్రణాళికతో రవిత వ్యవహరించినా ఆమెతో పాటు ప్రియుడు పోలీసులకు దొరికిపోక తప్పలేదు.

కర్ణాటకలో కులగణన సర్వేపై ప్రతిష్టంభన!

- మంత్రుల మధ్య భిన్నాభిప్రాయాలు
- అర్ధంతరంగా ముగిసిన క్యాబినెట్ భేటీ

బెంగళూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కులగణన సర్వే నివేదికపై ప్రతిష్టంభన నెలకొంది. విద్య, సామాజిక, ఆర్థిక అంశాలపై బీసీ కమిషన్ సమర్పించిన నివేదికపై ఏటూ తేల్చకుండానే గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో కు లగణన నివేదికలోని అంశాలపై మంత్రుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా నివేదికను అంగీకరించలేమని తేల్చిచెప్పినట్లు తెలిసింది. దీంతో క్యాబినెట్ భేటీ అనంతరం విధానసౌధ నుంచి బయటకు వచ్చే సమయంలో సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడేందుకు సుముఖత చూపలేదు. మరోసారి చర్చిస్తామని చెప్పి వెళ్లిపోయారు. వచ్చే క్యాబినెట్ భేటీలోనూ తీర్మానం జరగకపోవచ్చని, మరో రెండు మూడు సమావేశాలు జరగవచ్చని మంత్రులు ఎంబీ పాటిల్, రాజణ్ణ, చలువరాయస్వామి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. భేటీలో నివేదిక వివరాలను సిద్దరామయ్య తన సహచర మంత్రులకు వివరించారు. గత వారం రోజుల్లో నివేదికపై ఎంత మేర అవగాహన పొందారని ప్రశ్నించారు. అంతలోనే మంత్రు లు తలో మాట మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. దీంతో కాసేపు వినాలని సీఎం వారిని కోరారు. నివేదికపై కొందరు మంత్రులు మద్దతుగా, మరికొందరు వ్యతిరేకంగా మాట్లాడినట్లు తెలిసింది. దీంతో సమగ్ర చర్చ లేకుండా, మంత్రులందరూ అభిప్రాయాలు వ్యక్తం చేయకుండానే క్యాబినెట్ సమావేశాన్ని అర్ధంతరంగా ముగించారు.

ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రధాని సిద్ధమయ్యారు!

గొడవ పడొద్దు.. కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంకు ఖర్గే సూచన

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి పదవి కోసం మీరిద్దరూ గొడవ పడకండి. ప్రధాని మోదీ కర్ణాటకలో ప్రభుత్వాన్ని కూల్చేందుకు సిద్ధమయ్యారు' అని సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. తన సొంతూరు కలబురిగిలో బుధవారం జాబ్‌మేళా ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం, డిప్యూటీ సీఎం గొడవ పడటాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వాన్ని కూల్చేందుకు మోదీ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుట్రల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిద్దరామయ్య, శివకుమార్‌ను హెచ్చరించారు. నేషనల్ హెరాల్డ్ వివాదంలో కేంద్రం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీని బెదిరించాలని చూస్తోందని, కానీ గాంధీ కుటుంబం ఎప్పటికీ భయపడదని ఖర్గే స్పష్టంచేశారు. రాష్ట్రంలో కులగణన సర్వే నివేదికను తాను చూడలేదని తెలిపారు.

తుది కీ విడుదల.. గంటలోపే తొలగింపు!

- జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గందరగోళం
- ఎలాంటి ప్రకటనా చేయని ఎన్టీఏ.. విద్యార్థుల్లో ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలపై గందరగోళం నెలకొంది. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఈ పరీక్షల ఫలితాల విడుదలపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) తర్జనభర్జన పడుతోంది. జనవరిలో జరిగిన తొలి విడత పరీక్షల ఫలితాలు ఇప్పటికే విడుదలవగా.. ఏప్రిల్ 2-9 మధ్య జరిగిన రెండో విడత పరీక్షల ఫలితాలపై ఎన్టీఏ మల్లగుల్లాలు పడుతోంది. ఈ పరీక్షలకు సంబంధించి ప్రాథమిక కీని ఈ నెల 11న విడుదల చేసింది. అయితే ఇందులో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లోని 9 ప్రశ్నలకు తప్పుడు సమాధానాలున్నాయని పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. ఆ తప్పులు సవరించి, తుది కీ విడుదల చేస్తామని ఎన్టీఏ తెలిపింది. కీతో పాటు ఫలితాలు గురువారం విడుదల చేస్తామని పేర్కొంది. కానీ, గురువారం తుది కీని అధికారిక వెబ్‌సైట్లో విడుదల చేసిన ఎన్టీఏ.. గంటలోపే దాన్ని తొలగించింది. ఈ తొలగింపుపై ఎన్టీఏ ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్స్ రాసిన 12 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. తప్పులు సవరించి తుది కీ విడుదల చేసిన తర్వాత జేఈఈ మెయిన్స్ రెండు పరీక్షల్లోని ఉత్తమ ఫలితాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను కేటాయిస్తారు.

21, 22వ తేదీల్లో అమెరికాలో రాహుల్ పర్యటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈనెల 21, 22 తేదీల్లో అమెరికాలో పర్యటిస్తారని ఆ పార్టీ నేత పవన్ ఖేరా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్సిటీలో అధ్యాపకులు, విద్యార్థులతో జరిగే ముఖాముఖిలో పాల్గొంటారని తెలిపారు. అంతకుముందు ప్రవాస భారతీయులు, ప్రవాస భారత కాంగ్రెస్ సభ్యులతో సమావేశమవుతారన్నారు. 2024లోనూ రాహుల్ తన అమెరికా పర్యటనలో టెక్సాస్ యూనివర్సిటీ, జార్జిటౌన్ వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశమయ్యారు.

సుప్రీంకు ఆ అధికారం అణు క్షిపణిలా మారింది!

(మొదటిపేజీ తరువాయి)

అంశాలను ప్రస్తావిస్తూ... న్యాయవ్యవస్థ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

పాలకులూ వారే అన్నట్టుగా..

"రాష్ట్రపతికే ఆదేశాలు జారీ చేస్తున్నామంటే మనం ఎక్కడికి వెళుతున్నామో తెలియడం లేదు. ఇది కోర్టులో సమీక్ష పిటిషన్ వేయాల్సిన చిన్న విషయం కాదు. నిర్దిష్టకాలంలో రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకుంటే చట్టంగా మారినట్లే అని సుప్రీంకోర్టు పేర్కొంది. అంటే న్యాయమూర్తులే చట్టాలు చేస్తున్నారు. వారే కార్యనిర్వాహక విధులు నిర్వహిస్తున్నారు. అంటే సూపర్ పార్లమెంట్‌గా వ్యవహరిస్తున్నారు. కానీ వారికి ఏమాత్రం జవాబుదారీ లేదు. ఎందుకంటే చట్టాలు వారికి వర్తించవు" అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు.

వారు చట్టాలకు అతీతమా?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నగదు దొరకడాన్ని ప్రస్తావిస్తూ ధన్‌ఖడ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మార్చి 14న రాత్రి జడ్జి నివాసంలో జరిగిన ఘటన గురించి వారం దాకా ఎవరికీ తెలియదు. ఎందుకీ ఆలస్యం? అది సమర్థనీయమేనా? సాధారణ న్యాయసూత్రాల ప్రకారం పరిస్థితి వేరుగా ఉండేది. కానీ జడ్జి కాబట్టి భిన్నంగా జరిగింది. మార్చి 21న ఓ వార్తాపత్రికలో ఈ విషయం చూసి దేశ ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. కానీ ఆ న్యాయమూర్తిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ దాఖలు కాలేదు. ఉప రాష్ట్రపతి అయిన నాతో సహా దేశంలో ఎవరిపై అయినా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు. రూల్ ఆఫ్ లాను అమలు చేసేందుకు ఏ అనుమతీ అక్కర్లేదు. కానీ న్యాయమూర్తులపై నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేం. న్యాయ వ్యవస్థలో సంబంధిత వ్యక్తులు ఆమోదించాల్సి ఉంటుంది. దేశంలో రాష్ట్రపతి, గవర్నర్‌లకు మాత్రమే ప్రాసిక్యూషన్ నుంచి రాజ్యాంగం మినహాయింపు ఇచ్చింది. కానీ న్యాయమూర్తులకు అందుకు అతీతంగా ఎలా మినహాయింపు అందుతోంది?" అని ధన్‌ఖడ్ నిలదీశారు. భారీగా నగదు దొరకడాన్ని ప్రస్తావిస్తూ.. మరెవరి విషయంలోనైనా ఇలా జరిగి ఉంటే రాకెట్ వేగంతో విచారణ సాగేదని, కానీ ఈ విషయంలో ఎడ్లబండి నడకలా కూడా సాగడం లేదని వ్యాఖ్యానించారు. దర్యాప్తు అనేది కార్యనిర్వాహక వర్గం బాధ్యత అని ధన్‌ఖడ్ గుర్తుచేశారు. జడ్జి ఇంట్లో నగదు దొరికిన కేసును పోలీసు దర్యాప్తు చేయకుండా.. ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ ఎందుకు విచారిస్తోందని ప్రశ్నించారు. ఆ జడ్జీల కమిటీకి పార్లమెంట్ చేసిన ఏ చట్టం నుంచైనా అనుమతి లభించిందా? అని నిలదీశారు. అయినా జడ్జీల కమిటీ మహా అయితే సిఫార్సు చేస్తుందని, దానికి ఎలాంటి చట్టబద్ధత ఉండదని స్పష్టం చేశారు. చివరికి పార్లమెంట్ మాత్రమే చర్య తీసుకోగలదని తెలిపారు.



విశ్వాసం తగ్గిపోతోంది..

న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం రోజురోజుకూ తగ్గిపోతోందని, ఇటీవల ఒక మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో తేలిందని ఉప రాష్ట్రపతి చెప్పారు. న్యాయవ్యవస్థ, చట్టసభలు, కార్యనిర్వాహకవర్గం పారదర్శకంగా, జవాబుదారీగా వ్యవహరించాలని సూచించారు. చట్టం ముందు అందరూ సమానమనే దాన్ని విస్మరించవద్దని సూచించారు. న్యాయవ్యవస్థే ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తే ఎలాగని, అది ఎవరికి జవాబుదారీ అవుతుందని ప్రశ్నించారు. ఈ ఏడాది జనవరి 27న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల లోక్‌పాల్ బెంచ్.. కొందరు హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టిందని ధన్‌ఖడ్ గుర్తుచేశారు. కానీ దానిని సుప్రీంకోర్టు తనంతట తానే స్వాధీనంలోకి తీసుకుందన్నారు. ఇతర దేశాల్లో న్యాయవ్యవస్థలు ఇలా తమంతట తాము విచారణలను స్వాధీనంలోకి తీసుకున్న సందర్భాలు లేవని స్పష్టం చేశారు. సంస్థలు పారదర్శకతతో వ్యవహరించాలని, దర్యాప్తులు, విచారణలు లేనప్పుడు పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. ఎలాంటి పరిశీలన లేకుండా వ్యక్తులకు మనం ఆరాధనీయమైన స్థానం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లం!

(మొదటిపేజీ తరువాయి)

చేసిందని.. ప్రభుత్వ వాదనలు వినకుండా స్టే ఇవ్వడం సరికాదని వాదించారు. ప్రైవేటు ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించారంటూ దేశవ్యాప్తంగా లక్షల కొద్దీ విజ్ఞప్తులు రావడం వల్లే పార్లమెంటు వక్ఫ్ చట్టాన్ని సవరించిందని వివరించారు. కేవలం ఆయా సెక్షన్లను పైపైన చదివి చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. వారం గడువు ఇవ్వడం వల్ల వక్ఫ్ ఆస్తులకు వచ్చే ముప్పేమీ ఉండదని.. స్టే ఇవ్వడం వంటి కఠిన చర్యలు చేపట్టవద్దని విజ్ఞప్తి చేశారు.

తదుపరి విచారణ వరకు వాటి జోలికి వెళ్లం..

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలతో సంతృప్తి చెందని ధర్మాసనం.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికే మొగ్గు చూపింది. ప్రస్తుతం పరిస్థితి వేరుగా ఉందని, సమస్యలు కనిపిస్తున్నాయని పేర్కొంది. దీనితో తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లబోమని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు. దీనిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుని స్టే పై వెనక్కితగ్గింది. "తదుపరి విచారణ వరకు 'వక్ఫ్ బై యూజర్', బోర్డులు సహా ఎలాంటి వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయబోమని సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు. సవరణ చట్టంలోని 9, 14 సెక్షన్ల కింద ఎలాంటి నియామకాలు చేపట్టబోమని, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో నియమించబోమని చెప్పారు. ఈ అంశాలను నమోదు చేసుకుంటున్నాం" అని ధర్మాసనం పేర్కొంది. కౌంటర్ దాఖలు చేయడానికి వారం రోజులు గడువు ఇస్తున్నామని తెలిపింది. ప్రభుత్వం కౌంటర్ వేశాక.. దానిపై ఐదు రోజుల్లోగా రిజాయిండర్లు వేయాలని పిటిషనర్లకు సూచించింది.

ఐదు పిటిషన్లపైనే వాదనలు వింటాం..

పిటిషన్లు ఎక్కువ సంఖ్యలో ఉన్న నేపథ్యంలో అందులో ఐదింటిలోనే వాదనలు వింటామని ధర్మాసనం తెలిపింది. ఇందుకోసం ముగ్గురు న్యాయవాదులను నోడల్ కౌన్సెల్‌గా నియమిస్తామని, ఎవరెవరు అందులో ఉండి వాదనలు వినిపిస్తారో మీరే నిర్ణయించుకోండి అని సూచించింది. విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజున వక్ఫ్ చట్టంపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

10 రోజుల్లో బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

- మేలో పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ
- 4-5 రాష్ట్రాల్లో గవర్నర్ల నియామకాలపై చర్చలు
- సంఘ్ మార్గదర్శకత్వంలో భారీ మార్పులు?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలో రాజకీయంగా స్తబ్దత నెలకొన్నప్పటికీ.. అది తుఫాను ముందు ప్రశాంతతలాగా కనిపిస్తోంది. త్వరలో భారతీయ జనతా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలక మార్పులు జరగనున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. ఆ వర్గాలు చెబుతున్న దాని ప్రకారం.. మరో వారం పది రోజుల్లో బీజేపీకి జాతీయ అధ్యక్షుడు రానున్నారు. పార్టీపై పూర్తిగా పట్టుబిగించి ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయనున్న బలమైన నేతనే పార్టీ అధ్యక్షుడుగా నియమించే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేతలకు, బీజేపీ అగ్రనేతలకు మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, హరియాణా సహా పలు రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను నియమించేందుకు కూడా కసరత్తు పూర్తయినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. అలాగే.. పార్టీలో సిద్ధాంతానికి కట్టుబడి ఉండే నేతలను ప్రధాన కార్యదర్శులుగా, కార్యదర్శులుగా నియమించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. మే నెలలో ప్రధాని మోదీ పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరపనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. పార్టీతో సంబంధం లేని ఐఏఎస్, ఐపీఎస్, ఇతర నేతలను తప్పించి.. పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేస్తున్నవారికి అవకాశం కల్పించనున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. పార్టీలోనూ, మంత్రివర్గంలోనూ యువ నేతలకు కూడా కీలక ప్రాధాన్యం కల్పించనున్నట్లు తెలిసింది. నాలుగైదు రాష్ట్రాల్లో గవర్నర్లను కూడా నియమించే విషయంపై చర్చలు జరిగినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

అప్పట్నుంచీ..

రెండు వారాల క్రితం నాగపూర్‌లో సంఘ్ కార్యాలయానికి వెళ్లొచ్చిన నాటి నుంచీ మోదీ ఎక్కువగా బయటి కార్యక్రమాలు పెట్టుకోకుండా ఢిల్లీలోనే తన అంతరంగికులతో విస్తృత చర్చలు జరుపుతున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సైతం కలుసుకుని సుదీర్ఘ మంతనాలు జరిపారు. శనివారం జరగాల్సిన ప్రధాని జమ్ముకశ్మీర్ పర్యటన కూడా వర్షాల పేరుతో వాయిదా పడింది. మరోవైపు హోంమంత్రి అమిత్ షా కూడా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో చర్చలు జరిపారు. మోదీ కూడా వీరితో మంతనాలు జరిపినట్లు సమాచారం.

సంఘ్ నిర్దేశకత్వంలో..

హరియాణా, మహారాష్ట్రలో పార్టీ విజయానికి పనిచేసిన ఆర్ఎస్ఎస్ దేశంలో వివిధ రాష్ట్రాల్లో తమ ఫార్ములాలకు అనుగుణంగా బీజేపీ పనిచేసేందుకు దిశా నిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగానే తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైను తొలగించి అన్నాడీఎంకే నేతృత్వంలో పనిచేయాలని బీజేపీ నిర్ణయించింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ లేవనెత్తిన భాష, తదితర అంశాల నేపథ్యంలో దక్షిణాదికి, ఉత్తరాదికి మధ్య అగాథం ఏర్పడకుండా జాగ్రత్తపడాలని సంఘ్ సూచించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే.. అన్నామలైను కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకునే అవకాశం కూడా లేకపోలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. గత ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతో చేతులు కలపడం కూడా సంఘ్ ఫార్ములా ప్రకారమే జరిగిందని.. తెలంగాణలో కూడా అలాంటి ఫార్ములాను రూపొందించేందుకు కసరత్తు జరుగుతోందని ఆ వర్గాలు తెలిపాయి.

పర్యావరణ అంశాల్లో సీఈసీ కీలకం

- సుప్రీంకోర్టుకు జ్ఞానేంద్రియాల మాదిరి సంస్థ
- సంక్లిష్ట కేసుల్లో అత్యున్నత న్యాయస్థానానికి సహాయం
- కేంద్ర సాధికార కమిటీగా ప్రత్యేక అధికారాలు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాధికార కమిటీ.. క్లుప్తంగా సీఈసీ..! కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టుకు ఇటీవల సీఈసీ ఓ సమగ్ర నివేదికను సమర్పించింది. దీంతో.. ఇప్పుడు సీఈసీపై చర్చ ఊపందుకుంది. పర్యావరణ అంశాల్లో సుప్రీంకోర్టుకు కళ్లు, ముక్కు, చెవులు వంటి జ్ఞానేంద్రియాలుగా సీఈసీ పనిచేస్తుంది. 2002లో ఏర్పాటైనా.. 2008లో పరిధి విస్తృతమై.. ప్రత్యేక అధికారాలను అందిపుచ్చుకున్న సీఈసీ ఒక్కసారి 'నో' చెబితే.. కేంద్ర పర్యావరణ అనుమతులు రావడం అసాధ్యమే..! అంతెందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. అప్పటి సీఎం వైఎస్ఆర్ హయాంలో సంచలనం సృష్టించిన ఓబులాపురం మైనింగ్‌కు సంబంధించి, బళ్లారి రిజర్వ్ ఫారె స్ట్‌లో తవ్వకాలపై ఈ సంస్థ విచారణ చేపట్టి, మైనింగ్ లీజులను రద్దు చేయాలని సిఫార్సు చేసింది.

పర్యావరణం కోసమే ఏర్పాటు

1995లో మొదలైన 'టీఎన్ గోదావర్మన్ తిరుమల్‌పాడ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో కేంద్ర స్థాయిలో ఓ సాధికార కమిటీ అవసరమని అభిప్రాయపడ్డ సుప్రీంకోర్టు.. 2002 మే 9న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ(సీఈసీ)ని నియమించింది. అలా సీఈసీ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత వివిధ రాష్ట్రాల్లోని పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాల పరిరక్షణకు ఈ సంస్థ కృషి చేసింది. అటవీ, పర్యావరణ పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, మొక్కల పెంపకం, జరిగిన నష్టానికి పరిహారంగా అడవుల పెంపకం(రిజర్వ్ ఫారెస్ట్), ప్రణాళికల అమలు తదితర అంశాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయడంలో ఈ కమిటీ కీలక పాత్ర పోషిస్తోంది. జాతీయ స్థాయి అధికార పరిధి కలిగిన ఈ కమిటీ.. అత్యున్నత న్యాయస్థానం తీర్పులను అమలును పర్యవేక్షించడంతోపాటు.. ఆదేశాలు అమలు కాని కేసులను సుప్రీంకోర్టు కు నివేదిస్తుంది. దేశంలో ఎక్కడ పర్యావరణ నిబంధనల అమలు విషయంలో ఉల్లంఘనలు చోటుచేసుకున్నా.. సుప్రీంకోర్టుకు నివేదిస్తుంది. అంతేకాదు.. పర్యావరణానికి సంబంధించిన కేసుల్లో తగిన చర్యల కోసం కేంద్ర ప్రభుత్వానికి సైతం నివేదికలిస్తుంది. ఆయా కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వాల నివేదికలను క్రోడీకరించి, తన సిఫార్సులను కోర్టుకు అందజేస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో భాగంగా ఏ వ్యక్తి నుంచై నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుంచైనా తగిన డాక్యుమెంట్లు సమర్పించాలని ఆదేశిస్తుంది. అటవీ వివాదాల్లో.. వివాదాస్పద ప్రాంతా ల సందర్శన, పరిష్కారానికి తగిన విధంగా ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు లేదా అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌లను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచి, సహాయం కోరుతుంది.

ఒక చెట్టును తొలగించాలన్నా.. సీఈసీ సిఫార్సు తప్పనిసరి



రక్షిత అటవీ ప్రాంతం(రిజర్వ్ ఫారెస్ట్)లో ఒక్క చెట్టును తొలగించాలన్నా సీఈసీ సిఫార్సు లేకుండా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతులివ్వదు. రిజర్వు ఫారెస్ట్ కాకుండా.. అటవీ తరహా ప్రాంతాల్లోనూ పనులను చేపట్టాలంటే సీఈసీ సిఫార్సు తప్పనిసరి. అటవీ తరహా భూములుగా పేర్కొంటున్న కంచ గచ్చిబౌలి ప్రాంతంలో "చెట్లను తొలగించే ముందు అనుమతి తీసుకున్నారా?" అంటూ సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయం తెలిసిందే..! దేశవ్యాప్తంగా పర్యావరణం, అటవీ, జీవ వైవిధ్యం వంటి అంశాల్లో నిబంధనల ఉల్లంఘన జరగకుండా అన్ని పర్యావరణ, అటవీ చట్టాలు అమలయ్యేలా ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. సుప్రీంకోర్టుతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సైతం సలహాలు, సూచనలు, సిఫార్సులు అందజేస్తుంది.

- చిక్కుడు ప్రభాకర్, ప్రముఖ న్యాయవాది(హైకోర్టు)

ముంచుకొస్తోంది ముహూర్తాల వేళ!

- తెలుగు రాష్ట్రాల్లో ఊపందుకోనున్న పెళ్లిళ్లు
- ఈ నెలలో 18, 20, 23, 30వ తేదీల్లో.. మేలో 11 రోజులు
- జూన్‌లో 4 రోజులే.. మళ్లీ జూలై 26 తర్వాత 10 రోజులు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వివాహ ముహూర్తాలు ఉన్నాయి.. అలా అని ఎక్కువగా లేవు! అందుకే.. పెళ్లి చూపులు.. వివాహ నిశ్చితార్థాలు జరిగిన జంటలకు పెళ్లి పీటలెక్కించేందుకు ఈ మంచి తరుణం మించిన దొరకదు. ఆషాఢం వచ్చేస్తుండటంతో ఆలోపే చైత్ర, వైశాఖ, జ్యేష్ఠ మాసాల్లో ఉన్న కొద్దిపాటి ముహూర్తాల్లో పెళ్లిళ్లు చేసేందుకు పెద్దలు నిర్ణయిం తీసుకుంటున్నారు. ఫలితంగా తెలంగాణ, ఏపీలో మళ్లీ పెళ్లిళ్ల సందడి ఇక జోరందుకోనుంది. వాస్తవానికి ఈనెల 12నే శుభ ముహూర్తాలు మొదలయ్యాయి. ఈనెలలో 18, 20, 23, 30 తేదీల్లోనే ముహూర్తాలు మిగిలి ఉన్నాయి. మే నెల ఫస్ట్ తారీఖు నుంచి 28వ తేదీ వరకు 11 రోజులే ముహూర్తాలున్నాయి. తర్వాత జూన్‌లో కేవలం 4 రోజులే శుభ ముహూర్తాలున్నాయి. తర్వాత వచ్చేది ఆషాఢమాసం.. పెళ్లిళ్ల ముచ్చటే ఉండదు. జూలైలో 26 నుంచి ఆగస్టు 18 వరకు కొన్ని ముహూర్తాలున్నాయి. ఆగస్టు-సెప్టెంబరులో శూన్య మాసం ఉండటంతో సెప్టెంబరు 22వ తేదీ నుంచి కొన్నే మంచిరోజులున్నాయి. తర్వాత నవంబరు 20న.. ఆ తర్వాత కొన్ని రోజులే పెళ్లిళ్లకు అనువైన ముహూర్తాలున్నాయి. ఈ రోజులు ముగిస్తే ఇక వచ్చే ఏడాది 15వ తేదీ వరకు ముహూర్తాలేలేవు. మొత్తమ్మీద కొన్ని ముహూర్తాలే ఉండటంతో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ పెరిగింది. కాగా పెళ్లిళ్ల ఖర్చుల విషయంలో అమ్మాయి, అబ్బాయి తరఫు వాళ్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారని పురోహితులు, ఫంక్షన్‌హాళ్ల యజమానులు చెబుతున్నారు.

(ఫైల్)



శ్రీశైలం ప్లంజ్‌పూల్ వద్ద గొయ్యి పూడ్చివేతపై అధ్యయనం

- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీకి బాధ్యత.. జలవనరుల శాఖ ఉత్తర్వులు

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యిని పూడ్చేందుకు పాటించాల్సిన మెథడాలజీపై అధ్యయనం చేసే బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీకి ప్రభుత్వం అప్పగించింది. అధ్యయనం చేసే సమయంలో వీడియో రికార్డింగ్ చేయాల్సి ఉందని కర్నూలు జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ తెలియజేయగా.. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న జలవనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు రూ.51 లక్షలు చెల్లించనున్నట్లు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2009 వరదల సమయంలో శ్రీశైలం జలాశయం ముందు భాగాన యాప్రాన్ ప్రాంతంలో ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన ఈ భారీ గొయ్యి డ్యాంకే పెను ప్రమాదంగా మారుతుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని జాతీయ జలాశయ భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ)ను పదే పదే కోరుతున్నాయి. ఆ సంస్థ నిన్నమొన్నటి వరకు దాటవేత ధోరణి ప్రదర్శిస్తూ వచ్చింది. అయితే ఇటీవల సదరు గొయ్యితో జలాశయానికి భారీ ముప్పు పొంచి ఉందని జాతీయ స్థాయి పరిశోధనా సంస్థలు, జల వనరుల నిపుణులు కేంద్రానికి హెచ్చరికలు చేశారు. దరిమిలా ఈ నెల 28న ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలోని బృందం విజయవాడ రానుంది. సాయిప్రసాద్‌తో సమావేశమవుతుంది. మర్నాడు శ్రీశైలం వెళ్లి ఆ గొయ్యిని పరిశీలిస్తుంది. అక్కడే ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అవుతుంది. 30వ తేదీన తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమవుతుంది. ఆ తర్వాత గొయ్యి పూడ్చివేతకు అనుసరించాల్సిన పద్ధతి, అంచనా వ్యయంపై నిర్ణయం తీసుకుంటుందని జల వనరుల శాఖ అధికారులు తెలియజేశారు.

సోనియా, రాహుల్‌పై మోదీ కక్ష సాధింపు

గుజరాత్‌లో ఓటమి భయంతోనే కేసులు.. ఈడీ ఆఫీసు వద్ద ధర్నాలో మీనాక్షీ నటరాజన్

- దేశంలో కులగణనను అడ్డుకోవడానికే: భట్టి
- ప్రజల దృష్టి మరల్చేందుకు కేసులు: మంత్రి దుద్దిళ్ల
- రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగమే: మహేష్
- గన్‌పార్కు నుంచి ఈడీ ఆఫీసుకు కాంగ్రెస్ ర్యాలీ
- మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు బైఠాయించి ధర్నా



హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న మీనాక్షీ నటరాజన్, చిత్రంలో మంత్రులు, నాయకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పార్లమెంట్ సాక్షిగా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించబోతున్నామని రాహుల్ గాంధీ ప్రకటించడంతోనే మోదీ ప్రభుత్వానికి భయం పుట్టుకుందని, అందులో భాగంగానే నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌గాంధీలను చేర్చి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఆరోపించారు. గురువారం టీపీసీసీ ఆధ్వర్యంలో గన్‌పార్కు అమరవీరుల స్థూపం నుంచి బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈడీ ఆఫీసు ఎదుట మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, నేతలు బైఠాయించి ధర్నా చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు బీ.మహేష్ కుమార్‌గౌడ్ సారథ్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో మీనాక్షీ నటరాజన్ మాట్లాడుతూ.. గుజరాత్‌లో ఓడిపోతే ఆ ప్రభావం దేశవ్యాప్తంగా పడుతుందనే భయంతోనే అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, ఈ పద్ధతిని మార్చుకోకపోతే ప్రజలే మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దేశంలో కులగణనను అడ్డుకోవడానికే సోనియా, రాహుల్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని ఈడీ వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని ధ్వజమెత్తారు. మోదీ, అమిత్‌షాల డైరెక్షన్‌లోనే సోనియా, రాహుల్‌పై ఈడీ చార్జిషీటు దాఖలు చేసిందని మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశ సంపదను అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నారని, దానిని వ్యతిరేకిస్తే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే రాహుల్, సోనియాలపై అక్రమ కేసులు బనాయించారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, ఎం.అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు శంకరయ్య, రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్ పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల్లో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జిషీట్‌లో చేర్చినందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. హనుమకొండలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా శాయంపేట, భూపాలపల్లిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నల్లగొండలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు (ఎం)లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నేతృత్వంలో రాస్తారోకో నిర్వహించారు. ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగిన భారీ నిరసన ప్రదర్శనలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొన్నారు. అలాగే, వరంగల్, పెద్దపల్లి జిల్లా గోదావరిఖని, కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లోనూ నిరసనలు కొనసాగాయి.

జగన్ అక్రమాస్తుల కేసులో.. దాల్మియా సిమెంట్ ఆస్తులు జప్తు

- వాటి విలువ రూ.793 కోట్లు: ఈడీ

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ (డీబీసీఎల్)కు చెందిన రూ.793.34 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. హైదరాబాద్‌లో ఉన్న డీబీసీఎల్ భూమిని ప్రొవిజనల్ ఎటాచ్‌మెంట్ చేశామని, గతంలో ఆ కంపెనీ రూ.377.26 కోట్లతో ఆ భూమిని కొనుగోలు చేసిందని ఈడీ వెల్లడించింది. జగన్మోహన్‌రెడ్డికి చెందిన భారతీ సిమెంట్స్‌లో దాల్మియా సిమెంట్స్ పెట్టుబడులపై 2011లో సీబీఐ కేసు నమోదు చేసిందని, ఆ కేసు ఆధారంగా డీబీసీఎల్ ఆస్తుల జప్తునకు ఆదేశాలిచ్చామని తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా మనీలాండరింగ్ చట్టాన్ని (2002) ఆ కంపెనీ ఉల్లంఘించినట్లు పేర్కొంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికార పలుకుబడిని ఉపయోగించి ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి భారతీ సిమెంట్స్‌కు భారీ ఎత్తున ఈక్విటీని, రుణాలను సమీకరించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందని సీబీఐ గతంలో వెల్లడించింది. తాజాగా ఈడీ అవే అభియోగాలతో డీబీసీఎల్ ఆస్తుల జప్తునకు ఆదేశాలు జారీ చేసింది.

ఎంఐఎంకు కాంగ్రెస్ దూరమే

రాజకీయంగా ఇది రాహుల్ గాంధీ వైఖరి .. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్

- లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షలో వెల్లడి
- హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్ నేతలకు దిశానిర్దేశం
- పదవులు లేవని, అధికారులు మాట వినడం లేదని నేతల ఫిర్యాదు



హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్ దూరంగానే ఉంటుందని, ఇది రాహుల్ గాంధీ వైఖరి అని కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో కొన్ని అంశాలపై ఎంఐఎంకు మద్దతుగా ఉన్నంత మాత్రాన ఆ పార్టీతో కలిసినట్టు కాదని వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల నేతలలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఎంఐఎం పార్టీకి ప్రాధాన్యం ఇవ్వడంపై అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్ తదితర నేతలు ఈ సమావేశంలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంఐఎంకి ప్రాధాన్యమిస్తే హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఎలా బలోపేతం అవుతుందని అడిగారు. ఇందుకు స్పందించిన మీనాక్షీ నటరాజన్.. ఎంఐఎం పట్ల కాంగ్రెస్ వైఖరిని వివరించారు. ఇక, పార్టీ అధికారం చేపట్టి 15 నెలలు అవుతున్నా.. అధికారం వచ్చేందుకు క్షేత్రస్థాయిలో శ్రమించిన నేతలకు ఇప్పటికీ పదవులు రాలేదని, అధికారులు, పోలీసులు తమ మాట వినడం లేదని పలువురు నేతలు మీనాక్షి ముందు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏళ్లుగా పార్టీలో ఉన్నవారికి కాకుండా కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యం లభిస్తోందని వాపోయారు. అలాగే, మంత్రితో ముఖాముఖీ కార్యక్రమం అటకెక్కిందని, మంత్రులు డీసీసీ కార్యాలయాలకు వెళ్లి కార్యకర్తలను కలవడం లేదని పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన మీనాక్షీ నటరాజన్.. పార్టీ కార్యకర్తే లేకుంటే మంత్రులు లేరని, ప్రభుత్వమూ వచ్చేది కాదని అన్నారు. గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖీ కార్యక్రమం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రులు జిల్లా పర్యటనల్లో కార్యకర్తలను కలిసేలా చేస్తామన్నారు. ఎప్పట్నించో పార్టీలో ఉన్న వారికి పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవ్వాలని, ఇందిరమ్మ కమిటీలను క్రియాశీలం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, సీనియర్ నాయకులు వి.హన్మంతరావు, షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు. కాగా, చేవెళ్ల, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో మీనాక్షీ నటరాజన్ శుక్రవారం సమీక్ష నిర్వహిస్తారు.

ప్రకాశం బ్యారేజీలో దూకి ఆత్మహత్య

చిట్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్రబెల్లి స్రవంతి (35) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ ప్రకాశం బ్యారేజీలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్యాల మండలంలోని చింతకుంటరామయ్యపల్లి గ్రామానికి చెందిన సంపెల్లి రవీందర్‌రావు, వనక్క దంపతుల కుమార్తె స్రవంతిని బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్రబెల్లి నర్సింగరావు, బక్కమ్మల కుమారుడు రాజేశ్వర్‌రావుతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. రాజేశ్వర్‌రావు హనుమకొండలోని ఓ ప్రైవేటు కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూ భార్య స్రవంతితో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. 40 రోజుల క్రితం మగ బిడ్డకు జన్మనిచ్చిన స్రవంతి మానసికంగా ఇబ్బందులు పడుతోంది. ఈనెల 15న తెల్లవారుజామున ఇంటి నుంచి ఆమె బయటకు వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఓ మహిళ ప్రకాశం బ్యారేజీలో దూకి ఆత్మహత్య చేసుకుందంటూ ఫొటోతో పాటు వివరాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గురువారం అది చూసిన కుటుంబ సభ్యులు ఆమె స్రవంతిగా గుర్తించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

చౌదరిగూడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం చిన్న ఎల్కిచర్లలో ఓ రైతు మృతి చెందాడు. నందిగామ మండలం మోదళ్లగూడ వాసి అశోక్ రెడ్డి (35).. కొందుర్గు మండలం చిన్న ఎల్కిచర్ల శివారులో ఓ రైతు వద్ద పొలం లీజుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఈదురుగాలులతో వచ్చిన వర్షానికి అశోక్‌రెడ్డి లీజుకు తీసుకున్న పొలం వద్ద విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. ఈ సంగతి సంబంధిత విద్యుత్‌శాఖ ఏఈ రవి కుమార్, లైన్‌మెన్ చిన్నరెడ్డికు తెలిపినా పట్టించుకోలేదు. తెగి పడిన విద్యుత్ వైర్లు, స్తంభాలను పక్కన వేయడానికి ప్రయత్నిస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు.

మూలవరులను కదపకుండా వేములవాడ పునర్నిర్మాణం

- అనుమతుల కోసం 27న శృంగేరి పీఠానికి..
- జూన్‌లో పనులు ప్రారంభించాలని నిర్ణయం



ఆలయం ఎదుట మ్యాపులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్

వేములవాడ కల్చరల్/సిరిసిల్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో మూలవరులను కదల్చకుండా, భక్తులకు ఏ ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారులు నిర్ణయించారు. అవసరమైన మార్గదర్శకాలు, అనుమతుల కోసం ఈనెల 27వ తేదీన శృంగేరి పీఠం వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. గురువారం ఆలయ అతిథి గృహంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆలయ అభివృద్ధికి సంబంధించి ఆయా శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించిన నమూనాలు, మ్యాపులను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపారు. శృంగేరి పీఠం అనుమతులు లభించాక జూన్ నుంచి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. 'పునర్నిర్మాణంలో భాగంగా ఉప ఆలయాల్లోనూ మూలవరులను కదపకుండా కాశీ, జోగులాంబ దేవాలయ పరిధిలో ప్రతిపాదించిన మాదిరిగా ఆగమ, వాస్తు శాస్త్రాల మేరకే పనులు చేపట్టాలి. ప్రధాన ఆలయంలో స్వామి వారి సేవలు ఏకాంతంగా కొనసాగాలి. భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేయాలి. ఇందుకు ప్రభుత్వ అనుమతులు తీసుకుని షార్ట్ టెండర్లు చేపట్టి పనులను పూర్తి చేయాలి. ఆలయ నిర్మాణ పనుల పర్యవేక్షణ కమిటీని జూన్‌లో ఏర్పాటు చేయాలి. స్వామి వారి అభిషేక జలాలను సంరక్షించేలా అభివృద్ధి ప్రణాళికలు, నిత్య నివేదన దగ్గర అనుష్ఠాన మందిరం నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలి' అని సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు.


వచ్చే నెలలో రోడ్ల వెడల్పు: ఆది శ్రీనివాస్

వేములవాడ ఆలయ విస్తరణ, అభివృద్ధి కోసం రూ.76 కోట్లు, అన్నదాన సత్రానికి రూ.35 కోట్లు, పట్టణంలో రోడ్ల వెడల్పు పనులకు రూ.47 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు. అన్నదాన సత్రం నిర్మాణ పనులకు టెండర్ పూర్తి చేశామని, వచ్చే నెలలో రోడ్ల వెడల్పు పనులు చేపడతామన్నారు. శృంగేరి పీఠం అనుమతులతో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి జూన్‌లో ఆలయ పనులు ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని వెల్లడించారు.

ఊరంతా కిడ్నీ వ్యాధిగ్రస్తులే

ఐదేళ్లలో 25 మంది మృత్యువాత.. మరో 40 మంది వ్యాధిగ్రస్తులు

- బెల్లంపల్లి మండలం మాల గురిజాలలో దయనీయ పరిస్థితి
- నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతున్న అధికారులు



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని మాల గురిజాల గ్రామం

మంచిర్యాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని మాల గురిజాల గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్థుల సంఖ్య క్రమేపీ పెరిగిపోతోంది. తాగునీటి సమస్య కారణంగానే కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నప్పటికీ అసలు కారణం మరేదైనా ఉందా అనే సందేహాలు తలెత్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో 25 మంది చనిపోగా, సుమారు 40 మంది ఆ వ్యాధితో బాధపడుతున్నారు. 35 ఏళ్ల నుంచి 70 సంవత్సరాల వయస్సున్న పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడ్డారు. గ్రామంలో 1,684 మంది జనాభా ఉండగా, వారిలో వ్యవసాయదారులు, కూలీ పనిచేసి జీవించే వారే అధికంగా ఉన్నారు. వ్యాధి కారణంగా నెలలో ఒకటి, రెండుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి రావడంతో ఆర్థికంగా కుంగిపోతున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ పథకం ఉన్నప్పటికీ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని గ్రామస్థులు తెలిపారు. దీంతో బోరునీటిని తాగడంతో కిడ్నీల్లో రాళ్లు, వ్యాధుల బారిన పడుతున్నట్లు చెప్పారు. తాగు నీటికన్నా బోరు నీరే రుచిగా ఉండటంతో ఆ నీటినే వినియోగిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో కిడ్నీ వ్యాధులు విజృంభిస్తున్నా సంబంధిత అధికారులు నీటి నమూనాలు సేకరించడానికి మాత్రమే పరిమితం అవుతున్నారు. అవసరమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

సర్వే చేయిస్తాం
- డీఎంహెచ్‌వో డా.హరీష్‌రాజ్


గ్రామంలో కిడ్నీ వ్యాధుల సంక్రమణకు అసలు కారణమేంటో తెలుసుకునేందుకు సర్వే చేపట్టాల్సి ఉంది. వారం రోజుల్లో పూర్తి స్థాయిలో సర్వే జరిపిస్తాం. కారణం ఏమిటనేది నిర్ధారించుకున్న తరువాత అవసరమైన చర్యలు చేపడతాం.



నాలుగేళ్లుగా మందులు వాడుతున్నాను : రత్నం పెద్ద బాపు

నా వయసు 64 సంవత్సరాలు. నాలుగేళ్ల క్రితం కిడ్నీ వ్యాధి బారిన పడ్డాను. డయాలసిస్ చేసేందుకు శరీరం సహకరించకపోవడంతో వైద్యుల సూచనలతో మందులు వాడుతున్నాను.

నీటిని సేకరించినా చర్యల్లేవు: చల్లూరి కమల



మూడు సంవత్సరాల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాను. అధికారులు రెండుసార్లు గ్రామంలోని నీటిని సేకరించారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

అనారోగ్యంతో నా భార్య చనిపోయింది: గోమాస మల్లయ్య

రెండేళ్ల క్రితం నా భార్య రెండు కిడ్నీలు చెడిపోయాయి. అనారోగ్యం పాలై చనిపోయింది.

సూడాన్ సంక్షోభం

ఆ[illegible]రబ్ రాచరిక[illegible]నేత నిర్దయ, దేశీయుల మధ్య [illegible] సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న [illegible], ఉక్రెయిన్ యుద్ధాలతో తల్లడిల్లుతున్న అంతర్జాతీయ సమాజం ఈ ఆఫ్రికన్ అభాగ్యుల దుస్థితిని [illegible] ప్రపంచ విస్మయకర, విషాద [illegible].

19వ శతాబ్దంలో ఒట్టోమన్ సామ్రాజ్యంలో భాగంగా ఆవిర్భవించి, ఇరవయో శతాబ్ది ప్రథమార్థంలో ఆంగ్లో–ఈజిప్షియన్ ఉమ్మడి పాలనలో ఉండి, 1956లో వలసపాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన సూడాన్ తన 69 ఏళ్ల అస్తిత్వంలో, మరే ఆఫ్రికన్ దేశం కంటే ఎక్కువసార్లు తిరుగుబాట్లను చవిచూసింది. 2019లో సంభవించిన తిరుగుబాటులో 1989 నుంచి నిరంకుశ పాలన చేసిన ఒమర్ అల్ బషీర్ పదవీ భ్రష్టుడయ్యాడు. ఆయన స్థానంలో అధికారంలోకి వచ్చిన పౌర–సైనిక ప్రభుత్వం సుస్థిర ప్రజాస్వామిక పాలననందిస్తామని హామీ ఇచ్చింది. అయితే జనరల్ అబ్దేల్ ఫత్తా బుర్హాన్ తన సహచర పౌర పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి అధికారాన్ని కైవసం చేసుకున్నాడు. ఇందుకు అతడికి సహకరించిన వ్యక్తి హెమెడ్డీగా ప్రసిద్ధుడైన పారామిలిటరీ దళం ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ అధిపతి మొహమద్ హమ్దాన్ డగాలో. అయితే ఆ తరువాత ఇరువురి మధ్య అధికారం కోసం ప్రారంభమైన పెనుగులాట ఫలితమే 2023 నుంచి కొనసాగుతున్న అంతర్యుద్ధం, తత్పర్యవసాన మానవతా సంక్షోభం.

ఆఫ్రికాలో చమురు ఉత్పత్తి దేశాలలో సూడాన్ అగ్రగామిగా ఉండేది. చమురు విక్రయాలతో అపారంగా సమకూరిన ధన రాశులతో కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు బషీర్ పూనుకున్నాడు. అందులో భాగంగా పదివేల కోట్ల డాలర్ల వ్యయంతో నైలునదిపై డ్యామ్‌ల నిర్మాణాన్ని చేపట్టాడు. ఆ కార్యక్రమం పూర్తయ్యేలోపే దక్షిణ సూడాన్ ప్రజలు తిరుగుబాటు చేసి స్వతంత్ర దేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చమురు నిక్షేపాలు ఉన్న ప్రాంతాలన్నీ దక్షిణ సూడాన్‌వే కావడంతో కొత్త ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణ ప్రయత్నాలకు తీరని విఘాతం కలిగింది. చమురు ఆదాయం లేకపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయింది. ఆఫ్రికాలో మరే దేశంలో కంటే అధికంగా ఉన్న బంగారు గనులకు నెలవు అయిన పశ్చిమ సూడాన్‌లో తనతో విభేదించిన తెగలను అణచివేసేందుకు ప్రైవేట్ మిలీషియాలను బషీర్ సృష్టించాడు. అటువంటి ఒక ప్రైవేట్ సైన్యం నుంచి ప్రభవించిందే ప్రస్తుతం హెమెడ్డీ నాయకత్వంలోని ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్. బంగారు గనులు ఉన్న పశ్చిమ సూడాన్‌లో హెమెడ్డీదే రాజ్యం. తన పారా మిలిటరీ దళాన్ని జనరల్ బుర్హాన్ నేతృత్వంలోని సైన్యంలో విలీనం చేసేందుకు తిరస్కరిస్తూ వచ్చిన హెమెడ్డీ గత మంగళవారం నాడు తన నియంత్రణలో ఉన్న ప్రాంతాలలో 'గవర్నమెంట్ ఆఫ్ పీస్ అండ్ యూనిటీ'ని ఏర్పాటు చేశాడు. పక్షం రోజుల క్రితం తన పారా మిలిటరీ అధీనంలో ఉన్న దేశ రాజధాని ఖార్టూమ్‌ను జనరల్ బుర్హాన్ సైన్యానికి కోల్పోయాడు. అయినప్పటికీ తమ ప్రభుత్వమే సూడాన్ ప్రజల నిజమైన ప్రతినిధి అంటున్న హమెడ్డీ బుర్హాన్‌తో రాజీకి ససేమిరా అంటున్నాడు. రెండు సంవత్సరాలుగా ఈ ఇరువురి సైన్యాల మధ్య సూడాన్ కకావికలమై పోయింది. తమ వ్యూహాత్మక ప్రయోజనాలకు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాచరిక ప్రభువులు ఈ ప్రత్యర్థులలో చెరొకరి కొమ్ముకాస్తూ అంతర్యుద్ధ పరిస్థితిని మరింత విషమింపచేస్తున్నారు.

అంతర్యుద్ధంతో నెలకొన్న విపత్కర పరిస్థితులు 'ప్రపంచంలోని అత్యంత భయంకరమైన ఆకలి సంక్షోభం' అని ఐక్యరాజ్యసమితి అభివర్ణించింది. మూడు కోట్ల మందికి పైగా సూడానీలు మానవతా పూర్వక సహాయంపై ఆధారపడి ఉన్నారు. లక్షలాది కుటుంబాలు సర్వం కోల్పోయాయి. అనేక లక్షల మంది ఇరుగు పొరుగు దేశాలకు శరణార్థులుగా వెళ్లారు. హెమెడ్డీ నేతృత్వంలోని పారామిలిటరీ దళాలు పాల్పడిన అకృత్యాలు యుద్ధనేరాలే అని పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ప్రపంచ ప్రజలకు మానవతాపూరిత సహాయాన్ని సమకూర్చే 'యుఎస్ ఎయిడ్' కార్యకలాపాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పూర్తిగా నిలిపివేయడంతో సూడాన్‌లో సహాయ చర్యలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో సూడాన్ ప్రజల అవస్థలు మాటల్లో చెప్పలేని విధంగా మిక్కుటమయ్యాయి. అమెరికా నిర్దాక్షిణ్య నిర్ణయం సూడాన్ ప్రజలను వారి కర్మకు వదిలివేయడమే అయింది.

అభివృద్ధికి తోడ్పడే కీలక సహజ వనరులు ఉన్నప్పటికీ సూడాన్ రాజకీయంగా, ఆర్థికంగా పతభ్రష్టమవడం ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య పద్ధతులు, సమాజంలో ప్రజాస్వామిక నైతికత అవసరమనే సత్యాన్ని ఎత్తి చూపుతోంది. కడుపు తరుక్కుపోయే కన్నీళ్ల విషాద గాథలు కళ్ల ముందుకు వచ్చినప్పుడు ఆ అభాగ్యగతులకు కనీస సానుభూతి, సహానుభూతి చూపడం విశాల ప్రపంచ విధ్యుక్త ధర్మం.

వాణిజ్య యుద్ధాలు, ఆర్థిక మాంద్యాలు, అధోగతులు!

ఆర్థిక విషయాలు రాజకీయాల మంచిచెడులను నిర్ణయిస్తాయంటే నమ్మని వాళ్లు ఇప్పటికీ ఉన్నారు. మనుషులను కొన్ని విలువలు నడిపిస్తాయనీ అన్నిటినీ ఆర్థికంతో ముడిపెట్టలేమన్న వాదనలూ బలంగానే వినిపిస్తాయి. ఆర్థిక అంశాలను పూర్తిగా విస్మరించి ఊహాలోకాల్లోకి వెళ్లటం అసాధ్యం. అలా వెళ్లటానికి కూడా జీవితంలో ఆర్థిక వెసులుబాట్లు ఉండాలి. వ్యవసాయం కనిపెట్టకముందు మనుషుల ఆలోచనలు ఒకరకంగా ఉండేవి. అప్పుడు దేవుళ్లూ ప్రత్యేకంగా ఉండేవారు. నీతులూ భిన్నంగా ఉండేవి. వ్యవసాయం స్థిరపడి, రాచరికాలు ఏర్పడిన తర్వాత పరిస్థితి మారిపోయింది. కొందరు శారీరక శ్రమలేకుండా ఇతర వ్యాపకాల్లో నిష్ణాతులు కావటానికి వీలుపడింది. వ్యవసాయ సంపదలో వాటాలు పొందినవారు మేధావులు అయ్యారు. రుషులుగా మారారు. కవులు అయ్యారు. కళాకారులుగా తయారయ్యారు. ప్రవక్తలుగా వెలుగొందారు. వాణిజ్యకారులుగా వ్యవహరించారు. ఇక గడచిన అయిదారొందల ఏళ్లల్లో వాణిజ్య ప్రయోజనాల కోసం ఘోర యుద్ధాలూ జరిగాయి.

ఇదంతా గతచరిత్ర అనుకోవచ్చు. ఈనాటి సమాజంలో వాణిజ్య ప్రయోజనాలను శాంతియుతంగా పొందొచ్చని భావించొచ్చు. అందుకు ఉదాహరణలనూ చెప్పుకోవచ్చు. కానీ వాణిజ్య ప్రయోజనాలు గతంలో లాగే యుద్ధాలకూ నియంతృత్వాలకూ దారితీసే పరిస్థితులు ఇప్పటికీ ప్రబలంగానే ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సాగిస్తున్న వాణిజ్య యుద్ధాలను చూస్తే ఇదే భావన కలుగుతుంది. చైనా కేంద్రంగా ట్రంప్ సాగిస్తున్న ఆ యుద్ధాలు.. ఎటు దారితీస్తాయన్న దానిపై భిన్న అంచనాలు ఉన్నాయి. కానీ దేశాల మధ్య అసలు యుద్ధాలకు అవి దారితీయవని ఖచ్చితంగా చెప్పలేం! యుద్ధమంటే మనుషుల హతమే కాదు. వాస్తవాల హతం కూడా! అబద్ధాలు, వక్రీకరణలు లేకుండా యుద్ధాలు ఉండవు. ఈనాటి వాణిజ్య యుద్ధమూ దీనికి మినహాయింపు కాదు.

తీవ్ర వాణిజ్యలోటు, చాంతాడంత అప్పులతో అమెరికా సతమతమవుతోంది. అమెరికా చేసే ఎగుమతుల కంటే ఏదైనా దేశం నుంచి దిగుమతులు ఎక్కువ ఉంటే ట్రంప్ దృష్టిలో దోపిడీ జరుగుతున్నట్లే లెక్క! అమెరికా కంటే ఏ దేశమైనా సుంకాలను కాస్త ఎక్కువగా విధిస్తే ఆ దేశం అమెరికాపై అత్యాచారానికి పాల్పడినట్లే లెక్క! స్వేచ్ఛా వాణిజ్యాన్ని శ్లాఘించిన ఆర్థికవేత్తలెవరూ ఇలాంటి వాదన తలెత్తుతుందని ఊహించలేదు. స్వదేశీ పరిశ్రమల రక్షణకు అధిక సుంకాలను కొంతకాలం విధించాలని ప్రతిపాదించిన ఆర్థికవేత్తలు ఉన్నారు. ఒక దేశం వాణిజ్యలోటుకు ఇతర దేశాల దోపిడీయే కారణమని సూత్రీకరించిన ఆర్థికవేత్తలు ప్రధాన స్రవంతిలో పెద్దగా కనపడరు.

అమెరికా ఎందుకంతగా దిగుమతులపై ఆధారపడాలి? శాస్త్ర, సాంకేతికతల్లో అగ్రగామిగా ఉండగా ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? ఒకనాటి అమెరికా పాలకులకు ట్రంప్‌కు ఉన్నంతగా దేశభక్తి లేకుండా పోయిందా? ఈ ప్రశ్నల లోతుల్లోకి వెళితే అమెరికా ఎలాంటి మార్పులకు లోనైందో అర్థమవుతుంది. వాటితో ఎవరు లాభపడ్డారో తెలుస్తుంది. అమెరికానే అనుసరిస్తూ దాని స్థాయికి చేరుకోవాలని ప్రయత్నిస్తున్న చైనాను కేంద్రంగా చేసుకుంటూ సాగుతున్న వాణిజ్య యుద్ధ నైజమూ బోధపడుతుంది.

అమెరికా నుంచి తయారీ పరిశ్రమలు తరలటానికి ఇతర దేశాల ఒత్తిడి లేదు. పరిశ్రమలు, సేవలు ఇతర దేశాలకు తరలిపోవటాన్ని వ్యాపార పరిభాషలో 'ఆఫ్‌షోరింగ్' అంటారు. ఈ ఆఫ్‌షోరింగ్‌ను వివరిస్తూ లక్షల విశ్లేషణలు వచ్చాయి. వాటన్నిటిలోనూ ఒక విషయంలో ఏకాభిప్రాయం ఉంది. తక్కువ వేతనాలకు దొరికే కార్మిక–నిపుణుల శ్రమ, చౌక ధరలకు ముడిసరుకుల లభ్యత ఒకనాటి అమెరికా పరిశ్రమలకు అవసరమయ్యాయి. ఎక్కువ లాభాల కోసం ఆ అవసరం తలెత్తింది. వేతనాలు పెరిగాలని ఒత్తిడిచేసే కార్మిక సంఘాలు, సంక్షేమ పథకాల కోసం పన్నులను పెంచాల్సిన అవసరాలు, పర్యావరణ పరిరక్షణ కోసం అమల్లోకి వచ్చిన కట్టుదిట్టమైన చట్టాలు.. అమెరికా, పశ్చిమ యూరోపుల్లో పరిశ్రమల లాభాలను బాగా ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయి. ఆ పరిస్థితుల్లో లాభాలను నిలబెట్టుకోవటమూ కష్టంగా మారింది. లాభాల్లో ఎదుగూబొదుగూ లేకుండా పరిశ్రమలు ఉండలేవు. పోటీలో నిలబడాలంటే అధిక లాభాలను అన్వేషించాలి. అందుకే 1960ల నాటికి అమెరికా పరిశ్రమలను తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందగలిగే దేశాలకు తరలించటం అనివార్యమైంది. అప్పటి నుంచి 2015 వరకూ ఆఫ్‌షోరింగ్ అనేది అవిచ్ఛిన్నంగా కొనసాగింది. 1990ల నుంచి 2015 మధ్యకాలాన్ని దాని ఉచ్ఛదశగా భావించొచ్చు. 1989 నుంచీ యూరపులో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూలిపోవటం, అంతకు పదేళ్లకు ముందే చైనాలో ప్రైవేటు రంగానికి తలుపుతీయటం, 1991లో భారత్‌లో పెద్దఎత్తున ఆర్థిక సంస్కరణలు మొదలవ్వటం.. ఆనాటి ప్రధాన సంఘటనలుగా చెప్పుకోవచ్చు. అవన్నీ ఆఫ్‌షోరింగ్‌కు బాగా తోడ్పడ్డాయి. పరిశ్రమలతో పాటు సేవలు, ఐటీ రంగంలో కూడా ఆఫ్‌షోరింగ్ మొదలైంది. బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్, బ్యాకెండ్ ఆఫీస్ యాక్టివిటీస్, మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్, సాఫ్ట్‌వేర్ కోడింగ్, డిజిటల్ ఆఫ్‌షోరింగ్, వర్చువల్ ఆఫ్‌షోరింగ్.. ఇలా ఎన్నో పేర్లతో పలు పనులు.. తక్కువ వేతన ఖర్చు, తక్కువ ఆఫీసు నిర్వహణా భారంతో అభివృద్ధి చెందుతూన్న దేశాలకు తరలి వచ్చాయి. జర్మనీకి చెందిన తయారీ పరిశ్రమలు పలు విదేశాలకు తరలాయి. అందులో 80శాతం పరిశ్రమలు వేతన ఖర్చులను తగ్గించుకోవటానికే తరలి వెళ్లాయి. ఇతర దేశాల్లో పనిచేయించుకోగలిగిన ఉద్యోగాలెన్ని అన్న విషయంలో కూడా చాలా లెక్కలు ఉన్నాయి. ఒక అంచనా ప్రకారం 11శాతం నుంచి 38 శాతం ఉద్యోగాలు అందుకు అనువైనవిగా తేలాయి. మరో అధ్యయనం ప్రకారం.. అమెరికాలో సేవలకు సంబంధించిన 515 రకాల ఉద్యోగాల్లో 160 వరకూ ఇతర దేశాల వ్యక్తులతో చేయించగలిగినవిగా లెక్కించారు. 2021–22 నాటి మరో అంచనా ప్రకారం అమెరికాలోని ఉద్యోగాల్లో 26 శాతం వాటిని విదేశాల్లోనే చేయించుకోవచ్చని తేల్చారు.




■ రాహుల్ కుమార్

> చేజారుతున్న ఆధిపత్యాన్ని నిలబెట్టుకోటానికి, జాతీయభద్రత పేరుతో చైనా ఉత్పత్తులను నిలువరించే కఠిన చర్యలతో మొదలుపెట్టి, అసాధారణ వాణిజ్యయుద్ధానికి అమెరికా శ్రీకారం చుట్టింది. ఆధిపత్యం కోల్పోయే పరిస్థితి ఉన్న చోట అభద్రతలూ, అనిశ్చితులూ వేగంగా ముసురుకుంటాయి. ట్రంప్‌లాంటి నేతలు ఆ పరిస్థితుల నుంచే బలపడతారు. దేశపరిరక్షకుల అవతారంతో చెలరేగిపోతారు. అధిక సుంకాలతో ఆర్థికవ్యవస్థను అన్నిసార్లూ రక్షించుకోలేరు. 1920–1930ల్లో అమెరికా విధించిన అత్యధిక దిగుమతి సుంకాల విధింపుతో తేలింది అదే. ప్రపంచ వ్యాప్త ఆర్థిక మహామాంద్యానికి ఆ సుంకాలే ప్రధాన కారణం అయ్యాయి. ఆ మాంద్యమే హిట్లర్ లాంటి వాళ్లను సృష్టించి రెండో ప్రపంచ యుద్ధానికి దారులు పరచింది.

అమెరికాకు చెందిన పెద్ద సంస్థలు చాలా దేశాల్లో పరిశ్రమలూ కంపెనీలనూ నడుపుతున్నాయి. 2014 నాటికే 14 మిలియన్ ఉద్యోగులు వాటిల్లో పనిచేస్తున్నారు. అందులో 17 లక్షలు ఒక్క చైనాలో ఉంటే వాటిల్లో సగం మంది తయారీ రంగంలోనే పనిచేస్తున్నారు. మెక్సికోలో అమెరికన్లు నడుపుతున్న కంపెనీల్లో 7,06,200 మంది ఉన్నారు. ఇప్పుడు ఈ రెండు దేశాలపై ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. విదేశాల్లోని అమెరికా కంపెనీల్లో చౌకగా తయారైన ఉత్పత్తులను స్థానిక మార్కెట్లల్లో అమ్మి లాభాలను గడించటం ఒకవైపు చిత్రమే. వాటిని అమెరికాకు దిగుమతి చేసుకుని సొంత పౌరులకు చౌకగా అందించటమే ప్రధానమైంది. యాపిల్ ఫోన్లే ఇందుకు ఉదాహరణ. ఇప్పటికీ అవి అమెరికాలో తయారు కావు. అయిదారేళ్ల క్రితం వరకూ మొత్తం అన్నీ చైనా నుంచి రావాల్సిందే.

వేతన భారాలనూ ఇతర ఖర్చులనూ గణనీయంగా తగ్గించుకునే లక్ష్యంతో పరిశ్రమలనూ సేవలనూ విదేశాలకు తరలించి దశాబ్దాల పాటు అమెరికా బాగా లాభపడింది. దీనివల్ల కొన్నిరకాల ఉద్యోగాలు పోతే మరెన్నో కొత్త ఉద్యోగాలు అమెరికాలో వచ్చాయనీ ఆఫ్‌షోరింగ్‌తో అంతా నష్టం జరిగిందనే వాదన నిజం కాదనే అధ్యయనాలు కూడా చాలానే ఉన్నాయి.

అసలు విషయం ఏమిటంటే అమెరికాకు కావాల్సిన వస్తు, సేవలను అందిస్తూ ఆ మార్కెట్టుపై ఆధారపడి ఉన్నంతవరకూ చైనాతో ఏ ఇబ్బందీ కలగలేదు. సాంకేతిక, శాస్త్ర రంగాల్లో సొంత పరిశోధనలకు పెద్దపీట వేస్తూ, రక్షణరంగంలో కూడా ముందుకు దూసుకుపోవటంతో పాటు ఇతర దేశాల్లో తన ఉత్పత్తులకు, సేవలకు మార్కెట్‌ను చైనా విస్తరించుకోవటంతో సమస్య మొదలైంది. దేశాల మధ్య వ్యాపారపరమైన అడ్డంకులను తొలగించటానికి ఏర్పాటైన వల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ లాంటివన్నీ అమెరికా ప్రోద్బలంతోనే ఏర్పడ్డాయి. అవన్నీ ఇప్పుడు కంటగింపుగా మారాయి. అమెరికాకు అగ్రతాంబూలం అందకుండా అవే అడ్డంకిగా మారాయని అంటూ వాటి నుంచి వైదొలుగుతామనే హెచ్చరికలూ పెరిగాయి. ఆఫ్‌షోరింగ్ స్థానంలో రీషోరింగ్ నినాదం మొదలైంది. అమెరికాకు అవసరమైన అన్ని ఉత్పత్తులూ స్వదేశంలోనే జరగాలనే ఆర్భాటత్వమూ ఆరంభమైంది.

చేజారుతున్న ఆధిపత్యాన్ని నిలబెట్టుకోటానికి, జాతీయభద్రత పేరుతో చైనా ఉత్పత్తులను నిలువరించే కఠిన చర్యలతో మొదలుపెట్టి, అసాధారణ వాణిజ్యయుద్ధానికి అమెరికా శ్రీకారం చుట్టింది. ఆధిపత్యం కోల్పోయే పరిస్థితి ఉన్న చోట అభద్రతలూ, అనిశ్చితులూ కూడా వేగంగా ముసురుకుంటాయి. ట్రంప్‌లాంటి నేతలు ఆ పరిస్థితుల నుంచే బలపడతారు. దేశపరిరక్షకుల అవతారంతో చెలరేగి పోతారు. అధిక సుంకాలతో ఆర్థికవ్యవస్థను అన్నిసార్లూ రక్షించుకోలేరు. 1920–1930ల్లో అమెరికా విధించిన అత్యధిక దిగుమతి సుంకాల విధింపుతో తేలింది అదే. ప్రపంచ వ్యాప్త ఆర్థిక మహామాంద్యానికి ఆ సుంకాలే ప్రధాన కారణం అయ్యాయి. ఆ మాంద్యమే హిట్లర్ లాంటి వాళ్లను సృష్టించి రెండో ప్రపంచ యుద్ధానికి దారులు పరచింది. 1922లో ఫోర్డినీ–మెకంబర్ చట్టంతో అమెరికా సగటు దిగుమతి సుంకాన్ని 40 శాతానికి పెంచింది. అమెరికా చరిత్రలో అది అధికం. యూరోపు వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను దండిగా విధించాలన్న డిమాండ్లూ మొదలయ్యాయి. వాటికి సరేనంటూ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి హెర్బట్ హూవర్ అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. ఇతర ఉత్పత్తులపై కూడా సుంకాలను పెంచాలనే ఒత్తిడి మొదలైంది. ఈ లోగా స్టాక్ మార్కెట్ కుప్పకూలటంతో (1929) స్మూట్–హాలీ పేరుతో తెచ్చిన దిగుమతి సుంకాల చట్టం ఆర్థికమాంద్యాన్ని తీవ్రం చేసింది. అమెరికాను వాణిజ్యపరంగా ఏకాకిగా మార్చింది. జరిగే ప్రమాదాన్ని పసిగట్టి 1000 మంది ఆర్థికవేత్తలు ఆ చట్టాన్ని వీటో చేయాలని హూవర్‌కు పిలుపునిచ్చారు. లక్ష్యపెట్టలేదు. అమెరికాని చూసి రెండేళ్లల్లో మరో 24 దేశాలు అధిక సుంకాలతో రక్షణ గోడలు కట్టుకున్నాయి. యూరప్–అమెరికాల మధ్య ఎగుమతులు–దిగుమతులు 1929–32 మధ్య 66 శాతం పడిపోయాయి. వాణిజ్యం అస్తవ్యస్తమైంది. అంతటా ఆర్థిక అస్థిరత చుట్టుముట్టింది. రెండో ప్రపంచ యుద్ధానికి రంగం సిద్ధమైంది. వాణిజ్య యుద్ధాలతో జరిగే దారుణాలకు ఇంతకంటే నిదర్శనం లేదు! చరిత్ర పునరావృతం అవుతుందా?

> అసలు విషయం ఏమిటంటే అమెరికాకు కావాల్సిన వస్తు, సేవలను అందిస్తూ ఆ మార్కెట్టుపై ఆధారపడి ఉన్నంతవరకూ చైనాతో ఏ ఇబ్బందీ కలగలేదు. సాంకేతిక, శాస్త్ర రంగాల్లో సొంత పరిశోధనలకు పెద్దపీట వేస్తూ, రక్షణరంగంలో కూడా ముందుకు దూసుకుపోవటంతో పాటు ఇతర దేశాల్లో తన ఉత్పత్తులకు, సేవలకు మార్కెట్‌ను చైనా విస్తరించుకోవటంతో సమస్య మొదలైంది.

భూదానోద్యమానికి వజ్రోత్సవం!


భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గాంధీజీ కన్న కలలను నెరవేర్చాలని ఎంతో తాపత్రయపడిన మొట్టమొదటి వ్యక్తి ఆచార్య వినోబా భావే. ఆంగ్లేయుల కబంధ హస్తాల నుంచి విడిపించుకున్న భారతదేశాన్ని జన సామరస్య దేశంగా, సుసంపన్న, సుస్థిర దేశంగా చూడాలని ఆశించారు. సమాజంలో సామాన్య, సగటు ప్రజా జీవన అభ్యున్నతి కోసం, సామాజిక, ఆర్థిక తారతమ్యాల నిర్మూలన కోసం దేశవ్యాప్త సర్వోదయ వికాసానికి 'స్వచ్ఛంద భూసేకరణ', 'చట్టబద్ధమైన భూవితరణ' జరగాలని, దానికి మళ్లీ భారతదేశంలో ప్రజలందరినీ కదిలించే ఒక సామరస్య పోరాటం చేయాలని భావే నిర్ణయించుకున్నారు. దేశమంతా పాదయాత్ర చేసి, 'స్వచ్ఛంద భూదాన్' ఉద్యమానికి నాంది పలికారు. ఈ ఉద్యమ స్ఫూర్తికి ఈ ఏడాది ఏప్రిల్ 18 నాటికి 74 ఏళ్ళు నిండి, 75వ (వజ్రోత్సవ) సంవత్సరం ఆరంభమైంది.

పాదయాత్రలో భాగంగా నల్గొండ జిల్లా పోచంపల్లి గ్రామానికి చేరుకున్న వినోబా భావే అక్కడి ప్రజల స్థితిగతులను తెలుసుకుని, స్థానిక భూస్వామి వెదిరే రామచంద్రారెడ్డిని కలిసి మాట్లాడారు. వినోబా భావే భావోద్వేగమైన ప్రసంగానికి మంత్రముగ్ధుడైన జమీందార్ రామచంద్రారెడ్డి, తక్షణమే స్పందించి 100 ఎకరాల భూమిని దానంగా ఇస్తున్నట్లు ప్రకటించి, 1951, ఏప్రిల్ 18న దానపత్రాన్ని భావేకు అందించారు. ఇది దేశంలోనే తొట్ట తొలి స్వచ్ఛంద భూదానం. అందుకే ఈ రోజును భారతదేశ సామాన్య ప్రజలంతా 'భూదాన్ డే'గా జరుపుకుంటున్నారు.

1951 నుంచి 1957 వరకూ విడతలు విడతలుగా భారతదేశంలోని అన్ని రాష్ట్రాలను తన పాదయాత్ర ద్వారా వినోబా భావే సందర్శించారు. దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల ఎకరాల భూమిని దానంగా స్వీకరించి, సామాన్యుడి సర్వోదయానికి బలమైన పునాది వేశారు. ఈ భూదాన్ ఉద్యమం ప్రపంచ దేశాలను ఎంతగానో ప్రభావితం చేసింది.

దేశ వ్యాప్తంగా తాను దానంగా స్వీకరించిన భూమిని తానే స్వయంగా ప్రజలకు పంచేస్తే, దానిని ప్రజలు తాను చేసిన సహాయంగానే చూస్తారని, దానికి చట్టబద్ధత ఉండదని, వారు భవిష్యత్‌లో సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకి భావే తెలిపారు. అందుకే ఆ భూమిని నిరుపేదలకు పంచడానికి ఒక సమగ్ర చట్టాన్ని రూపొందించి, తాను భూదానంగా స్వీకరించిన భూములను ఆ చట్ట పరిధిలోకి తీసుకువచ్చి, ప్రభుత్వ ప్రమేయంతో తానే స్వయంగా ప్రజలందరికీ చట్టబద్ధంగా ఆ భూములను పంచేందుకు సహకరించాలని నెహ్రూని కోరారు.

> భూమిని దానంగా స్వీకరించి, సామాన్యుడి సర్వోదయానికి బలమైన పునాది వేశారు ఆచార్య వినోబా భావే. ఈ భూదానోద్యమం ప్రపంచ దేశాలను ఎంతగానో ప్రభావితం చేసింది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో వేలాది ఎకరాల భూదాన్ భూములు ప్రభుత్వ నిర్లక్ష్యంతో అక్రమార్కుల కబంధ హస్తాలలో చిక్కుకుని ఉన్నాయి.



1965లో అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో దీనిని భారతదేశ సమగ్ర చట్టంగా ఆమోదించారు. అయితే ఈ చట్టాన్ని అమలు చేసే బాధ్యతను మాత్రం ఆయా రాష్ట్రాలకు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 1965, మే 10 నుంచి ఈ 'భూదాన్–గ్రామదాన్' చట్టం దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ చట్టంలో సూచించిన ప్రకారంగా ఆయా రాష్ట్రాలలో వినోబా భావే సూచించిన వారికి అధికారాన్ని ప్రకటిస్తూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు 11 మంది సభ్యులతో కూడిన 'భూదాన్ యజ్ఞ బోర్డు'ను నిర్మాణం చేయాలి. ఆ బోర్డుని ఆ రాష్ట్ర 'భూదాన్ యజ్ఞ బోర్డు'గా గుర్తిస్తూ, నాలుగేళ్ళ పాటు కాలపరిమితి కలిగిన అధికారాలను కలిగివుండేలా అధికారికంగా గెజిట్ ద్వారా ప్రభుత్వాలు ప్రకటించాలి. సభ్యుల ఎంపికలో ప్రభుత్వ ప్రమేయం ఉండకూడదు. వినోబా భావేకు గాని, ఆయన ధృవీకరించిన గాంధేయవాద సంస్థ 'సర్వ సేవా సంఘ్'కు గాని భూదాన్ భూములన్నీ పేద ప్రజలకు పంపిణీ జరిగే వరకూ ఈ చట్టం యథావిధిగా అమలులో ఉండాలి. ఈ విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాటు అనేక రాష్ట్రాలలో 1969లో మొదటగా 'భూదాన్ యజ్ఞ బోర్డు'లు ఏర్పడి, పని ప్రారంభించాయి.

భూములను దానం పొందిన గ్రహీతలు సక్రమంగా వాటిని వినియోగించుకుంటున్నారా? లేదా? అనే సమీక్ష కూడా తరచూ జరుపుతూ, తదనుగుణ చర్యలు కూడా తీసుకోవాలి. ఇదీ, ఆయా 'భూదాన్ యజ్ఞ బోర్డు' సభ్యులు పారదర్శకంగా చేయవలసిన పని. అయితే 1982, నవంబరు 15న ఆచార్య వినోబా భావే హఠాన్మరణం తరువాత 'భూదాన్–గ్రామదాన్' చట్టం అమలు విధానాలు అనేక రాష్ట్రాలలో మెల్లమెల్లగా తగ్గుతూ వచ్చాయి. అందులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కూడా ఉండడం దురదృష్టకరం.

మహారాష్ట్ర, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో 'భూదాన్–గ్రామదాన్' చట్టం ఎంతో పటిష్ఠంగా అమలు జరుగుతోంది. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కొన్ని రాష్ట్రాలలో ఈ చట్టాన్ని కొన్ని పరిస్థితులు మరుగున పడేశాయి. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో ఈ చట్టానికి ఎన్నో తూట్లు పడ్డాయన్న విషయం చాలా స్పష్టంగా తెలుస్తోంది.

వినోబా భావే తన మరణానికి ముందు ఒక వీలునామా రాశారు. దాని ద్వారా తన మరణానంతరం భూదాన్ భూములపైనా, భూదాన్ యజ్ఞ బోర్డు నియామకంపైనా సర్వాధికారాలు 'సర్వ సేవా సంఘ్' అనగా వార్ధాలోని 'అఖిల భారత సర్వోదయ మండల్'కు చెందుతాయని నిర్ధారించారు. ఈ వీలునామాను దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి, పాటిస్తున్నాయి. కానీ ఒక్క ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సర్వ సేవా సంఘ్‌కు సంబంధం లేకుండా దొడ్డిదారిన 1988, 2012లలో అడ్డగోలుగా అప్పటి ప్రభుత్వాల సొంత నిర్ణయాలతో భూదాన్ యజ్ఞ బోర్డులను నియమించాయి. సర్వ సేవా సంఘ్ న్యాయస్థానాల ద్వారా న్యాయాన్ని పొందే లోపు ఆయా బోర్డుల కాలపరిమితి ముగిసిపోయింది. ఈ బోర్డుల పదవీ కాలాలలోనే అనేక వేల ఎకరాలు అక్రమంగా చేతులు మారాయి.

ఇక 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగినప్పుడు భూదాన్ భూములు– సుమారు 80 వేల ఎకరాల ఆంధ్రప్రదేశ్‌లోనూ, సుమారు 1 లక్షా 30 వేల ఎకరాలు తెలంగాణలోనూ ఉన్నట్లు లెక్కలు చూపించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా ఇప్పటివరకూ భూదాన్ యజ్ఞ బోర్డుల నిర్మాణం జరగలేదు. అయితే 2023లో మాత్రం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సర్వ సేవా సంఘ్ సిఫారసు లేకుండా తమ పార్టీకి చెందిన ఒక వ్యక్తిని భూదాన్ యజ్ఞ బోర్డుకు ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రత్యేక గెజిట్‌ను తీసుకొచ్చింది. దీనిని సవాలు చేస్తూ సర్వ సేవా సంఘ్ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, న్యాయస్థానం ఆ గెజిట్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో వేలాది ఎకరాల భూదాన్ భూములు ప్రభుత్వ నిర్లక్ష్యంతో అక్రమార్కుల కబంధ హస్తాలలో చిక్కుకుని ఉన్నాయి. ఈ భూములు చట్ట ప్రకారం ఎవ్వరికీ బదలాయించబడవని తెలిసినా, ఆ భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో కొందరు రాజకీయ నాయకులు, అధికారులు వాటిని దక్కించుకోవడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అందరూ గ్రహించాల్సిన విషయమేమిటంటే భూదాన్ భూములు గెజిట్ ప్రకారం ఎప్పటికైనా సర్వ సేవా సంఘ్‌కు చెందవలసినవే గాని, ఎట్టి పరిస్థితుల్లో కూడా ఎవరికీ బదలాయించబడవు. సర్వ సేవా సంఘ్... భూదాన్ యజ్ఞ బోర్డు ద్వారా చట్ట ప్రకారంగా స్వచ్ఛందంగా ఎవరికైనా వితరణ చేయాలి లేదా వితరణకు సమ్మతించాలి. ఒక మహోన్నత ఆశయంతో, దృఢ సంకల్పంతో ఆచార్య వినోబా భావే యజ్ఞంగా భావించి కొనసాగించిన 'భూదాన్' ఉద్యమ స్ఫూర్తిని పరిరక్షించే విధంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

■ నీలం రాంబాబు నాయుడు
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్

ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY 5 వరంగల్
శుక్రవారం 18 ఏప్రిల్ 2025



భూములకు.. ఇక దేశవ్యాప్త గుర్తింపు

రైతులకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు

సాగుదారుల లెక్క ఇక పక్కాగా తేలనున్నది. రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక కార్డుల(భూ ఆధార్)ను అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. ఈ ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ప్రతీ రైతుకు 14 అంకెల విశిష్ట సంఖ్యతో ఈ కార్డులు జారీ కానున్నాయి. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కేంద్రం అందించే సంక్షేమ పథకాల లబ్ధికి ఈ కార్డు ప్రామాణికంగా నిలవనుంది. భూమి ఉండి, పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన ప్రతీ రైతూ ఈ గుర్తింపు తీసుకోవడం తప్పనిసరి. వ్యవసాయ రంగంలో సాంకేతిక అనుసంధానం, ఆధునికీకరణ చర్యల్లో భాగంగా కేంద్రం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది.

- ఈ నెల 22 నుంచి అందించనున్న కేంద్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 8.77 లక్షల మందికి భూ ఆధార్ జారీకి కసరత్తు
- అందుబాటులోకి వచ్చిన యాప్.. సిబ్బందికి శిక్షణ పూర్తి
- పీఎం కిసాన్ సమ్మాన్‌కు ఈ కార్డు తప్పనిసరి
- గ్రామాల్లో రైతు వేదికల వద్ద వివరాల నమోదు

హనుమకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టాదారు పాస్‌పుస్తకాలు కలిగిన మొత్తం 8.77 లక్షల మందికి ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ (భూఆధార్) కార్డుల జారీకి వ్యవసాయాధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఈనెల 22 నుంచి ఈ కార్డుల జారీ ప్రారంభం కానున్నది. కార్డులు పొందేందుకు కాలపరిమితేం లేదు. కాకపోతే ఈ కార్డులుంటేనే ఇక నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ డబ్బులు రైతులు పొందగలుగుతారు. వాస్తవానికి ఫిబ్రవరి నెల లోనే ఈ కార్డుల జారీ ప్రక్రియ మొదలు కావలసి ఉండింది. తెలంగాణ రాష్ట్రంలో జాప్యం జరుగు తోంది. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే 70 శాతం పూర్త యింది. ప్రజల అన్ని అవసరాలకు ప్రధానంగా గు ర్తింపు కార్డుగా చెలామణిలో ఉన్న ఆధార్ తరహా లో ఇక నుంచి ప్రతీరైతుకు గుర్తింపు కార్డు తప్ప నిసరి కానుంది.

ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేయడం ద్వారా జాతీయ స్థాయిలో ఈ-ఫార్మర్ రిజిస్ట్రీని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టుగా మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో చేపట్టిన ఈ విధానం విజయవంతం కావడంతో దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో భూ యజమానులతోపాటు కౌలు రైతులకు సైతం వీటిని జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్-అగ్రిస్టాక్ ప్రాజెక్టు పేరిట అమలు చేయబోతున్న ఈ ప్రాజెక్టు కోసం స్టేట్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎస్‌పీఎంయూ)ను ఏర్పాటు చేశారు. వెబ్ ల్యాండ్ డాటా ఆధారంగా జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా రైతుల ఈ-ఫార్మర్ రిజిస్ట్రీని రూపొందిస్తారు.

ఇవీ ప్రయోజనాలు

భూ కమతాలకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించటం అంటే భూమికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చినట్టు. ఇది భూ యజమాని, స్థానం, విస్తీర్ణం మొదలైన వివరాలను సులభంగా గుర్తించేందుకు ఉపయోగపడుతుంది. భూమి ఉపయోగాన్ని నిర్ధారించవచ్చు. ఆక్రమణలు, అక్రమ కట్టడాలను నివారించటానికి సహాయపడుతుంది. విశిష్ట గుర్తింపు సంఖ్యల వల్ల భూములను బ్యాంకింగ్, బీమా వ్యవస్థలతో సులభంగా అనుసంధానం చేయవచ్చు. భూ యజమాని హక్కులను తేలికగా గుర్తించవచ్చు. దీని వల్ల భూవివాదాలను అరికట్టి పారదర్శకతను పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. భూ వివరాలను డిజిటలైజ్ రూపంలో నిల్వ చేయడం సులభమవుతుంది. కేంద్ర అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలకు ఈ యూనిక్ కోడ్ తప్పని సరికానున్నది. పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు, పంటను మార్కెట్‌లో విక్రయించుకునేందుకు ఈ కార్డు ఉపయోగపడుతుంది. దీనిని కిసాన్ క్రెడిట్ కార్డుగా కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ ఐడీ సాయంతో దేశంలో ఎక్కడి నుంచైనా రుణార్హత, రుణ బకాయిలు, పథకాల జమ వంటి వివరాలను తెలుసుకోవచ్చు.

పీఎం కిసాన్‌కు తప్పనిసరి

రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన

మిగతా 7వ పేజీలో...

> **ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డుల జారీకి ఏర్పాట్లు**
>
> రవీందర్ సింగ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి
>
> రైతులకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డుల జారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి కార్డుల జారీ మొదలవుతుంది. ఈ ప్రత్యేక కార్డుల జారీకి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. ఈ కార్డులు పొందేందుకు రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకంతో తమ దగ్గరలోని సహాయ వ్యవసాయ అధికారులు (ఏఈవో)లను సంప్రదించవచ్చు. లేదా మీ సేవా కేంద్రంలో కూడా వివరాలను నమోదు చేయించుకోవచ్చు. కార్డుల జారీకి సంబంధించి యాప్ కూడా సిద్ధంగా ఉంది. రైతుల వివరాలను డిజిటలైజ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. పట్టా పాస్ పుస్తకాలున్న రైతులందరూ ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు పొందాలి. రైతులకు అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



హనుమకొండ అశోకా జంక్షన్‌లో ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేషనల్ హెరాల్డ్ కేసులపై కాంగ్రెస్ నిరసన

- ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేసిన నేతలు
- బీజేపీది రాజకీయ ప్రతికారమన్న ఎంపీ కావ్య
- నియంత పాలనను ఎదుర్కొంటామన్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ పత్రిక వ్యవహారం మంటలు రాజుకుంటున్నాయి. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గురువారం బీజేపీ తీరును ఖండిస్తూ నిరసన చేపట్టారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి అశోక జంక్షన్ వరకు కాంగ్రెస్ నేతలు ర్యాలీగా తరలివచ్చారు. అశోక జంక్షన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన పత్రికలో పెట్టుబడులు పెడితే మనీ లాండరింగ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లు చార్జ్‌షీటులో పెట్టడం అభ్యంతకరమన్నారు. భారతీయ జనతా పార్టీ నియంతలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కొలేక తమ అగ్రనేతలపై వక్రమార్గంలో చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా దేశ ప్రజల అండతో న్యాయ పోరాటం చేస్తామన్నారు. బీజేపీ దుశ్చర్యలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతోందన్నారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడడం పిరికితనమని మండిపడ్డారు. కాంగ్రెస్‌పై రాజకీయ ప్రతికారానికి పాల్పడుతోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ నియంత పాలనను ఎదుర్కొంటామన్నారు. దేశ ప్రజలంతా కాంగ్రెస్‌కు అండగా ఉన్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో బీజేపీ కుట్రలను ఎదుర్కొన్ని తిప్పికొడతామని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్‌తో పాటు ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, ఎస్‌సీ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు రాహుల్‌రెడ్డి, లక్ష్మరెడ్డి, బంక సంపత్, అలువాల కార్తీక్, గుంటి స్వప్న, అంబేద్కర్ రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత సత్తా చాటాలి

- ప్రయత్నిస్తే గెలుపు మీ సొంతం
- భారత కబడ్డీ జట్టు మాజీ చీఫ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- పాటలతో ఉర్రూతలూగించిన గేయ రచయిత మిట్టపల్లి సురేందర్
- కన్నుల పండువగా కేయూ క్యాంపస్ కళాశాల వార్షికోత్సవం

7



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సెక్స్ రాకెట్ గుట్టు రట్టు

- నర్సంపేటలో వ్యభిచార గృహంపై పోలీసుల దాడి
- నిర్వాహకురాలితో పాటు ముగ్గురు విటుల అరెస్టు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిరుపేద యువతుల ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకొని వారిని సెక్స్ వర్కర్లుగా మారుస్తూ కొన్నేళ్లుగా వ్యభిచారం నిర్వహిస్తున్న సెక్స్ రాకెట్ గుట్టును పోలీసులు ఛేదించారు. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారం జరిగింది. నర్సంపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి. నర్సంపేట పట్టణంలోని మాధన్నపేట రోడ్‌లోని వ్యభిచార గృహంపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, నర్సంపేట ఎస్సై అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులను వ్యభిచార రొంపిలోకి దింపుతూ వ్యాపారం చేస్తున్న ఇంటి యజమానురాలు కిన్నెరపు ఉమ, ముగ్గురు విటులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి ఒక ద్విచక్రవాహనం, ఐదు సెల్‌ఫోన్‌లు, 29 హెచ్‌ఐవీ పరీక్ష కిట్లు, కండోమ్ ప్యాకెట్లు, రూ.2,750 నగదును స్వాధీనం చేసుకున్నారు. వ్యభిచార గృహం నుంచి ఇద్దరు మహిళలను కాపాడి వారిని వదిలివేశారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్, డబ్ల్యూఏఎస్సై రాజేశ్వరి, పోలీసు సిబ్బంది ఒ.కృష్ణ, బి.రాజు, కె.నరేష్, గణేష్‌లు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పరీక్ష కిట్లతో విటులకు ఎర

వ్యభిచార నిర్వాహకురాలు సెక్స్ రాకెట్‌ను గుట్టుచప్పుడు కాకుండా కొన్నేళ్లుగా నిర్వహిస్తోంది. గతంలో ఇదే మహిళ పట్టణంలోని ఓ అద్దె గృహంలో కొనసాగించడంతో అక్కడి వారు మందలించి, బెదిరించడంతో మకాం మార్చింది. అక్కడి నుంచి మాధన్నపేటరోడ్‌లో ఓ ఇల్లును నిర్మించుకొని వ్యభిచార గృహంగా మార్చింది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ తన ఇంట్లో విద్యార్థినులు, మహిళలను సెక్స్ రాకెట్‌లోకి దింపుతూ వ్యాపారం కొనసాగిస్తున్నది. విటుల కోరిక మేరకు హెచ్‌ఐవీ పరీక్ష కిట్లతో సెక్స్ వర్కర్లకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసు దాడిలో హైచ్‌ఐవీ కిట్లు లభ్యమయ్యాయి.

భూ సమస్యల పరిష్కారానికే

భూ భారతి చట్టం

- జూన్ 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌వోఆర్ అమలు
- అవగాహన సదస్సులో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి-ఆర్‌వోఆర్ చట్టంతో భూసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొనాయిమాకుల రైతు వేదికలో భూ భారతి చట్టంపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ సత్య శారదతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో భూ భారతి చట్టం ర్యాలీని నిర్వహించారు. అనంతరం రేవూరి మాట్లాడుతూ.. అంబేద్కర్ జయంతి రోజు భూ భారతి చట్టం-పోర్టల్‌ను సీఎం ప్రారంభించి నాలుగు మండలాలను పైలట్‌గా తీసుకున్నారన్నారు. రైతుల నుంచి వచ్చే అప్పీళ్లు, ఎదురయ్యే సమస్యలను సమీక్షించి జూన్2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయనున్నట్లు చెప్పారు. ధరణి కంటే ముందు ఉన్న లాండ్ స్టేటస్ పోర్టల్‌లో ఉండబోతుందన్నారు. ప్రజా పోరాటాల ద్వారా పుట్టుకొచ్చిన రెవెన్యూ చట్టాలు.. ప్రజల, భూసమస్యల శాశ్వత పరిష్కారాలకు ఉపయోగపడాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. బాధిత రైతు సమస్యను తెలుపుతూ తహసీల్దార్‌కు దరఖాస్తు చేస్తే 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలని, లేకుంటే దరఖాస్తుదారుడికి ఆమోదం లభించినట్లేనని చెప్పారు. బాధితులు న్యాయం కోసం ఆర్డీవో, కలెక్టర్‌లకు కూడా అప్పీలు చేసి సత్వర న్యాయం పొందవచ్చన్నారు. పట్టా పాస్‌బుక్‌లో ఏవైనా తప్పులు ఉంటే మార్చుకునే అవకాశం ఈ చట్టంలో కల్పించినట్లు వివరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిబంధనలు తెలుపకుండా చట్టాలను అమలుచేసి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడారన్నారు. కాస్తు కాలం తీసేసి రైతుల మధ్య గొడవలు సృష్టించారని మండిపడ్డారు. దీంతో పలు రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలచి భరోసాను ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఏవో హరిప్రసాద్‌బాబు నాయకులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి



డామిట్.. సిండికేట్ ఫట్!

- రూ.30కోట్ల బల్దియా పనులకు బడా కాంట్రాక్టర్ల ప్లాన్
- కాంప్రమైజ్ అవుదామని జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయం
- వ్యతిరేకించిన 90 శాతం మంది జూనియర్ కాంట్రాక్టర్లు
- టెండర్లు దాఖలు చేయడంతో ప్రభుత్వానికి ఆదాయం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బల్దియా బడా కాంట్రాక్టర్లు వేసిన ప్రణాళిక విఫలమైంది. జూనియర్ కాంట్రాక్టర్లు ఊహించని విధంగా తీసుకున్న నిర్ణయానికి సీనియర్ కాంట్రాక్టర్లు ఖంగుతిన్నారు. హనుమకొండ పరిధిలో బల్దియా జనరల్ ఫండ్ నిధులతో చేపట్టే పనులను పంచుకుందామనుకున్న వారి కలలు కల్లలయ్యాయి.

కాంప్రమైజ్ వద్దు..

బల్దియా పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టే హనుమకొండ కాంట్రాక్టర్ల సంఘం జనరల్ బాడీ సమావేశం ఈ నెల 13న హనుమకొండ 100 ఫీట్ల రోడ్డులోని ఓ గార్డెన్‌లో జరిగింది. గత ఆదివారం జరిగిన కాంట్రాక్టర్ల సర్వసభ్య సమావేశానికి 90మంది హాజరయ్యారు. ఇందులో సంఘం నాయకులు ప్రస్తుతం హనుమకొండలో చేపడుతున్న బల్దియా అభివృద్ధి పనులు, వాటి తాలూకు బిల్లులు, అధికారులు వేధింపులు, ఇంకా రికార్డులు, చేసిన పనులకు అధికారులకు ఇచ్చే పర్సంటేజీలపై ముందస్తుగా చర్చించుకున్నారు. అలాగే 2025-2026 సంవత్సరంలో చేపట్టే పనుల గురించి మాట్లాడుకున్నారు. కాంట్రాక్టర్లందరూ పోటీకి పోవొద్దని, కాంప్రమైజ్ టెండర్ల ద్వారా పనులు దక్కించుకుంటే లాభంగా ఉంటుందని భావించారు. అయితే ఈ నిర్ణయాన్ని చాలా మంది వ్యతిరేకించడంతో పథకం విఫలమైనట్టు విశ్వసనీయ సమాచారం.

విఫలం

బల్దియా పరిధిలోని 90 రకాల అభివృద్ధి పనులను ఏప్రిల్ మాసంలో 137 మంది కాంట్రాక్టర్లు పంచుకుందామని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఏకపక్ష టెండరు పనులలో వచ్చే ఆదాయంలో అధికారులకు, పాలకవర్గానికి పర్సంటేజీలు ఇవ్వడానికి రహస్య ఒప్పందం చేసుకున్నారు. అయితే ఒకే పనికి ఇద్దరు వ్యక్తులు పోటీ రాకుండా ముందస్తుగా ఒప్పందం చేసుకుని రంగంలోకి దిగాలనుకున్నారు. ఇదంతా లోపాయికారిగా సీనియర్లు, నాయకులు మాట్లాడుకుని జనరల్‌బాడీ సమావేశంలో ప్రవేశపెట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. కానీ ఇప్పటికే చాలాచోట్ల రూ.కోట్లు వెచ్చించి కాంట్రాక్టు పనులు పూర్తి చేసిన వారికి బిల్లులు రాక విసుగెత్తిపోయారు. ఈ కారణంగా 90 శాతం మంది కాంట్రాక్టర్లు కాంప్రమైజ్ పనుల (సిండికేట్) పద్ధతిని వ్యతిరేకించి అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయినట్టు తెలిసింది. ఇప్పటి వరకు పనులకు సంబంధించిన టెండరు బెడ్లు తెరుచుకోలేదు. దీంతో నాయకులు వేసిన పథకం విఫలం అయింది.

రూ.30కోట్లతో 90 రకాల పనులు

హనుమకొండ నగరంతో పాటు విలీన గ్రామాలలో రూ.30కోట్ల వ్యయంతో 90రకాల రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేసేందుకు బల్దియా నిర్ణయించింది. ఈ విధంగా సీటీఎస్ పనులను ఇంజనీరింగ్ అధికారులు, పాలకవర్గం పెద్దలు మూడుసార్లు వాయిదా వేస్తూ వచ్చారు. చివరి సారిగా ఏప్రిల్ 15 రోజు టెండర్లకు సంబంధించిన టెక్నికల్ బెడ్స్‌ను తెరవాలని నిర్వహించారు. కానీ జనరల్ బాడీకి వచ్చిన 90 శాతం మంది కాంట్రాక్టర్లు పోటీ ద్వారానే టెండర్లు తీయాలని డిమాండ్ చేశారు. దీంతో 90 రకాల అభివృద్ధి పనులకు ఒక్కో పనికి అంచనాలను బట్టి పది మంది చొప్పున ఇటీవల టెండర్లు వేసి పోటీలో నిలిచారు. ఈ విధంగా టెండరుదారులు పోటీలో పెద్ద ఎత్తున నిలిచారు. దీంతో ప్రభుత్వానికి సుమారు రూ.2కోట్ల ఆదాయం వచ్చినట్టు చెప్పుకొచ్చారు. అలాగే యువ కాంట్రాక్టర్లు తక్కువ కొటేషన్ వేయడంతో ప్రభుత్వ ఆదాయం పెరిగింది.





ఎల్కతుర్తి మండలం బావుపేట శివారులోని ప్రభుత్వ భూమిలో మట్టిని తీస్తున్న ఎక్స్‌కవేటర్, మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

మట్టిని తోడేస్తున్నారు..

● ఎల్కతుర్తి మండల పరిధిలో ఇసుకను మించిన మట్టి దందా ● ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, ఎస్సారెస్పీ కాలువలకు సంబంధించిన మట్టిని తోడేస్తున్నారు. ఎల్కతుర్తి మండల పరిధిలో ఇసుక రవాణాను మించి మట్టి దందా సాగుతోంది. ప్రభుత్వ భూములు, కెనాల్‌కు సంబంధించిన భూముల్లో మట్టిని రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో క్వారీలను ఏర్పాటు చేసి బొందల గడ్డలుగా మార్చుతున్నారు. కాకతీయ ప్రధాన కాలువకు సంబంధించిన భూముల్లో నుంచి భారీగా మట్టిని తీసి అక్రమంగా రవాణా చేస్తున్నారు. అక్రమ రవాణా అడ్డుకోవాల్సిన అధికారులే వారికి కొమ్ముకాయడంతో మట్టి దందాకు కాసుల వర్షం కురిపిస్తుంది.

బొందల గడ్డలుగా ప్రభుత్వ భూములు

ఎల్కతుర్తి మండల పరిధిలోని గ్రామాల్లో గల ప్రభుత్వ భూముల్లో నుంచి యథేచ్ఛగా మట్టిని తోడేయడంతో అవి బొందల గడ్డలుగా మారుతున్నాయి. ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న మట్టిని సైతం గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎస్సారెస్పీ అధికారులకు ముందుగానే సమాచారం అందించి రవాణా చేయడంతో అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలానా ప్రాంతంలో మట్టిని తోడేస్తున్నారని సంబంధిత అధికారులకు సమీప రైతులు, గ్రామస్థులు సమాచారం అందించగా అది మా పరిధిలోకి రాదని దాటవేస్తున్నట్లు గ్రామస్థులు మండిపడుతున్నారు. ఎల్కతుర్తి మండల పరిధిలోని వీరనారాయణపూర్ శివారు నుంచి మొదలు కుని ఎల్కతుర్తి మండల పరిధిలో ఉన్న ఎస్సారెస్పీ కాలువకు రెండు వైపులా ఉన్న మట్టిని తీసి రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రికి రాత్రే పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో, శిఖం భూములు, గుట్టలకు సంబంధించిన భూముల్లో భారీగా గుంతలు తీసి మట్టిని విక్రయిస్తున్నారు. ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించిన అవి గుంతలమయై ఉన్నాయి.

అడ్డుకునేదెవరంటున్న మాఫియా

ప్రభుత్వ భూముల్లో నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్న విషయాన్ని అడ్డుకునే ప్రయత్నంచేసే వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫొటో తీసున్న వ్యక్తులను సైతం బెదిరిస్తూ ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్, యాజమానులు అంటు మట్టి దందా కొనసాగిస్తున్నారు.

రెండు మండలాల సరిహద్దులో మట్టి క్వారీ

ఎల్కతుర్తి, హసన్‌పర్తి మండల సరిహద్దులో కాకతీయ కెనాల్ కాలువకు సమీపంలోని ఓ పట్టా భూమిలో ఓపెన్ కాస్టు తరహాలో ప్రమాదకరంగా మట్టి క్వారీని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సైతం మట్టి కరువైవవ్వడంతో ఇళ్లు నిర్మించుకునే వారికి మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వాల్టా చట్టంలో ఉన్న నిబంధనలను తుంగలో తొక్కి ప్రమాదకర స్థాయిలో మట్టిని తోడి రవాణా చేస్తున్నారు. భారీగా గుంతలు తీసి మట్టిని తీయడంతో ఓపెన్ కాస్టు మైనింగ్‌లను తలపిస్తున్నాయి. సుమారు 50 నుంచి 60 ఫీట్ల లోతులో నుంచి మట్టిని తీయడంతో పశువులకు, రైతులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వ్యవసాయ బావులకు, కాకతీయ కాలువకు సైతం ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల కళ్లముందే దందా జరుగుతున్న మామ్ముళ్లమత్తులో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి.

అధిక ధరలకు విక్రయాలు

ఎల్కతుర్తి మండల పరిధిలో పూర్తిగా వ్యవసాయ సాగు భూములే ఉన్నాయి. కనీసం ట్రాక్టర్ ట్రిప్పు మట్టి తీయలేని పరిస్థితి నెలకొంది. ఇదే అదనుగా భావించిన మట్టి మాఫియాకు వరంగా మారింది. హనుమకొండ, హసన్‌పర్తి, ఎల్కతుర్తి మండలాలకు మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అధిక ధరలకు తరలిస్తున్నారు. ఒక్కోక్క ట్రాక్టర్‌లో సుమారు 100 క్యూబిక్ మీటర్ల మట్టికి రూ.2వేల చొప్పున విక్రయిస్తున్నారు. స్థానిక గ్రామాల్లో సైతం ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.1500 చొప్పున వసూలు చేస్తున్నారు. అలాగే టిప్పర్‌లో 300 క్యూబిక్ మీటర్ల మట్టికి రూ.7వేల నుంచి రూ.8వేల వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు

వాటర్, ల్యాండ్, ట్రీల సంరక్షణ కోసం రూపొందించిన వాల్టా చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే వాటికి తూట్లు పొడుస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన వారే వారికి కొమ్ముకాస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాల్టా చట్టానికి తుంగలో తొక్కి మట్టి తరలింపును యథేచ్ఛగా కొనసాగిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నిత్యం పదుల సంఖ్యల్లో ట్రాక్టర్‌లు, టిప్పర్‌లు ద్వారా ప్రధాన రహదారిపై వెళ్తున్నా అడ్డుకునే వారే లేరని పలువురు ఆరోపిస్తున్నారు.

నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు

అక్రమంగా మట్టి రవాణాచేసే వాహనాలకు నంబర్ ప్లేట్లను తొలగిస్తున్నారు. ఎవరైనా వాహన సమాచారాన్ని పోలీసులకు చేరవేయకుండా రవాణాదారులు జాగ్రత్తలు వహిస్తున్నారు. నిత్యం రోడ్లపై మితిమీరిన వేగంతో వెళుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ట్రాన్స్‌పోర్టు అధికారుల ముందు నెంబర్‌లేని వాహనాలు వెళుతున్న వాటిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ రవాణా చేస్తున్న వాహనాల పత్రాలను పరిశీలించడంతో పాటు వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు ములుగు జిల్లాలో పర్యటించనున్న మంత్రులు

● వెంకటాపూర్‌లో 'భూభారతి' ప్రారంభోత్సవం

ములుగు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపూర్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ శుక్రవారం పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టాన్ని అమలు చేసేందుకు జిల్లాలో వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా మంత్రులు సీతక్క, శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ పర్యటించనున్నారు. భూభారతి కార్యక్రమాన్ని వీరు ప్రారంభించనున్నారు. అనంతరం పీవీసీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న సదస్సులో పాల్గొని రైతులతో మాట్లాడనున్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు

మంగపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పలుచోట్ల మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ యువజన సంఘం పేరిట బుధవారం రాత్రి కరపత్రాలు వెలిశాయి. కర్రెగుట్టలపైకి ఆదివాసీలు రావొద్దని మావోయిస్టులు హెచ్చరించడం దారుణమని పేర్కొన్నారు. 'మావోయిస్టుల్లారా.. మీ సిద్ధాంతం ఇదేనా?' అని ప్రశ్నించారు.

భూపాలపల్లి జిల్లా పలిమెలలో..

మహదేవపూర్‌రూరల్(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు వ్యతిరేకంగా భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో గురువారం ఉదయం పోస్టర్లు దర్శనమిచ్చాయి. మండలంలోని దమ్మూర్, ముకునూర్ గ్రామాల్లో ఆదివాసీ యువజన సంఘం పేరిట ఈ పోస్టర్లు కలకలం రేపాయి. ఆదివాసీలను వారి జీవనాధారమైన అడవుల్లోకి వెళ్లకుండా బాంబులు పెట్టి అడ్డుకుంటారా? అని అందులో ప్రశ్నించారు. ఆదివాసీలపై ఆంక్షలా.. ఇంకెన్నాళ్లు ఈ అరాచకాలు అని పేర్కొన్నారు. అడవుల్లో బాంబులు.. ఆదివాసీల గుండెల్లో గుబులూ.. మావోయిస్టులారా.. మీకిది తగునా అంటూ ఈ పోస్టర్లు కలకలం రేపాయి. దీనిపై స్థానిక పోలీసులను సంప్రదించగా పోస్టర్లు వెలిసినట్లు తమ దృష్టికి వచ్చిందని.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

● ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిందితుడికి దేహశుద్ధి

● పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

వరంగల్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్మాజిపేటలో మూడేళ్ల బాలికపై అత్యాచారయత్నం జరిగిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. సీఐ మహ్మద్ అబ్దుల్ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 33ఏళ్ల రంజాన్ రెండేళ్ల కిందట బతుకు దెరువు కోసం వరంగల్‌కి వచ్చి పెయింటింగ్ పని చేస్తున్నాడు. అతడి భార్య, పిల్లలు ఉత్తరప్రదేశ్‌లోనే కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వరంగల్ గిర్మాజిపేటలో రంజాన్ ఒకఇంట్లోని పైపోర్షన్‌లో అద్దెకు ఉంటు న్నాడు. కింద పోర్షన్‌లో మరో కుటుంబం కూలి పనిచేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో కింద పోర్షన్‌లో ఉండే అన్నాచెల్లెలు బాలుడు(4), బాలిక(3)తో చనువుగా ఉండే రంజాన్ ఆడుకుందామంటూ వారిని బుధ వారం సాయం త్రం 7గంటలకు తన గదిలోకి తీసుకెళ్లాడు. చాలాసేపటి వరకు పిల్లలు కిందికి రాకపోవడంతో మరో పోర్షన్‌లో ఉండే ఓమహిళ వెళ్లి చూడగా పిల్లలిద్దరూ సెల్‌ఫోన్‌లో ఆడుకుంటూ కనిపించారు. వారిని కిందికి తీసుకెళ్లిన తర్వాత ఇం తసేపు ఏం చేశారని పిల్లల నానమ్మ అడిగింది. దాంతో బాలిక వచ్చీరాని మాటలతో రంజాన్ తనను తాకిన శరీరభాగాలను చూపింది. రంజాన్ అసభ్య ంగా ప్రవర్తించినట్టు గుర్తించిన బాలిక కుటుంబసభ్యులు బాలిక శరీరంపై అతడు తాకరాని చోట తాకినట్టు ఆనవాళ్లు కనిపించడంతో స్థానికులతో కలిసి రంజాన్‌కు దేహశుద్ధి చేసి ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంజాన్‌పై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఉప్పరపల్లిలో పిచ్చికుక్క స్వైరవిహారం

● తొమ్మిది మందిపై దాడి

● భయాందోళనలో ప్రజలు

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో గురువారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. రెండు రోజులుగా ఒక కుక్క గ్రామంలో తొమ్మిది మందిపై దాడి చేసి గాయపర్చింది. రోడ్డు వెంట నడుచుకుంటూ వెళుతున్న వారిపైకి ఎగబడి తల, ముఖంపైనే దాడి చేసి కరిచింది. ఈ కుక్క దాడిలో ఎండీ.అల్లావుద్దీన్, మహబూబీ, మంద రవి, దేశెట్టి సారయ్య, బిజిగ సాయిలు, కంచ కోమల, కట్ల ఎల్లయ్య, కుండె అనూష, కంది పాపయ్యలకు ముఖం, చెవులపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారు మహబూబాబాద్, కేసముద్రం ప్రభుత్వ ఆస్పత్రులకు చికిత్సకోసం తరలివెళ్లారు. సాధారణంగా పిచికుక్కలు కాళ్లను కరుస్తాయి. ఇందుకు భిన్నంగా ఈ కుక్క ఎగబడి తలను లక్ష్యంగా చేసుకొని పైకి ఎగబడి దాడి చేయడం గమనార్హం. సదరు పిచ్చికుక్కను గ్రామస్తులు కర్రలతో కొట్టి చంపినట్లు తెలిసింది. ఇలా మరో రెండు, మూడు కుక్కలు ఉండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

పిల్లలు చేతిలో కర్రలు పట్టుకొని పాఠశాలకు బిక్కుబిక్కుమంటూ వెళుతున్నారు. కుక్కలకు రేబీస్ వచ్చినప్పుడు ఇలా కరిచే అవకాశం ఉంటుందని, కుక్క కరిచినప్పుడు తప్పనిసరిగా ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలని పశువైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. కుక్కలను గ్రామంలో నివారించాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఉప్పరపల్లిలో పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన అల్లావుద్దీన్



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహబూబీ

మహిళల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

» ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

» బస్సు యాత్రకు హనుమకొండ చౌరస్తాలో ఘన స్వాగతం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మహిళల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కోరారు. ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యాదిలో మహిళల హక్కుల పరిరక్షణ పేరుతో చేపట్టిన బస్సు యాత్ర గురువారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం నుంచి చౌరస్తాకు వరకు కొనసాగింది. జిల్లా ఐద్వా, వివిధ ప్రజాసంఘాల నాయకులు, మహిళలు బతుకమ్మలు, బోనాలు డప్పుచప్పుళ్లతో ఐద్వా జిందాబాద్, మహిళలపై దాడులను అరికట్టాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బస్సు యాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేయిస్తంభాల ఆలయం నుంచి చౌరస్తా వరకు ప్రదర్శనగా కొనసాగింది.

ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రమాదేవి అధ్యక్షతన జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో సగభాగం ఉన్న మహిళలను రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించినప్పటికీ స్త్రీ, పురుషుల మధ్య అసమానత్వం కొనసాగుతోందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో ఇంకా స్త్రీలు వెనుకబడి ఉన్నారని, పోరాడి సాధించుకున్న హక్కులను అమలుపర్చడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు. పీఎం నరేంద్రమోదీ బేటీ బచావో అని చెప్పడం వరకే తప్ప.. మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, అత్యాచారాలను, కుల దురహంకార హత్యల గురించి నోరు మెదపడం లేదని ఆరోపించారు. మణిపూర్ ఘటనలో బీజేపీ మంత్రులు నిందితుల పక్షాన ఉండి వారిపై కేసులు పెట్టొద్దు అంటూ ప్రదర్శన చేయడం దుర్మార్గమన్నారు. బిల్కిస్ భానుపై అత్యాచారం, ఆమె కుటుంబం హత్య కేసులో నేరం నిర్ధారణ జరిగి శిక్ష అనుభవిస్తున్న 11మంది ఖైదీలను విడుదల చేయించి శాలువాలతో సత్కరించారని ఆమె ఆరోపించారు. మహిళ మల్లయోధులపైనా లైంగిక వేధింపులు జరిగినప్పుడు కేసు నమోదు చేయడానికి ఆరు నెలలు పట్టిందని గుర్తుచేశారు. ఆర్జీకార్ ఘటన, మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళల సంఘటన రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించుకున్నారే తప్ప.. బాధితులకు న్యాయం కోసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా హక్కుల పరిరక్షణ, దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కోసం రాష్ట్ర కమిటీ చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని, రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాళ్లు రామతార, శ్వేత, రాధిక, రాణి, అనిత, రాధ, పుష్ప, సీఐటీయూ జిల్లానాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలయ్య, బొట్ల చక్రపాణి, రజిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోతు వీరన్న, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొడుగు వెంకట్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి సాంబయ్య, మంద సంత్, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, ప్రజానాట్య మండలి నేత కె.సుదర్శన్ పాల్గొన్నారు.

రేపు జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సర్వసభ్య సమావేశం

వడ్డెపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని పాపులర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 19న ఉదయం 10 గంటలకు వరంగల్ ఉమ్మడి జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు పులి వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి మస్తాన్‌లు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని రిటైర్డ్ పోలీస్ అధికారులందరు ఈ సర్వసభ్య సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మడికొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ వివాహిత మృతి చెందింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ వివరాల మేరకు.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన ఏల్పుల మమత(32) కు కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన రైతు ఏల్పుల లక్ష్మీనారాయణతో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా మమత కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆర్‌ఎంపీ డాక్టర్ వద్ద మందులు తెచ్చుకొని వాడుతున్నా తగ్గడంలేదు. కడుపు నొప్పి భరించలేక ఈనెల 11న రాత్రి 9.30 గంటల సమయంలో పురుగుల మందు తాగి వాంతి చేసుకుంటుండగా భర్త గమనించి 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ మమత గురువారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు వద్దమల్ల సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆత్మ చైర్మన్‌గా నల్లు సుధాకర్‌రెడ్డి

● సీపీఐకి నామినేటెడ్ పదవి రాష్ట్రంలోనే ప్రథమం



సుధాకర్‌రెడ్డి అభినందిస్తున్న విప్ రాంచందర్ నాయక్

కురవి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మ(వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) మరిపెడ డివిజన్ చైర్మన్‌గా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన నల్లు సుధాకర్‌రెడ్డిని నియమించినట్లు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ గురువారం ప్రకటించారు. కురవిలో భూభారతి సదస్సు జరిగిన అనంతరం సుధాకర్‌రెడ్డిని ఆత్మ చైర్మన్‌గా ప్రకటించి శాలువాతో సన్మానించారు. ఆయన ప్రస్తుతం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కొనసాగుతున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులకే నామినేటెడ్ పదవులు దక్కడం సహజం. కాంగ్రెస్‌కు మిత్రపక్షంగాఉన్న సీపీఐకి నామినేటెడ్ పదవి కేటాయించడం రాష్ట్రంలోనే ప్రథమం. గత రెండు పర్యాయాలు డోర్నకల్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా సీపీఐ తరుపున సుధాకర్‌రెడ్డి రాంచందర్‌నాయక్ గెలుపు కోసం విస్తృతంగా కృషి చేశారు. ఈ ఎన్నికల్లో రాంచందర్ నాయక్ గెలుపొందడం, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో తన గెలుపుకోసం కష్టపడ్డ నల్లు సుధాకర్‌రెడ్డికి ఆత్మ చైర్మన్‌గా రాంచందర్‌నాయక్ అవకాశంకల్పించారు. ఈసందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మ చైర్మన్‌గా రైతులకు సాధ్యమైనంత వరకు ఉపయోగ పడతానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, సొసైటీచైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, బండి వెంకట్‌రెడ్డి, బండి లక్ష్మారెడ్డి, సుఖేందర్‌రెడ్డి, బాలగాని శ్రీనివాస్, శ్యామలశ్రీనివాస్, ఎన్.రాజేందర్‌కుమార్, దడిగెల శరత్ పాల్గొన్నారు.

అధికార పార్టీ కార్పొరేటర్ అనుచరుల వీరంగం

» ఇద్దరు యువకులపై విచక్షణారహితంగా దాడి

» రాయితో కొట్టి బైకును లాక్కొన్న వైనం

» రాజీ కోసం నేతలు, పోలీసుల ఒత్తిడి



బాధిత యువకుడి తలపై గాయాలు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడిని ద్విచక్ర వాహనంపై ఇంటిదగ్గర దింపేందుకు వెళ్లిన యువకుడిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ అనుచరులు తీవ్రంగా కొట్టి, బైక్‌ను ఎత్తుకెళ్లారు. 14వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేసినా.. అధికార పార్టీ నేతల ఒత్తిడితో హనుమకొండ పోలీసులు కేసు నమోదుపై తాత్సారం చేస్తున్నారు. బాధితుడి పక్షాన నిలవాల్సిన పోలీసులు.. నిందితులకు వత్తాసు పలుకుతూ రాజీపడాలని ఉచిత సలహాలు ఇస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయమైన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ గ్రామపంచాయతీ గాంధీనగర్‌కు చెందిన సిద్దబోయిన చరణ్‌తేజ్.. వరంగల్ కరీమాబాద్‌లో తన బాబాయి ఇంట్లో ఉంటూ పోచమ్మమైదాన్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. అలాగే హనుమకొండ నయీంనగర్‌లోని ఓ కార్పొరేట్ బట్టల షాపులో పార్ట్‌టైమ్‌గా పనిచేస్తున్నాడు. అలాగే ఏటూరునాగారం మండలానికి చెందిన పోదెం సిసింద్రీ రెడ్డికాలనీలో ఉంటూ అదే షాపులో పనిచేస్తున్నాడు. కాగా, ఈనెల 14న సోమవారం అర్ధరాత్రి సమయంలో చరణ్‌తేజ్.. తన ద్విచక్ర వాహనం పల్సర్‌పై సిసింద్రీని రెడ్డికాలనీలో దింపేందుకు వెళుతున్నాడు. ఈ క్రమంలో రెడ్డికాలనీ రోడ్ నెంబర్ 1 వద్ద ముగ్గురు యువకులు మద్యం మత్తులో బైక్‌ను ఆపారు. ఎక్కడికి వెళుతున్నారని అడుగడంతోపాటు అకారణంగా చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న బండరాయితో చరణ్‌తేజ్ తలపై, కళ్లు, చెవిపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. వెనకాల కూర్చొని ఉన్న సిసింద్రీని సైతం కొట్టి గాయపరిచారు. దీంతో బాధితులు వెంటనే డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకోవడంతో ముగ్గురు యువకులు పరారయ్యారు. కాగా, గాయాలపాలైన యువకులు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొంది ఆరోగ్యం కుదుటపడ్డాక గురువారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అయితే కేసు నమోదు చేయకుండా రాజీపడాలని పోలీసులు సలహా ఇస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. అయితే తన అనుచరులను కాపాడేందుకు అధికార పార్టీ కార్పొరేటర్ పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, తమపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని రోజంతా యువకులు పోలీస్‌స్టేషన్‌లో పడిగాపులు కాసినప్పటికీ కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని సమాచారం.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2240	1521
పల్లికాయ (సూక)	6200	5200
పల్లికాయ (పచ్చిది)	4500	3575
కందులు	6821	3022
పెసళ్లు	7506	3022
పత్తి	7525	5300
పసుపు (కాడి)	14117	10534
పసుపు (గోల)	13339	9700
తేజ మిర్చి	12100	9500
డిడి	-	-
వండర్‌హాట్	13000	10000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	11500	9000
దేశీ	26000	18000
సింగిల్‌పట్టి	18500	15000
దీపిక	12000	10000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం



రఘునాథాచార్యస్వామితో చిన్నజీయర్, ఐఏఎస్ అధికారి రమణాచారి, అర్చకులు (ఫైల్)

ఓరుగల్లు ఆధ్యాత్మిక చక్రవర్తి

- ధర్మపరిరక్షణే ధ్యేయంగా ఎందరికో శిక్షణనిచ్చిన పండితుడు రఘునాథాచార్యులు
- నేడు స్వామి శత తిరునక్షత్ర వేడుకలు
- పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు
- 20న రంగనాథ ఆలయంలో వేడుకలు.. చిన్నజీయర్ రాక
- పలువురు ప్రముఖులకు రఘునాథ దేశిక విశిష్ట పురస్కారాలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆయన పూర్తిపేరు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యులు. పుట్టింది ఏపీలోని కృష్ణా జిల్లా మోటూరు ప్రాంతమైనా ఆయన స్థిరపడింది.. తన అపార పాండిత్య ప్రతిభాపాటవాలకు వేదికైంది మాత్రం వరంగల్‌లోని శివనగర్ ప్రాంతమే. ఒక్క ఓరుగల్లులోనే కాదు సంస్కృతం వినిపించే ప్రతీ చోట ఆయన శిష్యగణమే కనిపిస్తుంది. స్తోత్రం పరిఢవిల్లే ప్రతీ ఇంట్లో వినిపించేది ఆయన నామస్మరణే. వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు చిన్నజీయర్ స్వామి సహా దేశంలోని మరో నలుగురు పీఠాధిపతులకు వేదాల్లో, ఉపనిశత్తుల్లో, శ్రీభాష్యంలో శిక్షణ ఇచ్చిన ఉద్దండ పండితుడిగా రఘునాథాచార్యులు పేరొందారు. సంస్కృత భాషకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఎన్నో గౌరవాలు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చాయి. ఆయనను అంబారీ ఎక్కించాయి. ఒకటి కాదు రెండు కాదు ఆయన పొందిన అవార్డులు, రివార్డులు కోకొల్లలు. ఒక్క వరంగల్‌లోనే కాక అనేక ప్రాంతాల్లో నిరాదరణకు గురైన అనేక ఆలయాలకు జీర్ణోద్ధరణ చేశారు. వైష్ణవ సాంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా జీవితకాలం నిలిచిన ఆయన భవిష్యత్ తరాల కోసం వందకు పైగా అద్భుత గ్రంథాలను కానుకగా అందించారు.

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..

వరంగల్ నగరంలో సత్‌సంప్రదాయ పరిరక్షణ సభను ఆవిర్భవింపజేసి తద్వారా ధర్మ పరిరక్షణే ధ్యేయంగా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు రఘునాథాచార్యులు. సంప్రదాయ సిద్ధాంత రహస్యాలు, అధ్యాపనం, రచనా వ్యాసంగం, గ్రంథ ప్రచురణలు, వ్యాఖ్యానాలు, విమర్శణలు, సమున్నత వ్యక్తిత్వంతో నిర్వహించిన ఆర్ష భారతీ స్వరూపులుగా అనేక మంది ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. శాస్త్ర రత్నాకరుణిగా, కవిశాబ్దిక కేసరిగా, మహామహోపాధ్యాయుడిగా జాతీయ స్థాయిలో అనేక బిరుదులను అందుకున్నారు. కవుల శబ్ద ప్రయోగాలకు పరవశించిపోయే కవిశాబ్దికకేసరిగా, తర్క, వ్యాకరణ, సాహిత్య, మీమాంసాది, శాస్త్రాల లోతెరిగిన శాస్త్ర రత్నాకర బిరుదు ఆయనకే దక్కింది. వేదాంత శాస్త్రంలోని మత త్రయ భాష్యాలను, ద్రావిడాగమ రహస్య సంప్రదాయ తత్వాలను ఆమూలాగ్రం అవపోసనపట్టిన ఉభయ వేదాంత ప్రవక్తకుడిగా నల్లాన్ చక్రవర్తి పేరొందారు. శ్రీ విష్ణు సహస్రనామ భాష్యం, ముండకోపనిషత్ శ్రీమాలిక స్తుతి, వేద ప్రామాణ్యము, అమృతవర్షిని, శ్రీభాష్యం (తెలుగు వాఖ్యానం) లాంటి 54 గ్రంథాలను తాను స్థాపించిన సత్‌సంప్రదాయ పరిరక్షణ సభ ద్వారా ముద్రింపజేసి ఆధ్యాత్మికతను విస్తృతం చేశారు. సంస్కృత విజ్ఞాన వర్ధిని పరిషత్‌ను కూడా ఆయన స్థాపించారు. తద్వారా మరో 90 గ్రంథాలను రచించి ఆయన ముద్రింపజేశారు. ఇక శ్రీవైష్ణవ సాంప్రదాయానికి నిలువెత్తు రూపంగా కనిపించే నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యస్వామి ఏప్రిల్ 18న శత వసంతాలు పూర్తి చేసుకుంటున్నారు. 2018 అక్టోబరు 13న వరంగల్ శివనగర్‌లో తుదిశ్వాస విడిచిన ఆయన అనుసరించిన మార్గం ఆధ్యాత్మిక సేవలు నిరంతరం వైష్ణవ సంప్రదాయ వాసులను పలకరిస్తూనే ఉన్నాయి. ఆయన మరణ అనంతరం ప్రతియేటా సత్‌సంప్రదాయ పరిరక్షణ సభ ఆధ్వర్యంలో సముద్రాల శఠగోపాచార్య ఆధ్వర్యంలో నిరంతర కార్యక్రమాలు కొనసాగుతుండటం చిన్నజీయర్ స్వామి సహా అనేక మంది స్వామీజీలు పాల్గొనడం సంప్రదాయంగా వస్తోంది.

ఎన్నో పురస్కారాలు..

త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి 1970లో ఉభయ వేదాంతచార్య బిరుదుతో రఘునాథచార్యస్వామిని సత్కరించారు. 1972లో నాటి రాష్ట్రపతి వివి గిరి చేతులమీదుగా కవిశాబ్దిక కేసరి, 1999లో తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం ద్వారా మహామహోపాధ్యాయ, కాకతీయ విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్, శాస్త్ర రత్నాకర, ఉభయ వేదాంత మహోదధి, అప్పాజోష్యుల, విష్ణుబొట్ల, కందాలం వారిచే ఉభాయ వేదాంత ప్రవర్తకాచార్య లాంటి బిరుదులతోపాటు విజయవాడలో 2006లో గజారోహణం, కనకాభిషేకం, తులభార స్వర్ణకంకణం, 2015లో తెలంగాణ అవతరణ వేడుకల్లో నాటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా తెలంగాణ ఆవిర్భావ పురస్కారం లాంటివి అందుకొని తనద్వారా ఓరుగల్లు ఖ్యాతిని విశ్వవ్యాపితం చేశారు.

నేడు శత తిరునక్షత్ర వేడుకలు

ఈసారి నల్లాన్ చక్రవర్తుల స్వామి వారి శత తిరునక్షత్ర వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఆధ్యాత్మిక, సంప్రదాయపరులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. హనుమకొండలోని చిన్న కోవెలగా పేరొందిన శ్రీసీతారామాలయంలో, హనుమకొండ ఎక్సైజ్ కాలనీ శ్రీ వెంకటేశ్వరాలయంలో, అదాలత్ శ్రీభూనీలా సమేత వెంకటేశ్వరాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంతేగాక స్వామివారి శిష్యులున్న తెలుగు రాష్ట్రాల్లోని మరో 8 ప్రదేశాల్లోనూ రఘునాథచార్యస్వామి శతజయంతి వేడుకలు జరగనున్నాయి. ఇక 20వతేదీన ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి- సుమతిరెడ్డి ఆధ్వర్యంలో అన్నసాగర్‌లోని ఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయం వేదికగా అనేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనేక మంది పండితులకు శ్రీనాథ దేశిక విశేష పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. త్రిదండి చిన్నజీయర్‌స్వామి సహా అనేక మంది పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.



రఘునాథాచార్యస్వామి (ఫైల్)

నాటివే పూర్తి కాలే.. ఇప్పటివెప్పుడు పూర్తయ్యేను?

- సరస్వతీ పుష్కరాలకు ఉన్నది 28 రోజులే
- రూ.25 కోట్ల అభివృద్ధి పనులపై కానరాని పట్టింపు



పుష్కర ఘాట్ వద్ద నత్తనడకన సాగుతున్న పనులు

మహదేవపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాలు సమీపిస్తున్నాయి. మరో 28రోజుల్లో సంరంభం ప్రారంభం కానుంది. ఈ క్రమంలో తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాలకు చేపట్టిన పనులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొమ్మిదేళ్ల క్రితం ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులే నేటికి పూర్తికాలేదని, ఇప్పటి పుష్కరాల పనులు ఎప్పటికి పూర్తయ్యేను అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మే 15 నుంచి 26 వరకు సరస్వతి పుష్కరాలు జరుగనున్న నేపథ్యంలో కాళేశ్వరంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. గతంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ అభివృద్ధికి రూ.25కోట్లు మంజూరు చేసినా ఆ పనులు నేటికీ పూర్తి కాలేదు. ఆయా పనులపై కలెక్టర్లు, ఉన్నతాధికారులు పలు సమీక్షలు, సమావేశాలు నిర్వహించినా ఇంతవరకు ఎలాంటి అడుగు పడలేదు. సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టితో రూ.25 కోట్లు మంజూరు చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, పలువురు అధికారులు, కలెక్టర్ ఆయా పనులపై పలు మార్లు సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. సరస్వతీ ఘాట్‌లో పనులు కొన్ని ప్రారంభమైనా అవి నత్తనడకన సాగుతున్నాయి. కాళేశ్వరంలో పలు శాఖలకు చెందిన అభివృద్ధి పనుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. దేవాదాయ, పంచాయతీరాజ్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సమన్వయం లేకపోవడంతో పనుల నిర్వహణ పర్యవేక్షణ కొరవడింది. సరస్వతీ పుష్కరాలకు కేవలం 28 రోజులే మిగిలి ఉండడంతో పనులు పూర్తయ్యేనా లేదా అనే సందిగ్గం ఏర్పడింది. వేసవి కాలం కావడంతో ఇబ్బందులు తప్పేలా లేవని, నిధుల మంజూరు చేసినా ఫలితం లేదని, పనుల ప్రగతి అంతంత మాత్రంగానే ఉందని భక్తులు ఆక్షేపిస్తున్నారు.

కలిసిరాని రూ.25 కోట్లు పనులు

తొమ్మిదేళ్ల క్రితం రూ.25కోట్ల నిధులు మంజూరు కాగా సరస్వతి పుష్కరాలకు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటివరకు గత పనులే నత్తనడకన సాగుతుండగా.. తాజా పనులదీ కూడా అదే పరిస్థితి ఉండటంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కాళేశ్వరంలోనే ఉంచి పనులను రాత్రింబవళ్లు పూర్తి చేయించాలని భక్తులు కోరుతున్నారు.

యువత సత్తా చాటాలి

- ప్రయత్నిస్తే గెలుపు మీ సొంతం
- భారత కబడ్డీ మాజీ చీఫ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- పాటలతో ఉర్రూతలూగించిన గేయ రచయిత మిట్టపల్లి సురేందర్
- కన్నుల పండువగా కేయూ క్యాంపస్ కళాశాల వార్షికోత్సవం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యువత కష్టపడి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే జీవితంలో అనుకున్నది సాధించవచ్చని భారత కబడ్డీ జట్టు మాజీ చీఫ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉద్బోధించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ అధ్యక్షతన కళాశాల వార్షికోత్సవం, క్రీడోత్సవం జరిగింది. ప్రముఖ గేయ రచయిత, మిట్టపల్లి సురేందర్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ బి.సుకుమారి, డాక్టర్ మల్లం నవీన్, డాక్టర్ బి.రమ, కారుకాల అనితారెడ్డి, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, పుల్లూరు సుధాకర్‌తో పాటు అన్ని విభాగాల అధిపతుల సమక్షంలో వీసీ అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా లింగంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డిలోని మారుమూల ప్రాంతంలో జన్మించి కష్టపడి కబడ్డీ క్రీడలో రాణించినట్లు వెల్లడించారు. యుద్ధం, క్రీడల్లో గెలిచిన సందర్భంలో భారతదేశ జాతీయ జెండా ఇతర దేశాల్లో ఎగురవేస్తారని, తమ కబడ్డీ జట్టు పాకిస్థాన్‌పై గెలిచి జెండాను పాకిస్థాన్‌లో ఎగురవేశామని ఉద్వేగంగా ప్రకటించారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. నిరుత్సాహాన్ని వీడి గెలుపునకు ప్రయత్నించాలన్నారు. వర్సిటీ క్యాంపస్ విద్యార్థి జీవితంలో కీలకమన్నారు. ప్రముఖ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ.. యువతకు లక్ష్యంపై గురి ఉండాలని, సమాజ మార్పు యువత తోనే సాధ్యం అవుతోందన్నారు. తాను పీడిత వర్గాలపైపు నిలబడి పాటలు రాస్తున్నానని, శ్రామిక వర్గాలైన డ్రైవర్లు, రైతులు, అణచివేతకు గురైన వారే తన పాటలకు వస్తువన్నారు. సినిమా పాటల్లో అశ్లీలసాహిత్య సృజన చేయనని వెల్లడించారు. వరంగల్ జిల్లా, వెలిశాల గ్రామం, సెల్‌ఫోన్‌లపై తను రాసిన పాటలను సందర్భనుసారంగా పాడుతూ విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని కల్పించారు. కేయూపై పాటరాసి ఇక్కడే ఆవిష్కరిస్తానని ప్రకటించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టుదల, కష్టించేతత్వం, నిలకడగా ప్రయత్నిస్తే గెలుపు సాధ్యమవుతుందన్నారు. కేయూను మరింత ముందుకు తీసుకెళ్లాలని, సాంస్కృతిక ఉత్సవాలు విద్యార్థులకు కొత్త ఉత్సాహాన్నిస్తాయని, క్రీడల్లో యువత రాణించాలని సూచించారు. పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్ మాట్లాడుతూ.. జీవితంలో ఎదిగిన వారంతా కష్టపడి పైకివచ్చిన వారేన్నారు. ఓరుగల్లుకు సాహిత్యవారసత్వంతో పాటు ధిక్కార స్వరం ఉందన్నారు. డాక్టర్ బి.సుకుమారి, అనితారెడ్డి, రమ మాట్లాడుతూ.. ప్రతీఒక్కరికీ ఒక్కోరంగంలో అద్భుత నైపుణ్యాలుంటాయని, వాటిని గుర్తించి జీవితంలో స్థిరపడాలని అన్నారు. డాక్టర్ మల్లం నవీన్, పుల్లూరి సుధాకర్, చిర్రా రాజుగౌడ్‌లు మాట్లాడుతూ.. యవత తన జీవితం గెలిచి తమ జీవితాన్ని స్వార్థకం చేసుకోవాలని చెప్పారు. అధ్యక్షత వహించిన తాళ్ళపల్లి మనోహర్ మాట్లాడుతూ.. కేయూ చరిత్రలో స్పోర్ట్స్‌డే, సాంస్కృతిక సంబురాలు, క్రీడోత్సవాలు ఎల్లప్పుడూ నిలుస్తాయని అన్నారు. క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత సభకు స్వాగతం పలికారు. ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, మంజుల, సుజాత, పోడేటి శ్రీనివాస్, ముంజుం శ్రీనివాస్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌లు సమన్వయకులుగా వ్యవరించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ వై.వెంకయ్య, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శేషాల కుమార్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కేయూలోని వివిధ విభాగాధిపతులు ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జునరెడ్డి, జి.షమిత, ఎం.స్వర్ణలత, బి.లలితకుమారి, బి.దీపాజ్యోతి,బి. రాధికారాణి, ఆర్.భారవిశర్మ, పి.వెంకటయ్య, టి.శాస్త్రి, జి.మంజుల, ఎస్.మల్లేశ్వర్, సీహెచ్.రాజ్‌కుమార్, జే.శ్రీనివాస్, కె.మధుకర్‌రావు, ఎస్.వెంకటయ్య, ఎం.లింగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వేదికపై ప్రముఖులు



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ట్రోఫీలు బహూకరిస్తున్న భారత కబడ్డీ జట్టు మాజీ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌రెడ్డి వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో వీసీ ప్రతాప్‌రెడ్డి, ఇతర అధికారులు

అంబరాన్నంటిన సాంస్కృతిక సంబురాలు

కాకతీయ యూనివర్సిటీలో గురువారం సాయంత్రం కేయూ క్యాంపస్ కళాశాల వార్షికోత్సవం, క్రీడోత్సవాల సందర్భంగా జరిగిన సాంస్కృతిక సంబురాలు అంబరాన్ని అంటాయి. మైన ఎర్రన్న, కందికట్ల విజయ్, అనితయాదవ్ బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. ప్రత్యేక అర్కెస్ట్రా బృందం పసందైన సంగీతాన్ని అందించారు. క్లాసికల్ డ్యాన్స్‌లు, గ్రూప్ డ్యాన్స్, సోలో డ్యాన్స్‌లతో క్యాంపస్ ఆడిటోరియం హోరెత్తింది. ఆట పాటలకు విద్యార్థులు కోరస్ కలిసి నృత్యాలు చేస్తూ పాటలు పాడారు. సాంస్కృతిక కార్యక్రమాలకు కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వం వహించి సమన్వయం చేశారు.



పాటలు పాడుతున్న ప్రముఖ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, కళాకారులు

భూములకు ఇక దేశవ్యాప్త గుర్తింపు

5వ పేజీ తరువాయి

భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయటం ద్వారా యూనిక్ కోడ్‌ను రూపొందిస్తారు. 14 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య ఏ రకమైన చట్టబద్ధ యాజమాన్య హక్కులు కల్పించదు. కేవలం రెవెన్యూ శాఖ వద్దనున్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని రైతులకు గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. సీఎం కిసాన్ సమ్మాన్ పథకం లబ్ధిదారులకు తదుపరి విడత సొమ్ములు జమ చేసేందుకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీని ప్రామాణి కంగా తీసుకోవాలని కేంద్రం మార్గదర్శకాలిచ్చింది.

ఆధార్‌తో అనుసంధానం

రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు ఆధార్ కార్డుతో పాటు దానితో అనుసంధానించిన మొబైల్ నెంబర్, భూ యాజమాన్య పాస్ పుస్తకం కావాలి. వీటి ఆధారంగా ఆయా క్లస్టర్ల పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు గుర్తింపు సంఖ్యలు కేటాయిస్తారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితరాలకు ఈ గుర్తింపు సంఖ్యకు ఎలాంటి సంబంధం ఉండదు. కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాలకు మాత్రమే దీనిని ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

శిక్షణ

రైతు గుర్తింపు కార్డులకు సంబంధించి ఇటీవల హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. రైతులు, భూముల వివరాలతో ఈ- ఫార్మర్ రిజిస్ట్రీని ఎలా రూపొందించాలనే విషయంలో అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతీ భూ కమతానికి 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపుపై మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో తదుపరి శిక్షణా కార్యక్రమం త్వరలో నిర్వహిస్తారు. దీనిపై అన్ని మండలాల ఏఓలు, ఏఈఓలకు రైతు వేదికల్లో శిక్షణ ఇస్తారు.

రైతు వేదికల్లో నమోదు

జిల్లాల వారీగా ప్రస్తుతం రైతు వేదికల్లో లేదా ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడ రైతుల వివరాలను నమోదు చేస్తారు. ఈ నమోదు కార్యక్రమాన్ని ఈనెల 22 నుంచి ప్రారంభించనున్నారు. రైతులు సంబంధిత వివరాలు తీసుకువెళ్లి మండల విస్తరణాధికారులు, లేదా వ్యవసాయాధికారులను సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వెంటనే రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఈ నెంబరును సిబ్బందికి తెలియజేస్తే 14 అంకెల ప్రత్యేక గుర్తింపు నెంబరు వస్తుంది. గ్రామాల వారీగా నమోదును పూర్తి చేస్తారు. ఈ రోజుల్లో రైతులు అందుబాటులో లేకపోయినా తర్వాత కూడా నమోదు చేసుకోవచ్చు.

రైతులు...

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు 8,77,173 మంది ఉన్నారు. వీరందరు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు పొందేందుకు అర్హులు. హనుమకొండ జిల్లాలో 1,50,982 మంది, వరంగల్ జిల్లాలో 1,54,405 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,16,574 మంది, ములుగు జిల్లాలో 76,692 మంది, జనగామ జిల్లాలో 1,85,937 మంది, మహబూబాబాద్ జిల్లాలో 1,92,583 మంది రైతులు ఉన్నారు.


ఎన్‌సీసీ శిక్షణతో నాయకత్వ లక్షణాలు

కల్నల్ విజయ్ కుమార్

హనుమకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, దేశభక్తి, సేవాధృక్పథాన్ని పెంపొందిస్తుందని 1 (టి) సీటీఆర్ ఎన్‌సీసీ వరం గల్ యూనిట్ కమాం డింగ్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ లెఫ్టినెంట్ కల్నల్ విజయ్ కుమార్ అన్నారు. గురువారం వరంగల్ నిట్‌లో ఎన్‌సీసీ విద్యార్థు లకు సర్టిఫికెట్ ప్రదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. నిట్ ఎన్‌సీసీ క్యాడెట్లు సామాజిక కార్యక్రమాల్లో చూపు తున్న సేవాభావాన్ని కొనియాడారు. విద్యార్థులు సర్టిఫి కేషన్ కోర్సుల్లో ప్రతిభ చూపినందుకు ప్రశంసలు కురిపించారు. వరంగల్ నిట్ విద్యార్థులు ఎన్‌సీసీ పరీక్షల్లో ప్రతిభ చాటారు. 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. మొత్తం 23 మంది విద్యార్థుల్లో 17 మంది బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎన్‌సీసీ బి సర్టిఫికెట్లను, 6గురు బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులు సీ సర్టిఫికెట్లను పొందారు. ఈ పరీక్షలు ఇటీవల వరంగల్‌లోని ఎల్‌బీ కాలేజీలో నిర్వహించారు. విద్యార్థుల్లో చాలామంది ఏ గ్రేడ్ సాధించగా మిగతా వారు బి గ్రేడ్ సాధించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ కమాండింగ్ ఆఫీసర్ రాహుల్ హాజరయ్యారు. విజయవంతంగా పరీక్షలు పూర్తి చేసిన క్యాడెట్లకు సర్టిఫకెట్లను అందజేశారు. అనంతరం విజయ్ కుమార్ ఎన్ఐటీ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌ను కలిసి నిట్ ఎన్‌సీసీ విద్యార్థులను అభినందించారు.



సర్టిఫికెట్లతో నిట్ ఎన్‌సీసీ విద్యార్థులు



రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

కాజీపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు కాజీపేటలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. 47, 62, 63 డివిజన్లలోని నాయకులు డీజిల్ కాలనీ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి ప్రచారరథంలో కాజీపేటలోని పలు కాలనీలలో భారీ ర్యాలీ చేపట్టారు. జై.. కేసీఆర్, జై బీఆర్‌ఎస్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నాయకులు నార్లగిరి రమేశ్, సుంచు కృష్ణ, పాలడుగుల శివ, తండమల్ల రేవతి వేణు, సోని, దశరథం, మర్యాల కృష్ణతోపాటు స్థానిక నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు శరీర, అవయవ దానంపై అవగాహన

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సదాశయ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసినట్లు జాతీయ అధ్యక్షుడు టి.శ్రవణ్ కుమార్ తెలిపారు. సదాశయ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ గాంధీ జయంతి రోజున 2008వ సంవత్సరంలో కోల్‌బెల్ట్‌లో ఏర్పడిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో నేత్ర, అవయవ, శరీర, చర్మ దానాలపై కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శరదీరదాన స్ఫూర్తి ప్రదాత కాళోజీ స్ఫూర్తితో ఏర్పడిన ఈ సంస్థ ఇప్పటి వరకు 1400 నేత్ర, 85 అవయవ, 140 మంది శరీరదానాలను చేసి మానవ మనుగడకు తోడ్పడిందన్నారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కన్వీనర్లు ఎస్.వేణుమాధవ్, కె.శంకర్‌రావు, సిహెచ్.దళపతి పాల్గొన్నారు.

స్వామినాథన్ వెట్లాండ్ పార్క్‌ను సందర్శించిన కమిషనర్


చెన్నై స్వామినాథన్ పార్క్‌ను సందర్శిస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలో రెండు రోజుల పాటు జరిగే స్పాంజ్ పార్క్ ఫ్రేమ్ వర్క్ ఫర్ రెసిలెంట్ ఓపెన్ స్పేసెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో జరుగుతున్న కార్యక్రమంలో సస్టైనబుల్ అర్బన్ డెవలప్‌మెంట్ స్మార్ట్ సిటీస్ ప్రాజెక్ట్‌లో భాగంగా అవగాహన కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ నగరం నుంచి కమిషనర్ పాల్గొన్నారు. గురువారం చెన్నై నగరంలోని స్వామినాథన్ వెట్లాండ్ ఏకో పార్క్‌ను కమిషనర్ సందర్శించి అక్కడ అమలు చేస్తున్న కార్యక్రమాలు గుర్తించి తెలుసుకున్నారు. గ్రేటర్ నగరాల్లో స్పాంజ్ పార్క్‌ల నిర్వహణకు ప్రణాళికపై తెలుసుకున్నారు. రెండు రోజుల అవగాహన కార్యక్రమాలను అవగతం చేసుకుని కమిషనర్ వరంగల్ నగరంలో వినూత్న ఆవిష్కరణలు అమలు చేసేందుకు కార్యరూపం దాలుస్తున్నట్టు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని సీపీఎం ధర్నా

కాజీపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి, రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ గురువారం కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఆటో డ్రైవర్లకు జీవనభృతి పథకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు, డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాజీపేట మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సీపీఐ ప్రత్యేక సమావేశం..

కాజీపేట 62వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో గురువారం సీపీఐ మహాసభ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే సీపీఐ ఆవిర్భవించి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిందన్నారు. నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన పోరాటం చేస్తూనేఉందని గుర్తుచేశారు. నిత్యావసర సరుకులు తగ్గించాలని, పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలని నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. సీపీఐ నాయకుడు పూర్ణచందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్ నాయక్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు జక్కు రాజు, నాయకులు గుంటి రాజేందర్, పల్లెపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐల బదిలీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మల్టీజోన్-1 పరిధిలోని ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎస్‌బీలో విధులు నిర్వర్తిస్తున్న బి.సంజీవ్‌ను కరీంనగర్‌లోని మానకొండూర్‌కు, ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న పైండ్ల మల్లయ్యను కమిషనరేట్‌కు కేటాయించినట్లు పేర్కొన్నారు.

వరంగల్-1 డిపోలో నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-1 డిపోలో నేడు డయల్ యువర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం డిపో మేనేజర్ పి.అర్పిత ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్‌లలో బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు డయల్ యువర్ డీఎం కార్యక్రమాల్లో పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని, ఏమైనా సమస్యలు ఉంటే ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు. సంప్రదించాల్సిన సెల్ ఫోన్ నంబర్ 9959226047లో కోరారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికలు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ హైదరాబాద్‌లో గురువారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బానోతు నెహ్రూచంద్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మురళీధర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్‌గా బి.మధుసూదన్‌రెడ్డి, బి.సక్కుబాయి, జి.దుర్గారావు, జ్ఞానసుందరి, పి.మహల, జాయింట్ సెక్రటరీలుగా భరత్‌కుమార్, రోజారాణి, సుధాకర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి మాధవరెడ్డి, హనుమనాయక్, శ్రీనివాసులు, సునీల్‌రాజు, సాయిరెడ్డి, రాజశేఖర్‌లు అభినందనలు తెలిపారు.


మాట్లాడుతున్న నెహ్రూచంద్ నాయక్

వైద్యాధికారులకు శిక్షణ

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21 నుంచి 28 వరకు ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం హసన్‌పర్తిలో జిల్లాలోని వైద్యాధికారులకు, సూపర్ వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, డబ్ల్యూహెచ్‌ఓ సర్వేలెన్స్ వైద్యాధికారి డాక్టర్ అతుల్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్, వ్యాక్సిన్ భద్రపరిచే విధానం, యాక్షన్ ప్లాన్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. టీకాలు ఇచ్చిన వారందరి వివరాలను యువిన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 21 నుంచి 28 వరకు, మే నెలలో 21 నుంచి 28వ తేదీ వరకు, జూన్ నెలలో 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.


హసన్‌పర్తిలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

• సీపీఎం ఆధ్వర్యంలో హసన్‌పర్తిలో ధర్నా, రాస్తారోకో

హసన్‌పర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కరీంనగర్- హనుమకొండ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు మాట్లాడుతూ.. హసన్‌పర్తి ప్రజలు తాగునీటి సమస్యతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై కార్పొరేషన్ అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో వీధి కుక్కలు, కోతుల సమస్యతో పాటు డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు పుల్ల అశోక్, మంద సుచందర్, వేలు సుమన్, వేలు రజిత, నాంపల్లి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమం

▸▸ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందచేస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు, సహాయక చర్యలు అందించే సమయంలో వివక్ష ఏర్పడిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పారదర్శకంగా పాలన సాగిస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలీ, వేముల శ్రీనివాస్, పోతుల శ్రీమాన్, మామిండ్ల రాజు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రేపు ఎల్‌బీ కళాశాల వార్షికోత్సవం

న్యూశాయంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : లాల్‌బహదూర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ముఖ్య అతిథిగా సీనియర్ అథ్లెట్, జాతీయ స్థాయి మెడలిస్టు పసుపునాటి అశోక్, డిపార్టుమెంట్ ఆఫ్ స్పోర్ట్స్, లిరిక్, ఫోక్ సింగర్ నెల్లుట్ల సుమన్ గౌరవ అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. క్రీడా సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవంతో పాటు క్రీడా, సాంస్కృతిక, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాల్లో జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు సిల్వర్ మెడల్స్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.భాగ్యనారాయణ, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్.వినయ్‌కుమార్, గేమ్స్ కమిటీ కన్వీనర్ ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రభాకర్, కల్చరల్ కమిటీ కన్వీనర్ ఎస్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నార

కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల అరెస్టు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చలో సెక్రటేరియట్‌లో భాగంగా గురువారం హైదరాబాద్‌కు వెళ్లిన కాకతీయ యూనివర్సిటీ పార్టుటైమ్ అధ్యాపకులను పోలీసులు అరెస్టు చేసి చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. తమ డిమాండ్లను సాధించుకునే వరకు విశ్రమించేది లేదని కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు ప్రకటించారు. తమకు మినిమం టైమ్ స్కేల్ ఇప్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 21లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టైన వారిలో రాంబాబు, నరేంద్రనాయక్, దేవోజీ, వాసు, ప్రశాంత్, రాజన్న, శ్రీధర్, సురేశ్, వినోద, భాగ్యమ్మ, మయూరి శ్రీవాత్సవ, రమేశ్, మోహన్, ప్రవీణ్, భిక్షపతి, బాలకృష్ణ, సంజీవ్, సుధీర్, నాగేశ్వర్, బక్కి శ్రీనివాస్, చలపతి, గిరిధర్‌లున్నారు.

టీకాల స్పెషల్ డ్రైవ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి : డీఎంహెచ్‌వో

హసన్‌పర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వారం పాటు నిర్వహించే ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం హసన్‌పర్తి యూపీహెచ్‌సీ ఆస్పత్రిలో జిల్లా వైద్యాధికారులకు, సూపర్ వైజర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి అప్పయ్య మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి శిశువుకు, గర్భిణీకి షెడ్యూల్ ప్రకారం టీకాలు ఇవ్వడం ఇమ్యూనైజేషన్ క్యాంపెయిన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతీ బుధవారం, శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ కొన్ని చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు, మైగ్రేషన్ వంటి కారణాల వల్ల కొందరికి టీకాలు మిస్ అవుతున్నాయని అన్నారు. అలాంటి వారిని గుర్తించి తగిన యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని కోరారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, డబ్ల్యుహెచ్‌వో సర్వేలైన్స్ వైద్యాధికారి డాక్టర్ అతుల్ వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్, వాక్సిన్ భద్రపరిచే విధానంపై శిక్షణ అందించారు. ఏప్రిల్ 21 నుంచి 28 వరకు అలాగే మే 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జూన్‌లో 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్న కార్యక్రమ వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ శిక్షణలో వీసీ సీఎం శిరీష, ఎల్‌డీ కంప్యూటర్ సునిల్, జయంతి, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహిళ ఆవేదన విని ఎమ్మెల్యే కంటతడి

• భర్తను కాపాడారంటూ కృతజ్ఞతలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తన భర్త ప్రాణాలను కాపాడారంటూ, తన భర్తను కాపాడుకునేందుకు తాము పడిన కష్టాలను చెప్పిన ఓ మహిళ ఆవేదన విన్న హనుమకొండ జిల్లా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కంటతడి పెట్టారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి హాజరైన ఎమ్మెల్యే నాగరాజును.. అదే గ్రామానికి చెందిన రేణుకుంట్ల రమ, రమేష్ దంపతులు కలిశారు. వారికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడుగా.. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో 4 నెలల కిందట రమేష్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెదడులో కణితి ఉందని, ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. దీంతో కడు పేదరికంలో ఉన్న రమేష్‌కు వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు నేదునూరి సునిల్ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందించేందుకు ఎమ్మెల్యే నాగరాజును ఆశ్రయించారు. దీంతో ఎమ్మెల్యే నాగరాజు నిమ్స్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఖర్చు వివరాలను తెలుసుకొని సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.5లక్షలు మంజూరు చేయించి నిమ్స్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. దీంతో రమేష్ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ విషయాలను రమేష్ భార్య రమ ఎమ్మెల్యేకు గుర్తు చేస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. తనభర్త ప్రాణాలు కాపాడిన దేవుడంటూ కాళ్లపై పడే ప్రయత్నం చేశారు. కన్నీరు పెట్టుకుంటున్న రమను చూసిన ఎమ్మెల్యే నాగరాజు కూడా కన్నీరు పెట్టుకున్నారు. ఆపదలో ఉన్న తమకు వైద్యం కోసం ఆర్థిక సహాయం అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే నాగరాజుకు రమ దండంపెడుతూ 'మీ రుణం తీర్చుకోలేనిదంటూ' కృతజ్ఞతలు తెలిపారు.


కంటతడి పెడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

కేయూలో కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో గురువారం కేయూ కాంట్రాక్టు అధ్యాపకులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన ప్రదర్శనలను అడ్డుకుని కాంట్రాక్టు, పార్టుటైమ్ అధ్యాపకులను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. అక్రమ అరెస్టులను ఖండించారు. కాంట్రాక్టు అధ్యాపకుల నిరసనకు ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా జనరల్ సెక్రటరీ మంద శ్రీకాంత్, డీఎస్‌యూ రాష్ట్ర నేత గణేశ్‌లు మద్దతుగా నిలిచి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు శ్రీధర్‌కుమార్ లోథ్, సాధు రాజేశ్, సతీశ్, కనుకయ్య, ఆర్‌డీ ప్రసాద్, సత్యజూలగడ్డం కృష్ణ, సత్యనారాయణ, బ్రహ్మం, వీణ, సంగీత్‌కుమార్, సూర్యనారాయణ, ఆశీర్వాదం, చంద్రశేఖర్, స్వప్న, సరిత, మంజుల, శ్రీలక్ష్మి, సుచరితపాల్, వెంకటేశ్వర్లు,కిషన్, రమేశ్, శ్రీదేవి, నాగేశ్వర్‌రావు, కవిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

హిమోఫిలియా వ్యాధిపై

అవగాహన కలిగి ఉండాలి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : హిమోఫిలియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు కోరారు. ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా గురువారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరిలో గాయం తరువాత రక్తం తొందరగా గడ్డకట్టదని, రక్తస్రావం అధికంగా అయినప్పుడు ఒక్కోసారి ప్రాణాంతకంకూడా కావొచ్చన్నారు. ఇలాంటి లక్షణాలు అంటే రక్తం నెమ్మదిగా గడ్డ కట్టడం గుర్తించినట్లయితే దగ్గరలోని వైద్యాధికారిని సంప్రదించి తగిన సలహా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మగ పిల్లల్లో హిమోఫిలియా వ్యాధి ఎక్కువగా కనిపిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జీఎంహెచ్‌ఓ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్‌ఎంవో డాక్టర్ అంబరీష్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్‌రావు

కాజీపేటలో జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయంతి


కాజీపేట చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కాజీపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోగురువారం కాజీపేటచౌరస్తాలో అంబేద్కర్, జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడు చిన్న పెళ్లి కొమురయ్య, కార్యదర్శి పసునూరి మనోహర్‌లు హాజరై అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి కేక్‌కట్ చేశారు. అనంతరం చౌరస్తా నుంచి డీజిల్ కాలనీ వరకు భారీ ర్యాలీ చేశారు. అక్కడ జరిగిన ప్రత్యేక సమావేశంలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన త్యాగాలను గుర్తుచేశారు. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ దళిత ఉద్యోగులను, దళిత రత్న అవార్డు గ్రహీతలను, జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రామగిరి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నేత సురేందర్ మాదిగ, రడపాక పరం జ్యోతి, సందెల విజయ్ కుమార్, మల్లికార్జున్‌తో పాటు స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 41 మంది వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 24 మందికి రూ.22,400 జరిమానా విధించగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 17 మందికి రూ.10,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిషేధిత, హానికరమైన రసాయనాలను ఉపయోగించి తయారు చేస్తున్న అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఆరెపల్లిలోని ఏ1 అల్లం వెల్లుల్లి పెస్ట్ షాపులో గురువారం సోదాలు చేసి సుమారు రూ. 9,160 విలువ చేసే పేస్ట్‌ను పట్టుకొని అల్లంతో పాటు నిర్వాహకుడు మహ్మద్ సలీంపాషాను విచారణ నిమిత్తం మున్సిపల్ అధికారులకు అప్పగించామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మడికొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెం శివారులోని ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన స్టోన్ క్రషర్ కోసం కంకర కొట్టడానికి తీసిన గుంతలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. వాచ్‌మన్ అందించిన సమాచారంతో మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ,ధర్మసాగర్ ఎస్సై నర్సింహారావుతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. స్టోన్ క్రషర్ తీసి వేయడంతో గుంతల్లో నిలువ ఉన్న నీటిలో పడి వ్యక్తి చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పరిశీలించగా సుమారు 15 రోజుల కిందట నీటిలోపడి చనిపోయి ఉన్నట్లుగా ఉంది. మృతదేహం పై తెల్లని టీషర్టు ఉండి, కాళ్లకు ప్యాంటు లేదని, అతడి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి బహిర్భూమికి వచ్చి నీటిలో పడి ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. మృతదేహం పక్కన చెప్పుల జత ఉందన్నారు. ఈ పోలికలు గల వ్యక్తి ఎవరైనా తప్పిపోయినట్లు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వాచ్‌మెన్ పోలం రఘోత్తంరెడ్డి ఫిర్యాదు మేరకు శవ పంచనామా జరిపి పోస్టుమార్టంకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సై నర్సింహారావు

అవి అటవీ భూములు కావు.. మాకే ఇప్పించండి

• ముప్పారం గ్రామ రైతుల వేడుకోలు

వడ్డెపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామ శివారులో తాము సాగు చేసుకుంటున్న భూములు అటవీ భూములు కావని, ఆ భూములు తమకే చెందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ముప్పారం గ్రామ రైతులు విజ్ఞప్తి చేశారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పారం గ్రామ రైతులు వి.సందీప్‌రెడ్డి, ఎ.శోభారాణి, ఎ.మల్లయ్య, రాములు, యాదగిరి, లక్ష్మి, కనకలక్ష్మి, పి.నారాయణ తదితరులు మాట్లాడారు. ముప్పారం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 842, 846, 847లలో గల సుమారు 59 ఎకరాల భూమి తమకు వారసత్వంగా సంక్రమించిందని అన్నారు. మరికొంత మంది ఇదే సర్వే నంబర్లలోని భూమిని కొనుగోలు చేసి సాగుచేసుకుంటున్నారని చెప్పారు. ఈ భూమి ప్రభుత్వానిదేనని అటవీ శాఖ అధికారులు తాము సాగుచేసుకోకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొని వారసత్వంగా వచ్చిన భూములను తమకే చెందేలా చూడాలని సీఎం రేవం త్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎం.రాజిరెడ్డి, కాగితోజు కళావతి, శ్యామల మహేందర్‌రెడ్డి, నీరజాదేవి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకాలను ప్రెస్ క్లబ్‌లో ప్రదర్శించారు.


ప్రెస్‌క్లబ్‌లో పట్టాపాసు పుస్తకాలను చూపుతున్న ముప్పారం గ్రామ రైతులు



హనుమకొండ అశోకా జంక్షన్‌లో ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేషనల్ హెరాల్డ్ కేసులపై కాంగ్రెస్ నిరసన

- ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేసిన నేతలు
- బీజేపీది రాజకీయ ప్రతికారమన్న ఎంపీ కావ్య
- నియంత పాలనను ఎదుర్కొంటామన్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ పత్రిక వ్యవహారం మంటలు రాజుకుంటున్నాయి. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గురువారం బీజేపీ తీరును ఖండిస్తూ నిరసన చేపట్టారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి అశోక జంక్షన్ వరకు కాంగ్రెస్ నేతలు ర్యాలీగా తరలివచ్చారు. అశోక జంక్షన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన పత్రికలో పెట్టుబడులు పెడితే మనీ లాండరింగ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లు చార్జ్‌షీటులో పెట్టడం అభ్యంతకరమన్నారు. భారతీయ జనతా పార్టీ నియంతలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కొలేక తమ అగ్రనేతలపై వక్రమార్గంలో చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా దేశ ప్రజల అండతో న్యాయ పోరాటం చేస్తామన్నారు. బీజేపీ దుశ్చర్యలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతోందన్నారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడడం పిరికితనమని మండిపడ్డారు. కాంగ్రెస్‌పై రాజకీయ ప్రతికారానికి పాల్పడుతోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ నియంత పాలనను ఎదుర్కొంటామన్నారు. దేశ ప్రజలంతా కాంగ్రెస్‌కు అండగా ఉన్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో బీజేపీ కుట్రలను ఎదుర్కొన్ని తిప్పికొడతామని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్‌తో పాటు ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, ఎస్‌సీ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు రాహుల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బంక సంపత్, అలువాల కార్తీక్, గుంటి స్వప్న, అంబేద్కర్ రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూములకు.. ఇక దేశవ్యాప్త గుర్తింపు

రైతులకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు

> సాగుదారుల లెక్క ఇక పక్కాగా తేలనున్నది. రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక కార్డుల(భూ ఆధార్)ను అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. ఈ ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ప్రతీ రైతుకు 14 అంకెల విశిష్ట సంఖ్యతో ఈ కార్డులు జారీ కానున్నాయి. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కేంద్రం అందించే సంక్షేమ పథకాల లబ్ధికి ఈ కార్డు ప్రామాణికంగా నిలవనుంది. భూమి ఉండి, పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన ప్రతీ రైతూ ఈ గుర్తింపు తీసుకోవడం తప్పనిసరి. వ్యవసాయ రంగంలో సాంకేతిక అనుసంధానం, ఆధునికీకరణ చర్యల్లో భాగంగా కేంద్రం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది.

- ఈ నెల 22 నుంచి అందించనున్న కేంద్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 8.77 లక్షల మందికి భూ ఆధార్ జారీకి కసరత్తు
- అందుబాటులోకి వచ్చిన యాప్.. సిబ్బందికి శిక్షణ పూర్తి
- పీఎం కిసాన్ సమ్మాన్‌కు ఈ కార్డు తప్పనిసరి
- గ్రామాల్లో రైతు వేదికల వద్ద వివరాల నమోదు

హనుమకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టాదారు పాస్‌పుస్తకాలు కలిగిన మొత్తం 8.77 లక్షల మందికి ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ (భూఆధార్) కార్డుల జారీకి వ్యవసాయాధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఈనెల 22 నుంచి ఈ కార్డుల జారీ ప్రారంభం కానున్నది. కార్డులు పొందేందుకు కాలపరిమితేం లేదు. కాకపోతే ఈ కార్డులుంటేనే ఇక నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ డబ్బులు రైతులు పొందగలుగుతారు. వాస్తవానికి ఫిబ్రవరి నెల లోనే ఈ కార్డుల జారీ ప్రక్రియ మొదలు కావలసి ఉండింది. తెలంగాణ రాష్ట్రంలో జాప్యం జరుగు తోంది. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే 70 శాతం పూర్త యింది. ప్రజల అన్ని అవసరాలకు ప్రధానంగా గు ర్తింపు కార్డుగా చెలామణిలో ఉన్న ఆధార్ తరహా లో ఇక నుంచి ప్రతీరైతుకు గుర్తింపు కార్డు తప్ప నిసరి కానుంది.

ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేయడం ద్వారా జాతీయ స్థాయిలో ఈ-ఫార్మర్ రిజిస్ట్రీని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టుగా మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో చేపట్టిన ఈ విధానం విజయవంతం కావడంతో దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో భూ యజమానులతోపాటు కౌలు రైతులకు సైతం వీటిని జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్-అగ్రిస్టాక్ ప్రాజెక్టు పేరిట అమలు చేయబోతున్న ఈ ప్రాజెక్టు కోసం స్టేట్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎస్‌పీఎంయూ)ను ఏర్పాటు చేశారు. వెబ్ ల్యాండ్ డాటా ఆధారంగా జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా రైతుల ఈ-ఫార్మర్ రిజిస్ట్రీని రూపొందిస్తారు.

ఇవీ ప్రయోజనాలు

భూ కమతాలకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించటం అంటే భూమికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చినట్టు. ఇది భూ యజమాని, స్థానం, విస్తీర్ణం మొదలైన వివరాలను సులభంగా గుర్తించేందుకు ఉపయోగపడుతుంది. భూమి ఉపయోగాన్ని నిర్ధారించవచ్చు. ఆక్రమణలు, అక్రమ కట్టడాలను నివారించటానికి సహాయపడుతుంది. విశిష్ట గుర్తింపు సంఖ్యల వల్ల భూములను బ్యాంకింగ్, బీమా వ్యవస్థలతో సులభంగా అనుసంధానం చేయవచ్చు. భూ యజమాని హక్కులను తేలికగా గుర్తించవచ్చు. దీని వల్ల భూవివాదాలను అరికట్టి పారదర్శకతను పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. భూ వివరాలను డిజిటలైజ్ రూపంలో నిల్వ చేయడం సులభమవుతుంది. కేంద్ర అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలకు ఈ యూనిక్ కోడ్ తప్పని సరికానున్నది. పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు, పంటను మార్కెట్‌లో విక్రయించుకునేందుకు ఈ కార్డు ఉపయోగపడుతుంది. దీనిని కిసాన్ క్రెడిట్ కార్డుగా కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ ఐడీ సాయంతో దేశంలో ఎక్కడి నుంచైనా రుణార్హత, రుణ బకాయిలు, పథకాల జమ వంటి వివరాలను తెలుసుకోవచ్చు.

పీఎం కిసాన్‌కు తప్పనిసరి

రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన

మిగతా 7వ పేజీలో...

> **ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డుల జారీకి ఏర్పాట్లు**
>
> రవీందర్ సింగ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి
>
> రైతులకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డుల జారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి కార్డుల జారీ మొదలవుతుంది. ఈ ప్రత్యేక కార్డుల జారీకి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. ఈ కార్డులు పొందేందుకు రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకంతో తమ దగ్గరలోని సహాయ వ్యవసాయ అధికారులు (ఏఈవో)లను సంప్రదించవచ్చు. లేదా మీ సేవా కేంద్రంలో కూడా వివరాలను నమోదు చేయించుకోవచ్చు. కార్డుల జారీకి సంబంధించి యాప్ కూడా సిద్ధంగా ఉంది. రైతుల వివరాలను డిజిటలైజ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. పట్టా పాస్ పుస్తకాలున్న రైతులందరూ ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు పొందాలి. రైతులకు అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

యువత సత్తా చాటాలి

- ప్రయత్నిస్తే గెలుపు మీ సొంతం
- భారత కబడ్డీ జట్టు మాజీ చీఫ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- పాటలతో ఉర్రూతలూగించిన గేయ రచయిత మిట్టపల్లి సురేందర్
- కన్నుల పండువగా కేయూ క్యాంపస్ కళాశాల వార్షికోత్సవం

7



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సెక్స్ రాకెట్ గుట్టు రట్టు

- నర్సంపేటలో వ్యభిచార గృహంపై పోలీసుల దాడి
- నిర్వాహకురాలితో పాటు ముగ్గురు విటుల అరెస్టు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిరుపేద యువతుల ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకొని వారిని సెక్స్ వర్కర్లుగా మారుస్తూ కొన్నేళ్లుగా వ్యభిచారం నిర్వహిస్తున్న సెక్స్ రాకెట్ గుట్టును పోలీసులు ఛేదించారు. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారం జరిగింది. నర్సంపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి. నర్సంపేట పట్టణంలోని మాధన్నపేట రోడ్‌లోని వ్యభిచార గృహంపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, నర్సంపేట ఎస్సై అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులను వ్యభిచార రొంపిలోకి దింపుతూ వ్యాపారం చేస్తున్న ఇంటి యజమానురాలు కిన్నెరపు ఉమ, ముగ్గురు విటులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి ఒక ద్విచక్రవాహనం, ఐదు సెల్‌ఫోన్‌లు, 29 హెచ్‌ఐవీ పరీక్ష కిట్లు, కండోమ్ ప్యాకెట్లు, రూ.2,750 నగదును స్వాధీనం చేసుకున్నారు. వ్యభిచార గృహం నుంచి ఇద్దరు మహిళలను కాపాడి వారిని వదిలివేశారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్, డబ్ల్యూఏఎస్సై రాజేశ్వరి, పోలీసు సిబ్బంది ఒ.కృష్ణ, బి.రాజు, కె.నరేష్, గణేష్‌లు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పరీక్ష కిట్లతో విటులకు ఎర

వ్యభిచార నిర్వాహకురాలు సెక్స్ రాకెట్‌ను గుట్టుచప్పుడు కాకుండా కొన్నేళ్లుగా నిర్వహిస్తోంది. గతంలో ఇదే మహిళ పట్టణంలోని ఓ అద్దె గృహంలో కొనసాగించడంతో అక్కడి వారు మందలించి, బెదిరించడంతో మకాం మార్చింది. అక్కడి నుంచి మాధన్నపేటరోడ్‌లో ఓ ఇల్లును నిర్మించుకొని వ్యభిచార గృహంగా మార్చింది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ తన ఇంట్లో విద్యార్థినులు, మహిళలను సెక్స్ రాకెట్‌లోకి దింపుతూ వ్యాపారం కొనసాగిస్తున్నది. విటుల కోరిక మేరకు హెచ్‌ఐవీ పరీక్ష కిట్లతో సెక్స్ వర్కర్లకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసు దాడిలో హైచ్‌ఐవీ కిట్లు లభ్యమయ్యాయి.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం

- జూన్ 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌వోఆర్ అమలు
- అవగాహన సదస్సులో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి-ఆర్‌వోఆర్ చట్టంతో భూసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొనాయిమాకుల రైతు వేదికలో భూ భారతి చట్టంపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో భూ భారతి చట్టం ర్యాలీని నిర్వహించారు. అనంతరం రేవూరి మాట్లాడుతూ.. అంబేద్కర్ జయంతి రోజు భూ భారతి చట్టం-పోర్టల్‌ను సీఎం ప్రారంభించి నాలుగు మండలాలను పైలట్‌గా తీసుకున్నారన్నారు. రైతుల నుంచి వచ్చే అప్పీళ్లు, ఎదురయ్యే సమస్యలను సమీక్షించి జూన్2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయనున్నట్లు చెప్పారు. ధరణి కంటే ముందు ఉన్న లాండ్ స్టేటస్ పోర్టల్‌లో ఉండబోతుందన్నారు. ప్రజా పోరాటాల ద్వారా పుట్టుకొచ్చిన రెవెన్యూ చట్టాలు.. ప్రజల, భూసమస్యల శాశ్వత పరిష్కారాలకు ఉపయోగపడాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. బాధిత రైతు సమస్యను తెలుపుతూ తహసీల్దార్‌కు దరఖాస్తు చేస్తే 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలని, లేకుంటే దరఖాస్తుదారుడికి ఆమోదం లభించినట్లేనని చెప్పారు. బాధితులు న్యాయం కోసం ఆర్డీవో, కలెక్టర్‌లకు కూడా అప్పీలు చేసి సత్వర న్యాయం పొందవచ్చన్నారు. పట్టా పాస్‌బుక్‌లో ఏవైనా తప్పులు ఉంటే మార్చుకునే అవకాశం ఈ చట్టంలో కల్పించినట్లు వివరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిబంధనలు తెలుపకుండా చట్టాలను అమలుచేసి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడారన్నారు. కాస్తు కాలం తీసేసి రైతుల మధ్య గొడవలు సృష్టించారని మండిపడ్డారు. దీంతో పలు రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలచి భరోసాను ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఏవో హరిప్రసాద్‌బాబు నాయకులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



డామిట్.. సిండికేట్ ఫటేల్!

- రూ.30కోట్ల బల్దియా పనులకు బడా కాంట్రాక్టర్ల ప్లాన్
- కాంప్రమైజ్ అవుదామని జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయం
- వ్యతిరేకించిన 90 శాతం మంది జూనియర్ కాంట్రాక్టర్లు
- టెండర్లు దాఖలు చేయడంతో ప్రభుత్వానికి ఆదాయం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బల్దియా బడా కాంట్రాక్టర్లు వేసిన ప్రణాళిక విఫలమైంది. జూనియర్ కాంట్రాక్టర్లు ఊహించని విధంగా తీసుకున్న నిర్ణయానికి సీనియర్ కాంట్రాక్టర్లు ఖంగుతిన్నారు. హనుమకొండ పరిధిలో బల్దియా జనరల్ ఫండ్ నిధులతో చేపట్టే పనులను పంచుకుందామనుకున్న వారి కలలు కల్లలయ్యాయి.

కాంప్రమైజ్ వద్దు..

బల్దియా పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టే హనుమకొండ కాంట్రాక్టర్ల సంఘం జనరల్ బాడీ సమావేశం ఈ నెల 13న హనుమకొండ 100 ఫీట్ల రోడ్డులోని ఓ గార్డెన్‌లో జరిగింది. గత ఆదివారం జరిగిన కాంట్రాక్టర్ల సర్వసభ్య సమావేశానికి 90మంది హాజరయ్యారు. ఇందులో సంఘం నాయకులు ప్రస్తుతం హనుమకొండలో చేపడుతున్న బల్దియా అభివృద్ధి పనులు, వాటి తాలూకు బిల్లులు, అధికారులు వేధింపులు, ఇంకా రికార్డులు, చేసిన పనులకు అధికారులకు ఇచ్చే పర్సంటేజీలపై ముందస్తుగా చర్చించుకున్నారు. అలాగే 2025-2026 సంవత్సరంలో చేపట్టే పనుల గురించి మాట్లాడుకున్నారు. కాంట్రాక్టర్లందరూ పోటీకి పోవొద్దని, కాంప్రమైజ్ టెండర్ల ద్వారా పనులు దక్కించుకుంటే లాభంగా ఉంటుందని భావించారు. అయితే ఈ నిర్ణయాన్ని చాలా మంది వ్యతిరేకించడంతో పథకం విఫలమైనట్టు విశ్వసనీయ సమాచారం.

విఫలం

బల్దియా పరిధిలోని 90 రకాల అభివృద్ధి పనులను ఏప్రిల్ మాసంలో 137 మంది కాంట్రాక్టర్లు పంచుకుందామని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఏకపక్ష టెండరు పనులలో వచ్చే ఆదాయంలో అధికారులకు, పాలకవర్గానికి పర్సంటేజీలు ఇవ్వడానికి రహస్య ఒప్పందం చేసుకున్నారు. అయితే ఒకే పనికి ఇద్దరు వ్యక్తులు పోటీ రాకుండా ముందస్తుగా ఒప్పందం చేసుకుని రంగంలోకి దిగాలనుకున్నారు. ఇదంతా లోపాయికారిగా సీనియర్లు, నాయకులు మాట్లాడుకుని జనరల్‌బాడీ సమావేశంలో ప్రవేశపెట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. కానీ ఇప్పటికే చాలాచోట్ల రూ.కోట్లు వెచ్చించి కాంట్రాక్టు పనులు పూర్తి చేసిన వారికి బిల్లులు రాక విసుగెత్తిపోయారు. ఈ కారణంగా 90 శాతం మంది కాంట్రాక్టర్లు కాంప్రమైజ్ పనుల (సిండికేట్) పద్ధతిని వ్యతిరేకించి అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయినట్టు తెలిసింది. ఇప్పటి వరకు పనులకు సంబంధించిన టెండరు బెడ్లు తెరుచుకోలేదు. దీంతో నాయకులు వేసిన పథకం విఫలం అయింది.

రూ.30కోట్లతో 90 రకాల పనులు

హనుమకొండ నగరంతో పాటు విలీన గ్రామాలలో రూ.30కోట్ల వ్యయంతో 90రకాల రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేసేందుకు బల్దియా నిర్ణయించింది. ఈ విధంగా సీటీఎస్ పనులను ఇంజనీరింగ్ అధికారులు, పాలకవర్గం పెద్దలు మూడుసార్లు వాయిదా వేస్తూ వచ్చారు. చివరి సారిగా ఏప్రిల్ 15 రోజు టెండర్లకు సంబంధించిన టెక్నికల్ బెడ్స్‌ను తెరవాలని నిర్వహించారు. కానీ జనరల్ బాడీకి వచ్చిన 90 శాతం మంది కాంట్రాక్టర్లు పోటీ ద్వారానే టెండర్లు తీయాలని డిమాండ్ చేశారు. దీంతో 90 రకాల అభివృద్ధి పనులకు ఒక్కో పనికి అంచనాలను బట్టి పది మంది చొప్పున ఇటీవల టెండర్లు వేసి పోటీలో నిలిచారు. ఈ విధంగా టెండరుదారులు పోటీలో పెద్ద ఎత్తున నిలిచారు. దీంతో ప్రభుత్వానికి సుమారు రూ.2కోట్ల ఆదాయం వచ్చినట్టు చెప్పుకొచ్చారు. అలాగే యువ కాంట్రాక్టర్లు తక్కువ కొటేషన్ వేయడంతో ప్రభుత్వ ఆదాయం పెరిగింది.

ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు అందజేత



ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు అందిస్తున్న ఎంపీడీవో వెంకటరమణ

వర్ధన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు స్థానికంగా మెడికల్ కిట్లు, తాగునీరు, పని ప్రాంతంలో నీడను కల్పించడానికి వేజ్‌సీకర్స్ ఏర్పాటు చేయడంలేదని మంగళవారం ఆంధ్రజ్యోతిలో మండే ఎండలో ఉపశమనం ఎలా..? అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై జిల్లా కలెక్టర్ సత్యశారద, డీఆర్‌డీవో కౌసల్యాదేవి సంబంధిత అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన స్థానిక ఎంపీడీవో వెంకటరమణ, ఏపీవో నాగేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రామారావులు గురువారం ఇల్లంద గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న చోటుకు వెళ్లి మెడికల్ కిట్లను అందజేయడంతో పాటు, తాగునీరు, పని ప్రాంతంలో వేజ్‌సీకర్స్‌తో నీడ ను ఏర్పాటు చేశారు. దీంతో ఉపాధి కూలీలు సంతోషం వ్యక్తం చేశారు.

పశు సంపద పెంచుటకు పశు వైద్యశాలలు పని చేస్తున్నాయి

డాక్టర్ బాలాజీ పశువైద్యాధికారి, తిమ్మంపేట

ఫటా ఫట్



ఆంధ్రజ్యోతి : పశు సంపద పెంచుటకు వైద్యశాల పరంగా ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

డాక్టర్ : పశు సంపద పెంచుటకు ప్రభుత్వ పరంగా వైద్యశాలకు వచ్చే అన్ని రకాల టీకాలు, గడ్డి గింజలు రైతులకు ఉచితంగా అందించడం జరుగుతుంది.ప్రత్యేకంగా జాతీయ పశుగణాభివృద్ధిలో భాగంగా కృత్రిమ గర్భాధారణ మెడిసిన్స్ అందించడం జరుగుతుంది. దీంతో మేలు పశుజాతి సంఖ్య పెరుగుతుంది.

ఆంధ్రజ్యోతి : ఆవులకు, గేదలకు ఇచ్చే ప్రధానమైన టీకాలు ఏమిటి?

డాక్టర్ : ఆవులకు, గేదలకు ప్రధానంగా గాలి కుంటు టీకాలు ఇవ్వడం జరుగుతుంది. గ్రామాలలో దండోర వేయించి టీకాలు అందించడం జరుగుతుంది. పశువులకు వైరస్ ప్రభావం వల్ల నోటిలో పుండ్లు కావడం జరుగుతుంది. మేత సరిగా మేయక పోవడంతో పాల ఉత్పత్తి దగ్గుతుంది.

ఆంధ్రజ్యోతి : గొర్రెలకు, మేకలకు వచ్చే వ్యాధులు ఏమిటి? వాటి నివారణకు అందించే టీకాలు ఏమిటి?

డాక్టర్ : గొర్రెలకు, మేకలకు ప్రధానంగా అమ్మతల్లి, సొల్లు రోగం, దొబ్బరోగం, పాకుడు రోగం, చిటికరోగం ప్రధానంగా రావడం జరుగును. వాటి నివారణకు ఉచితంగా టీకాలు వేయడం జరుగును. అదే విధంగా సీజనల్‌గా నట్టల మందులు సరఫరా చేయడం జరుగును.

ఆంధ్రజ్యోతి : రైతులకు అందించే గడ్డిగింజలలో ఏమైన సబ్సిడీ ఉన్నదా?

డాక్టర్ : ఎస్సీ, ఎస్టీ రైతులకు 85శాతం సబ్సిడీపై గడ్డి గింజలు అందించడం జరుగుతుంది. గడ్డి గింజల ద్వారా రైతులు పశు మేతను పెంచుకోవడం జరుగుతుంది.

- దుగ్గొండి (ఆంధ్రజ్యోతి)

భూ వివాదాలులేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేదే

భూ భారతి లక్ష్యం

• **ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేదే భూ భారతి చట్టం ముఖ్య ఉద్దేశమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో జరిగిన భూ భారతి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం-2025 రైతుల భూ సమస్యల పరిష్కరించుకోవడానికి ఓ చక్కని అవకాశమన్నారు. భూ భారతి చట్టాన్ని క్షేత్రస్థాయికి సమర్థంగా తీసుకెళ్లేందుకు ఈ చట్టంపై రైతులకు రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో తొలి విడతగా నాలుగు మండలాల్లో అమలు చేస్తున్నామని, ధరణి కంటే ముందు ఉన్న స్టేటస్ భూ భారతి పోర్టల్‌లో ఉండబోతున్నాయన తెలిపారు. భూ భారతి చట్టం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, ప్రతి రెవెన్యూ గ్రామాలకు త్వరలో ఒక అధికారిని నియమించడానికి ప్రభుత్వం రంగం సిద్ధంచేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్మార్గమైన ఆలోచనలతో ధరణి పోర్టల్ అమలుచేసి దేశానికి వెన్నుముక అయిన రైతుల వెన్ను విరిచిందని ఆయన ఆరోపించారు. జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ రైతులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమైందని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ పథకంపై రైతులు అడిగిన పలు సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ రాజ్‌కుమార్, నాయకులు మాధవరెడ్డి, రమేశ్, నరహరి, నాగరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాలు హత్య కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టును చూపిస్తున్న పోలీసులు

నల్లబెల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నల్లబెల్లి మండలంలోని మూడు చెక్కపల్లి గ్రామంలో ఈ నెల 12న జరిగిన బానోతు కొమ్మాలు హత్య కేసులో నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు దుగ్గొండి రూరల్ సీఐ సాయిరమణ గురువారం తెలిపారు. దుగ్గొండి రూరల్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు వ్యవసాయ భూమి కొనుగోలు చేసే క్రమంలో, ఇంటి నిర్మాణం చేసే క్రమంలో రెండు సార్లు డబ్బు అవసరం ఉండి మృతుడు కొమ్మాలు సాయం కోరారు. దీంతో మృతుడు కొమ్మాలు మధ్యవర్తిగా ఉండి రూ.1 లక్ష 50వేలను నిందితులకు ఇప్పించాడు. అదే అదునుగా భావించిన మృతుడు కొమ్మాలు నిందితుడు బానోతు జంపయ్య భార్య నిందితురాలు విజయను శారీరకంగా లొంగదీసుకున్నాడు. వీరి వివాహేతర సంబంధం నిందితుడు జంపయ్యకు తెలిసింది. దీంతో నిందితుడు జంపయ్య పలు మార్లు మృతుడు కొమ్మాలును హెచ్చరించాడు. అనంతరం పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా రూ.70వేలను జరిమానా విధించారు. అయినా మృతుడి తీరుమారక అదే సంబంధం కొనసాగించాడు. దీంతో ఎలాగైనా కొమ్మాలును చంపాలని నిందితుడు నిశ్చయించుకున్నాడు. అంతేకాక, నిందితులైన భార్య, భర్తలు కూడా మనం కలిసి ఉందాం కొమ్మాలును చంపేద్దామని నిర్ణయించుకొని రెండు కత్తులను సిద్ధం చేసుకున్నారు. అనంతరం పక్కా పథకంతో ఈ నెల 12 తేదీన మిట్ట మధ్యాహ్నం నిందితురాలు విజయ ఎప్పటిలాగే కొమ్మాలుకు ఫోన్‌చేసి మొక్కజొన్న చేనులో కలుసుకుందామని రమ్మంది. దీంతో కొమ్మాలు వెళ్లాడు. అంతకు ముందే చెట్టుచాటుకు దాగి ఉన్న నిందితుడు జంపయ్య ఒక్కసారిగా పదునైన కత్తితో వీపు వెనుక భాగంలో బలం గా పొడిచాడు. అంతటితో ఆగక మళ్లీ పొట్ట భాగంలో పలుసార్లు పొడిచాడు. అంతేకాక, విజయ కూడా మరో కత్తితో పొట్ట భాగంలో, ఇతర శారీర భాగంలో పొడిచింది. కొమ్మాలు అక్కడికక్కడే రక్తంలో గిలగిల కొట్టుకుంటూ మృతిచెందాడు.అన్ని కోణాల దర్యాప్తులో భాగంగా నిందితులు ఉపయోగించిన రెండు ఇనుప కత్తులను, ఒక సెల్‌ఫోన్‌ను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్ట్ చేసి, రిమాండు పంపినట్లు రూరల్ సీఐ సాయిరమణ వెల్లడించారు. ఎస్సై గోవర్ధన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూటర్ స్టాండ్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి



నర్సంపేట డిపో మేనేజర్‌కు వినపతి పత్రం అందజేస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిబంధనలుపాటించని నర్సంపేట బస్టాండ్ లోని శ్రీలక్ష్మిగణపతి స్కూటర్‌స్టాండ్ నిర్వాకునిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం దళిత ప్రజా సంఘాల నాయకులైన డీబీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె రవి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్, ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మౌసి శోభన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసూన్నలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్కూటర్ స్టాండ్‌కు పొందిన అనుమతిలో ఒకవైపు మాత్రమే దారి ఉందన్నారు. అయితే స్కూటర్ స్టాండ్ నిర్వాహకుడు తాను పొందిన ఒకవైపు దారి కాకుండా మరో మూడు దారులను ఏర్పాటుచే సుకొని ఇస్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. దీంతో పలుమార్లు ప్రమాదాలు జరిగాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దారులను మూసివేసే చర్యలనుతీసుకోవాలని డిపో మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో ధరణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఈదునూరి రమేష్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్‌కుమార్, ఎమ్మార్పీ ఎస్‌టీఎస్ రాష్ట్ర నాయకుడు ఆరెపల్లి బాబు,మార్గం స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కోట డేవిడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, నాగరాజు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్ల స్వాధీనం

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాకాల్ రోడ్‌లో మణికంఠ కిరాణంపై వరంగల్ టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.1లక్షా 59వేల 700 విలువైన అంబర్, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన దొడ్డ పుష్పలీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

గీసుగొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంచనగిరికి చెందిన కౌడగాని సురేష్ (23) అనే యువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ పనులకు పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. డబ్బులు నష్టపోయామనే మనస్థాపంతో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని ఇంటి ఇనుప కొక్కానికి ఉరి వేసుకున్నాడు. వ్యవసాయ పనుల అంతరం సాయంత్రం ఇంటికి తల్లిదండ్రులు తలుపుపెట్టి ఉండడంచూసి అతడిని పిలిచారు. సమాధానం రాకపోవడంతో తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికి మృతి చెంది ఉన్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. సురేష్‌కు సంవత్సరంన్నర కిందట వివాహం అయింది.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జరిమానా

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బైండోవర్‌ను ఉల్లంఘించిన మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన జరుపుల రమకు రూ.50వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి గురువారం తెలిపారు. గుడుంబా విక్రయిస్తూ పలుమార్లు ఎక్సైజ్ తనిఖీల్లో పట్టుబడిన రమను తహ సీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్‌ను ఉల్లంఘిస్తూ మళ్లీ గుడుంబాను విక్రయించడంతో గురువారం అరెస్టుచేసి తహసీల్దార్ రాజేష్ ఎదుట హాజరుపర్చగా బైండోవర్ ఉల్లంఘించినం దుకు రూ.50 వేల జరిమానా విధించారన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై శార్వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకాలపల్లిలో పేకాట స్థావరంపై సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ సందర్భం గా పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పాగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత

చెన్నారావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కొంత మంది వ్యక్తులు పాగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు సంబంధిత సెల్‌పోన్ వ్యక్తులకు గురువారం అందించారు. మండలంలోని జల్లి గ్రామానికి చెంది న బోడ సంతోష్, సందీప్, నర్సంపేటలకు చెందిన స్వామి. దీక్షకుంట్లకు చెందిన కుక్కల కేదారిలు ఇటీవల సెల్‌పోన్‌లను పోగొట్టుకున్నారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కానిస్టేబుళ్లు సురేష్, జగదీష్‌లు ఫోన్లను గుర్తించారు. బాధితులకు పోలీసుస్టేషన్‌లో సెల్‌ఫోన్‌లను ఎస్సై రాజేష్‌రెడ్డి అందిం చారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ కక్షసాధింపుతోనే ఈడీ కేసులు

వర్ధన్నపేట రూరల్ (పర్వతగిరి), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసుల్లో రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై ఈడీ తప్పుడు కేసులు నమోదు చేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ ప్రభుత్వం చట్టం అతిక్రమించి కాంగ్రెస్ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదంతో కాంగ్రెస్‌కు, రాహుల్ గాంధీకి వచ్చిన ప్రజాదరణ చూసి తట్టుకోలేకే ఈడీ చార్జిషీట్‌లో పేర్లు చేర్చిందన్నారు.

పరిధి మించకుండా వైద్యం అందించాలి

నెక్కొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యులు ప్రజలకు వారి పరిధిలో వైద్య సేవలు అందించాలని ఎస్సై మహేందర్ సూచించారు. గురువారం పోలీసు స్టేషన్‌లో ఎస్సైని గ్రామీణ వైద్యులు కలిశా రు. ప్రజలకు అత్యవసర చికిత్సలు అందించాల్సి వచ్చినప్పుడు సమీపం లో గుర్తింపు పొందిన వైద్యుల వద్దకు తీసుకుపోవాలని, లేనిపక్షంలో 108 సమాచారం అందించాలన్నారు. వారి పరిధి దాటి వైద్య సేవలు అందిస్తే చట్టవిరుద్ధమవుతుందన్నారు.గ్రామీణ వైద్యుల సంఘం మండ ల అధ్యక్షుడు కుమారస్వామి, రవి, ధనుంజయ్, శివుడు పాల్గొన్నారు.

కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిషేధిత, హానికరమైన రసాయనాలను ఉపయోగించి తయారు చేస్తున్న అల్లం వెల్లుల్లి పేస్టను వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధు సూదన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఆరెపల్లి లోని ఏ1 అల్లం వెల్లుల్లి పెస్ట్ షాపులో గురువారం సోదాలు చేసి సుమారు రూ. 9,160 విలువ చేసే పేస్టను పట్టుకొని అల్లంతో పాటు నిర్వాహకుడు మహ్మద్ సలీంపాషాను విచారణ నిమిత్తం మున్సిపల్ అధికారులకు అప్పగించామన్నారు.

రజతోత్సవ సభకు కదం తొక్కాలి



వర్ధన్నపేటలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వర్ధన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని, సబండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పని చేసిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కదం తొక్కాలని బీఆర్ఎస్ మహిళ విభాగం రాష్ట్ర నాయకురాలు, వర్ధన్నపేట మండల, పట్టణ ఇన్‌చార్జి ఎల్లావుల లలితయాదవ్ అన్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణ పరిధిలోని 1, 2, 3, 9, 10 డివిజన్ల ముఖ్య నాయకులతో పట్టణ అధ్యక్షుడు గోదుమల మధు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి అమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవం చాటేందుకు కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ ప్రారంభించారన్నారు. ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వర్ధన్నపేట మండలం నుంచి అధిక సంఖ్యలో హాజరై జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం రజతోత్ససభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అన్నమనేని అప్పారావు, మార్గం భిక్షపతి, గోపాల్ రావు, సిలువేరు కుమారస్వామి, తూళ్ల కుమారస్వామి, యాకయ్య, ఎలేందర్‌రెడ్డి, రాజమణి, అజీం, రఘు,సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

● నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి) : హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతంచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని రాజపల్లెలో గురువారం సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే నర్సంపేటపట్టణంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఈర్ల నర్సింహరాములు, రవి, కడారి కుమారస్వామి, మునిగాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ(ఆంధ్రజ్యోతి):మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న అన్నారు. నెక్కొండలో గురువారం బీఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభ వాల్ పోస్టర్‌లను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 27 జరిగే రజితోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు కొమ్ము రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య, పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, నాయకులు రవీందర్‌రెడ్డి, రాము, భద్రయ్య, సురేష్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ (పర్వతగిరి) (ఆంధజ్యోతి): కాంగ్రెస్ పాలనలో పల్లె ప్రకృతి వనాలు వికృతంగా మారాయని గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్, మండల ఇన్‌చార్జి చింతల యాదగిరి ఆరోపించారు. గురువారం మండలంలోని దౌలత్‌నగర్, కల్లెడ, అన్నారం షరీఫ్ గ్రామాల్లో పర్యటించి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులతో సన్నాహక సమా వేశాలు ఏర్పాటు చేశారు. అనంతరం పర్వతగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జర గబోయే బీఆర్ఎస్ ఆవిర్భావ భారీబహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్, సోమేశ్వర్‌రావు, శ్రీనివాస్, రాజుయాదవ్, రాజు, శ్రీనివాస్, శ్యామ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● దుగ్గొండి (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని చలపర్తి, బిక్కాజిపల్లి, నాచినపల్లి, తొగర్రాయి గ్రామాల్లో గురువారం గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి చేశారన్నారు. బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి, రాజు, తిరుపతి రెడ్డి, కృష్ణ, శ్యాంసుందర్, రాజిరెడ్డి, మహేందర్, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విలీన గ్రామాల కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పించాలి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి భూక్య సమ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలీన గ్రామాల్లోని వ్యవసాయ కార్మికులు సంవత్సరానికి 200రోజులు పట్టణ ప్రాంతాల పనులకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. విలీన గ్రామాల్లోని జాబ్‌కార్డులు కలిగిన వారితో పాటు, ఇతర కూలీలకు పనులు లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా విలీన గ్రామాల్లోని కూలీలకు పనులు కల్పించి ఆదుకోవాలని కోరారు. లేనిఎడల గ్రామాల్లో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్లస్వామి, మొగులూరు శారద, చంద్రకళ, భారతి, జనార్ధన్‌రెడ్డి, బుడిగె యాదమ్మ, శ్రీలత పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన జాతీయ సదస్సు

వర్ధన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట, మహదేవ్‌పూర్ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన అధునిక కవిత్వోద్యామాలు అనే జాతీయ సదస్సు వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోషయ్య అధ్యక్షతన గురువారం ముగిశాయి. ఈ సదస్సులో తెలంగాణ ఉన్నత విద్యాధికారులు జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్.రాజేందర్‌సింగ్, రీజనల్ జాయింట్ ప్రొఫెసర్ యాదగిరి, అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ బాలభాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్ధన్నపేట కళాశాలకు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు కావల్సిన నిధులు అందజేస్తామన్నారు. ఇలాంటి సదస్సులో మిగిలిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించాలని, వారికి ప్రోత్సహం తప్పనిసరిగా ఉంటుందన్నారు.

టీపీఎఫ్ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : హన్మకొండలోని ప్రెస్ క్లబ్‌లో ఈ నెల 20న జరగనున్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) 4వ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్, చింతకింది శ్రీనివాస్, ఆంగోతు భద్రయ్య, జేతురాం నాయక్, గిరగాని శ్రీనివాస్, ఈదుల వెంకటేశ్వర్లు, హన్మకొండ ఆనంద్ పాల్గొన్నారు.

పోషకాహారంపై గర్భిణులకు అవగాహన

చెన్నారావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. డీడబ్ల్యూవో రాజమణి మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, ఫ్రూట్స్ లోపంవల్ల వచ్చేవ్యాధులను, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బాలింతలు రక్తహీనత సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మధురిమ, ఎంపీ డీవో శ్రీవాణి, తహసీల్దార్ ఫణికుమార్,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

నెక్కొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు శారీరకంగా ఎదగడానికి పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు పిల్లలకు ఎక్కువగా పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ డీడబ్ల్యూవో రాజమణి అన్నారు. పోషణాపక్షం కార్యక్రమంలో భాగంగా నెక్కొండలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన రకకాల పిండి వంటలను ప్రదర్శించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే ఉన్నత విద్యలో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మధురిమ, సూపర్ వైజర్లు భాగ్యమ్మ, హేమలత, నజీమ, అంగన్‌వాడి టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులులేకుండా చూసుకోవాలని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ సూచించారు.గురువారం మండలంలోని కట్ర్యాలలో తాగునీటి పంపింగ్ నల్లాలను పరిశీలించారు. మిషన్ భగీరథ పైపుల ద్వారా సరఫరా జరుగుతున్న మంచినీటి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో మంచినీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేతిపంపులు, బోరుబావులు ఎలాంటి మరమ్మతులు ఉన్న వెంటనే చేయించి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో పైపు లీకేజీలను గుర్తించి వాటిని సైతం మరమ్మతుచేసి నీటి వృథాను అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి శ్రీనివాస్, వాటర్ మెన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మయుద్ధ ప్రజా ప్రదర్శనను జయప్రదం చేయండి

నర్సంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి: నర్సంపేటలోని అంబేద్కర్‌నగర్ కాలనీవాసులకు ఇంటినంబర్లు, కరెంట్, తాగునీరు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఎంఎస్పీ, డీబీడీపీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 21న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్మయుద్ధ ప్రజా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గుడిసెవాసులు నిర్వహిస్తున్న దీక్షలు గురువారం నాటికి 24వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్ కుమార్, లావణ్య, ఆరోగ్యం, సదన్న, రత్నం, సుధాకర్ పాల్గొన్నారు.

రాయపర్తిలో బడిబాట బ్యానర్ ఆవిష్కరణ

రాయపర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం హెచ్‌ఎం సతీష్ ఆధ్వర్యంలో బడిబాట బ్యానర్‌ను రాయపర్తి ఎంపీడీవో కిషన్ ఆవిష్కరించి మాట్లాడారు. 2025-26 సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య, ఉచిత భోజన వసతి, పుస్తకాలు ఉంటాయని తెలిపారు.

కోతుల స్వైర విహారాన్ని నిరోధించడానికి కొండముచ్చు



కోతుల బెడదను నివారించడానికి తీసుకువచ్చిన కొండముచ్చు

వర్ధన్నపేట, ఏప్రీల్ 17 (ఆంధ్రజ్యోతి) : కొతుల స్వైర విహారంతో విసిగిపోయి ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వహకులు వాటిని నిరోధించడానికి బద్ధ శత్రువు అయిన కొండెంగను తీసుకురావడంతో కోతుల బెడద తప్పింది. వర్ధన్నపేట పట్టణంలోని వెంకటేశ్వర నర్సింగ్ హోంకు వచ్చే రోగులు, వారి బంధువుల తినుబండారాలు, వారి లాగేజ్ బ్యాగ్‌లపై నిత్యం కోతుల దాడిచేస్తూ తీసుకుపోతుండేవి. ఈ బాధను నిరోధించడానికి ఆస్పత్రి నిర్వహకులు సోలర్ పెన్సింగ్ సైతం ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కోతులు గేట్లద్వారా లోపలికివస్తూ ఇబ్బంది ల పాలుచేస్తుండేవి. విటిని నిరోదించడానికి ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ వంగాల రాజనరేందర్‌రెడ్డి రూ.30వేలు వేచ్చించి ఆంధ్ర ప్రదేశ్ నుంచి కొండముచ్చును కోనుగోలుచేసి తీసుకువచ్చారు. దీంతో ఆసుపత్రి చుట్టు ప్రక్కాల కోతుల సంచారం లేకుండా పోయింది. ఈ కోండముచ్చు రాకతో ఈ ప్రాంతం కోతుల బెడదనుండి ఉపశమనం పోందింది.



దీర్ఘకాలిక వ్యూహంతో గట్టెక్కుతాం

సుంకాల కల్లోలంపై నిర్మల

ముంబై: ట్రంప్ ప్రతీకార సుంకాలతో తలెత్తిన అంతర్జాతీయ వాణిజ్య పరిణామాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ పరిణామాలపై భారత్ కుంగిపోవడం లేదన్నారు. విధానపరమైన సత్వర నిర్ణయాలు, దీర్ఘకాలిక ముందు చూపుతో ఈ అడ్డంకులను భారత్ అధిగమిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బలమైన ఆర్థిక పునాదులు ఈ విషయంలో మన దేశానికి కలిసి వస్తాయన్నారు. బీఎస్ఈ 150వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధంతో స్వీయ వాణిజ్య రక్షణ విధానాలు పెరిగిపోతాయన్నారు. దీంతో ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోవడమే గాక అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలకూ ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. దీంతో పెట్టుబడుల విషయంలోనూ అనిశ్చితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ట్రంప్ సుంకాలతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుదేలైనా, మన మార్కెట్ మాత్రం వేగంగా కుదుట పడిందన్నారు. ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్న మన ఆర్థిక వ్యవస్థ ఈ దశాబ్దం చివరికల్లా ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనున్నదన్నారు.

జర్మనీ, జపాన్‌లనీ దాటేస్తాం

వచ్చే మూడేళ్లలోనే భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనుందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణియం అన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 4.3 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.367 లక్షల కోట్లు) ఉన్న భారత జీడీపీ వచ్చే ఏడాది చివరికల్లా జర్మనీ జీడీపీని, ఆ పై సంవత్సరం జపాన్ జీడీపీని అధిగమించనుందన్నారు.

ఐటీసీ గూటికి 24 మంత్ర ఆర్గానిక్

ఒప్పందం విలువ రూ.472 కోట్లు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన ఆర్గానిక్ ఆహారోత్పత్తుల బ్రాండ్ '24 మంత్ర ఆర్గానిక్' యాజమాన్య సంస్థ శ్రేష్ఠ నేచురల్ బయోప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 శాతం వాటాను రూ.472.50 కోట్లకు కొనుగోలు చేసినట్లు దేశీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ గ్రూప్ గురువారం ప్రకటించింది. ఈ డీల్‌లో భాగంగా తొలుత రూ.400 కోట్లు, కంపెనీ పనితీరు మైలురాళ్లను చేరుకోవడం ఆధారంగా వచ్చే రెండేళ్లలో రూ.72.5 కోట్లు చెల్లించనున్నట్లు తెలిపింది. దేశంలోని ప్రముఖ ఆర్గానిక్ ప్యాకేజ్డ్ ఆహారోత్పత్తుల బ్రాండ్లలో 24 మంత్ర ఆర్గానిక్ ఒకటి. పప్పులు, మసాలాలు, వంటనూనెలు సహా 100కు పైగా ఉత్పత్తులను విక్రయిస్తోందీ సంస్థ. అమెరికా సహా ఇతర దేశాలకూ వ్యాపారాన్ని విస్తరించింది.

వాటాదారుల ప్రయోజనాలే ముఖ్యం

ఎన్ఎస్ఈ ఐపీఓపై సెబీ చీఫ్ పాండే



ముంబై: ఎన్ఎస్ఈ ఐపీఓకు అనుమతిలో తమకు వాణిజ్య ప్రయోజనాల కంటే, వాటాదారుల ప్రయోజనాలే ముఖ్యమని సెబీ స్పష్టం చేసింది. ఈ విషయంలో వాటాదారుల ప్రయోజనాలు కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే చెప్పారు. కార్పొరేట్ గవర్నెన్స్‌పై సీఐఐ నిర్వహించిన ఒక సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో ఈ విషయం స్పష్టం చేశారు. స్టాక్ ఎక్స్ఛేంజిల మధ్య తలెత్తే వివాదాల పరిష్కార బాధ్యత కూడా తమదేనన్నారు. ఎన్ఎస్ఈ ఐపీఓకు ఎప్పటిలోగా అనుమతి ఇస్తారన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానం చెప్పలేదు. అయితే త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని సెబీ చీఫ్ చెప్పారు. మేనేజ్‌మెంట్ ఉద్యోగులకు నష్టపరిహారం, క్లియరింగ్ కార్పొరేషన్ ఈక్విటీలో మెజారిటీవాటా ఉండడం ఎన్ఎస్ఈ ఐపీఓకు ప్రతిబంధకంగా మారాయి. ఇలాంటి సమస్యలన్నీ పరిష్కరించుకుని రావాలని సెబీ ఇప్పటికే ఎన్ఎస్ఈ మేనేజ్‌మెంట్‌ను కోరింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	125
వరంగల్	130	గుంటూరు	125
కరీంనగర్	130	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	97
కర్నూలు	130	నెల్లూరు	102
విశాఖపట్నం	114	అనంతపురం	102
గోదావరి	125		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	410
చిత్తూరు	460	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ. 60	



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,310 ▲	89,200 ▲	1,10,000 ▲
విజయవాడ	98,500 ▲	91,000 ▼	98,500 ▲
విశాఖపట్నం	97,630 ▲	89,200 ▲	1,10,100 ▲
రాజమండ్రి	97,310 ▲	88,200 ▲	99,700 ▲
ప్రొద్దుటూరు	94,600 ▲	87,030 ▲	98,300 ▼
ముంబై	94,910 ▲	86,940 ▲	95,150 ▼



మెప్పించని ఇన్ఫీ

- క్యూ4 లాభంలో 12% క్షీణత .. • రూ.7,033 కోట్లకు పరిమితం
- 2025-26లో 0-3% ఆదాయ వృద్ధి అంచనా • ఒక్కో షేరుకు రూ.22 డివిడెండ్

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ గురువారం ప్రకటించిన ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోయాయి. మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికంలో ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం రూ.7,033 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.7,969 కోట్ల లాభంతో పోలిస్తే 11.7 శాతం తగ్గింది. క్యూ4లో కంపెనీ ఆదాయం మాత్రం 7.9 శాతం పెరిగి రూ.40,925 కోట్లకు చేరింది. గత ఏడాది మూడో త్రైమాసికంతో పోలిస్తే లాభం 3.3 శాతం పెరగగా.. ఆదాయం 2 శాతం తగ్గింది. కాగా, సమీక్షా కాలానికి సంస్థ నిర్వహణ లాభాల మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 0.9 శాతం పెరగగా.. త్రైమాసిక ప్రాతిపదికన 0.3 శాతం తగ్గింది.

2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి లాభం 1.8% వృద్ధితో రూ.26,713 కోట్లుగా, ఆదాయం 6.06% పెరుగుదలతో రూ.1,62,990 కోట్లుగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయం (స్థిర కరెన్సీ ఆధారిత) 0-3 శాతం శ్రేణిలో వృద్ధి చెందవచ్చని ఇన్ఫోసిస్ అంచనా వేసింది. నిర్వహణ మార్జిన్ 20-22 శాతం నమోదుకావచ్చని కంపెనీ భావిస్తోంది. కాగా, గడిచిన ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఆదాయ వృద్ధిని 4.5-5 శాతంగా అంచనా వేసింది.

- క్యూ4లో కంపెనీకి ఆర్థిక సేవల రంగం నుంచి ఆదాయం 12.6 శాతం పెరగగా.. తయారీ రంగం నుంచి రెవెన్యూ 14 శాతం వృద్ధి చెందింది. ప్రాంతాల వారీగా చూస్తే, భారత మార్కెట్ నుంచి రాబడి 43.7 శాతం పుంజుకోగా.. యూరప్ రెవెన్యూ 15 శాతం పెరిగింది. కంపెనీకి కీలక మార్కెట్ అయిన ఉత్తర అమెరికా నుంచి ఆదాయం 0.4 శాతం తగ్గింది.
- గడిచిన క్వార్టర్‌లో 260 కోట్ల డాలర్ల విలువైన బడా డీల్స్‌ను కుదుర్చుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. దాంతో 2024-25 మొత్తానికి బడా ఆర్డర్ల విలువ 1,160 కోట్ల డాలర్లకు చేరుకుందని, అందులో 56 శాతం కొత్తవేనని తెలిపింది.
- గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నగదు ప్రవాహం 410 కోట్ల డాలర్లకు పెరిగింది. కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికమని ఇన్ఫీ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా తెలిపారు.
- బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు గురువారం 0.51 శాతం పెరిగి రూ.1,420.20 వద్ద ముగిసింది.

2 కంపెనీల కొనుగోలు: తాజాగా రెండు కంపెనీలను చేజిక్కించుకున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఆస్ట్రేలియాకు చెందిన సైబర్ సెక్యూరిటీ సేవల సంస్థ 'ది మిస్సింగ్ లింక్'ను 9.8 కోట్ల ఆస్ట్రేలియన్ డాలర్లకు (సుమారు రూ.532 కోట్లు) కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. కాగా, అమెరికాలోని హ్యూస్టన్, టెక్సాస్ కేంద్రాలుగా కార్యకలాపాలు సాగిస్తున్న టెక్నాలజీ అండ్ బిజినెస్ కన్సల్టింగ్ కంపెనీ ఎంఆర్ఈ కన్సల్టింగ్‌ను సైతం 3.6 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.307.4 కోట్లు) కొనుగోలు చేసేందుకు డీల్ కుదుర్చుకున్నట్లు ఇన్ఫీ వెల్లడించింది. ఈ జూన్ కల్లా పూర్తికానున్న ఈ రెండు డీల్స్.. పూర్తిగా నగదు రూపంలో జరగనున్నాయి.

పరేఖ్‌కు రూ.50 కోట్ల షేర్ల కేటాయింపు: గడిచిన ఆర్థిక సంవత్సరంలో తమ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్‌కు ఎంప్లాయిస్ స్టాక్ ఆప్షన్ ప్లాన్స్ (ఈఎస్ఓపీ) కింద రూ.50 కోట్ల షేర్లను కేటాయించడం జరిగిందని ఇన్ఫోసిస్ వెల్లడించింది.

మూర్తి మనవడికి రూ.3.3 కోట్ల బొనాంజా

గత ఆర్థిక సంవత్సరానికిగాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.22 తుది డివిడెండ్ చెల్లించాలని ఇన్ఫోసిస్ బోర్డు ప్రతిపాదించింది. తుది డివిడెండ్‌తో కలిపి గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ చెల్లించే డివిడెండ్ 2023-24 చెల్లింపుల కంటే 13.2 శాతం అధికం. తుది డివిడెండ్ చెల్లింపుల ద్వారా కంపెనీ సహ-వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి 17 నెలల మనవడు ఏకాగ్రహ్ రోహన్ మూర్తికి రూ.3.3 కోట్లు లభించనున్నాయి. ఇన్ఫోసిస్‌లో 0.04 శాతం వాటాకు సమానమైన 15 లక్షల షేర్లు ఏకాగ్రహ్ పేరిట ఉన్నాయి. నారాయణ మూర్తి తన మనవడికి 2024 మార్చిలో ఈ షేర్లను బహుమతిగా ఇచ్చారు. ఆ సమయంలో వాటి విలువ రూ.240 కోట్లు. కాగా, ఇన్ఫోసిస్‌లో 1.04 శాతం వాటాకు సమానమైన 3.89 కోట్ల షేర్లను కలిగిన మూర్తి కూతురు, బ్రిటన్ మాజీ ప్రధాని రిషీ సునాక్ భార్య అక్షతా మూర్తికి డివిడెండ్ రూపంలో రూ.85.71 కోట్లు లభించనున్నాయి.

ఈ సారి 20,000 మంది ఫ్రెషర్ల హైరింగ్

క్యూ4లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య మరో 199 మేర పెరిగి, ఈ మార్చి 31 నాటికి 3,23,578కి చేరింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఉద్యోగుల సంఖ్య 6,000 పెరిగింది. కాగా, గత త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల రేటు 14.1 శాతానికి పెరిగింది. క్యూ3లో ఇది 13.7 శాతంగా నమోదైంది. 2024-25లో ప్రాంగణ నియామకాల ద్వారా 15,000 మంది ఫ్రెషర్లను చేర్చుకున్నట్లు ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా తెలిపారు. గతంలోనే ప్రకటించిన విధంగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 20,000 మంది ఫ్రెషర్ల నియామకాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.

4 రోజుల ర్యాలీ-4700 పాయింట్ల లాభం



ముంబై: ట్రంప్ సుంకాల పోటుకు కుదేలైన ఈక్విటీ మార్కెట్ తదనంతరం ఏర్పడిన ఆశావహ సంకేతాలతో అంతకుమించిన ర్యాలీలో దూసుకుపోయింది. సుంకాలకు ట్రంప్ ప్రకటించిన 90 రోజుల విరామం, భారత-అమెరికా వాణిజ్య చర్చలు ఫలవంతం కావచ్చునన్న ఆశలు మార్కెట్లో జవసత్వాలు నింపాయి. దీనికి తోడు విదేశీ ఇన్వెస్టర్లు కూడా భారత ఈక్విటీలపై మరోసారి దృష్టి సారించారు. ఫలితంగా వరుసగా నాలుగో రోజు కూడా కొనసాగిన ర్యాలీలో సెన్సెక్స్ 1508.91 పాయింట్లు దూసుకుపోయి 78,553.20 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 414.45 పాయింట్ల మేరకు లాభపడి 23,851.65 వద్ద ముగిసింది. నాలుగు రోజుల ర్యాలీలో సెన్సెక్స్ 4706.05 పాయింట్లు, నిఫ్టీ 1452.50 పాయింట్లు లాభపడ్డాయి.

- బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.56 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.52 శాతం లాభపడ్డాయి.
- విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గురువారం రూ.4667.94 కోట్ల విలువ గల షేర్లు కొనుగోలు చేశారు.
- ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.70 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.98,170 వద్ద ముగిసింది.
- అమెరికన్ డాలర్ మారకంలో 26 పైసలు పెరిగి 85.38 వద్ద ముగిసింది.

శుక్రవారం సెలవు గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం మార్కెట్లకు సెలవు. తిరిగి సోమవారం మార్కెట్ ఉంటుంది.

పేటెంట్లలో టాటా మోటార్స్ రికార్డు

ముంబై: ఇటీవల ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో 250 పేటెంట్లు, 148 డిజైన్ అప్లికేషన్లు, 81 కాపీరైట్ అప్లికేషన్లు దాఖలు చేసినట్టు టాటా మోటార్స్ ప్రకటించింది. ఒక ఆర్థిక సంవత్సరంలో పేటెంట్లు, అప్లికేషన్ల దాఖలులో ఇది కొత్త రికార్డు అని పేర్కొంది. అలాగే ఈ ఏడాదిలో తమకు 68 పేటెంట్లు మంజూరు కావడంతో తాము పొందిన మొత్తం పేటెంట్ల సంఖ్య 918కి చేరిందని తెలిపింది.

స్కోడా కొడియాక్ సరికొత్తగా..



ముంబై: చెక్ రిపబ్లిక్ వాహన బ్రాండ్ స్కోడా రెండో తరం 'కొడియాక్'ను భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ లగ్జరీ 4 వీల్ డ్రైవ్ ఎస్‌యూవీ మోడల్ ప్రారంభ ధర రూ.46.89 లక్షలు. 7 సీట్ల సామర్థ్యంతో కూడిన ఈ కారు ఎల్ అండ్ కే, స్పోర్ట్‌లైన్ వేరియంట్లలో, ఆరు రంగుల్లో లభించనుంది.

'కాంటినెంటల్' కింగ్.. నీరజ్



న్యూఢిల్లీ: డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా తాజా సీజన్‌ను విజయంతో ఆరంభించాడు. దక్షిణాఫ్రికాలో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ చాలెంజర్ జావెలిన్ త్రోలో నీరజ్ 84.52 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచాడు. 82.44 మీటర్ల దూరంతో డౌ స్మిత్ (దక్షిణాఫ్రికా) రెండోస్థానం దక్కించుకొన్నాడు. వచ్చే నెల 16న దోహాలో జరిగే డైమండ్ లీగ్ కోసం చోప్రా సన్నాహకాల్లో ఉన్నాడు. ఈసారి 90 మీటర్ల మార్క్ చేరుకోవడంపైనే అతడు ఎక్కువగా దృష్టిపెట్టినట్టు సమాచారం.

టీమిండియా అసిస్టెంట్ కోచ్ నాయర్‌పై వేటు!



- దిలీప్, సోహమ్ పొడిగింపు లేదు
- కోచింగ్ సిబ్బందిని కుదించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు సహాయక సిబ్బంది విషయంలో బీసీసీఐ సంచలన నిర్ణయం తీసుకొంది. ఇంగ్లండ్ పర్యటనకు ముందే కోచింగ్ స్టాఫ్‌ను కుదించింది. ఈ క్రమంలో గతేడాది జులైలో నియమించిన అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌పై వేటు వేసింది. వాస్తవంగా స్వదేశంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా టూర్‌లో టెస్ట్ సిరీస్‌ల్లో జట్టు వైఫల్యంపై బోర్డు సమీక్ష చేసింది. ముఖ్యంగా రోహిత్, కోహ్లీ లాంటి స్టార్ బ్యాటర్లు వరుసగా విఫలమవుతున్నా కోచ్‌లు ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీలు కూడా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో నాయర్‌పై వేటు వేస్తారనే ప్రచారం భారీగానే జరిగింది. జట్టు బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కొటక్, బౌలింగ్ కోచ్‌గా మోర్నీ మోర్కెల్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంగతి తెలిసిందే.

దిలీప్ కూడా అవుట్!: ఫీల్డింగ్ కోచ్ దిలీప్, స్ట్రెంగ్త్ అండ్ కండీషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్ కాంట్రాక్ట్‌లను పునరుద్ధరించకూడదనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. జూలైతో వీరిద్దరి మూడేళ్ల కాంట్రాక్ట్ ముగియనుంది. దిలీప్ స్థానంలో అసిస్టెంట్ కోచ్‌గా ఉన్న టెన్ డెస్కటే ఫీల్డింగ్ కోచ్ బాధ్యతలు నిర్వహిస్తాడని సమాచారం. ఇక, స్ట్రెంగ్త్ అండ్ కండీషనింగ్ కోచ్‌గా సౌతాఫ్రికాకు చెందిన అడ్రియన్ లీ రౌక్స్ మరోసారి భారత జట్టుకు సేవలందించనున్నట్టు సమాచారం.

ధోనీ.. నన్ను 'షరపోవా' అనేవాడు



ముంబై: ధోనీ తనను షరపోవా అనేవాడని ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ మోహిత్ శర్మ గుర్తు చేసుకొన్నాడు. గతంలో మోహిత్ చెన్నైకి ఆడాడు. బంతి రిలీజ్ చేసే సమయంలో టెన్నిస్ ప్లేయర్ తరహాలో గట్టిగా హూంకరించడం అతడికి అలవాటు. 'నేను బౌలింగ్ చేస్తున్నప్పుడు గట్టిగా అరిచేవాడిని. దీంతో ధోనీ నన్ను షరపోవా అంటూ ఆట పట్టించేవాడు. అలా చేస్తే నేనేదో గొప్ప వేగంతో బంతులేస్తున్నానని బ్యాటర్లు భ్రమపడే అవకాశం ఉంది. ఇది ఒకరకంగా నాకు లాభమే' అని మోహిత్ చెప్పాడు. రెండో ఇన్నింగ్స్‌లో బంతి తడిస్తే మార్చడం.. బౌలర్లకు ప్రయోజనమేనని మోహిత్ అన్నాడు.



'దుర్వాసన వస్తోంది.. స్ప్రే చేసుకోమనండి'

బ్రిటన్ టెన్నిస్ క్రీడాకారిణి తీరుపై విమర్శలు

పారిస్: ఫ్రాన్స్ క్రీడాకారిణి లిస్ బాసన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అభాసుపాలైంది బ్రిటన్ టెన్నిస్ ప్లేయర్ హ్యారిట్ డార్ట్. విషయమేమిటంటే..రోయన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో బాసన్‌తో డార్ట్ తలపడింది. అయితే బాసన్ నుంచి దుర్వాసన వస్తోందని, డియోడరెంట్ స్ప్రే చేసుకోవాలని ఆమెకు చెప్పాలంటూ అంపైర్‌కు డార్ట్ సూచించింది. ఇది కోర్టు పక్కన ఉన్న మైక్రోఫోన్ల ద్వారా బయటకు వినిపించింది. దాంతో డార్ట్ వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడ్డారు. వెల్లువలా విమర్శలు వచ్చి పడడంతో తప్పును గ్రహించిన హ్యారిట్.. బాసన్‌ను క్షమాపణలు కోరింది.

ఓటమి నెం.5

మళ్లీ నిరాశపర్చిన సన్‌రైజర్స్

ముంబై విజయం | విల్ జాక్స్ ఆల్‌రౌండ్ షో



ముంబై: తాజా సీజన్‌లో పడుతూ.. లేస్తూ సాగుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఖాతాలో ఐదో ఓటమి చేరింది. తమ చివరి మ్యాచ్‌లో పంజాబ్‌పై 246 పరుగులను ఛేదించి అహో.. అనిపించిన రైజర్స్ వాంఖడేలో మాత్రం చెమటోడ్చింది. అటు బ్యాట్‌తోనూ ప్రభావం చూపలేక ఇటు బంతితోనూ రాణించలేక తమ ప్లేఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఇక సొంతగడ్డపై చెలరేగిన ముంబై ఇండియన్స్ 4 వికెట్ల తేడాతో అలవోకగా నెగ్గింది. ఇది వారికి వరుసగా రెండో విజయం. సన్‌రైజర్స్ మాత్రం ఇతర వేదికలపై ఆడిన మూడింట్లోనూ ఓడింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 162 పరుగులు చేసింది. అభిషేక్ (28 బంతుల్లో 7 ఫోర్లతో 40), క్లాసెన్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) రాణించగా, చివర్లో అనికేత్ (8 బంతుల్లో 2 సిక్సర్లతో 18 నాటౌట్) వేగం కనబర్చాడు. విల్ జాక్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 18.1 ఓవర్లలో 6 వికెట్లకు 166 పరుగులు చేసి నెగ్గింది. జాక్స్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 36), రికెల్టన్ (23 బంతుల్లో 5 ఫోర్లతో 31), సూర్యకుమార్ (15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 26), రోహిత్ (16 బంతుల్లో 3 సిక్సర్లతో 26) వేగంగా ఆడారు. కమిన్స్‌కు మూడు, ఎషాన్ మలింగకు రెండు వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా జాక్స్ నిలిచాడు.

సమష్టి రాణింపుతో..: ముంబై ఇన్నింగ్స్ ఛేదనలో బరిలోకి దిగిన ప్రతీ బ్యాటర్ తమ వంతు ప్రయత్నంతో ఆకట్టుకున్నాడు. ఆరంభంలో ఓపెనర్ రోహిత్ మూడు సిక్సర్లతో జోష్‌లో కనిపించినా.. నాలుగో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. ఆ తర్వాత ఆరో ఓవర్‌లో రికెల్టన్ హ్యాట్రిక్ సిక్సర్లు బాదగా పవర్‌ప్లేలో ముంబై 55/1 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. అయితే హర్షల్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు బాది రికెల్టన్ అవుటవడంతో రెండో వికెట్‌కు జాక్స్‌తో కలిసి 37 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం జాక్స్-సూర్యకుమార్ జోడీ రైజర్స్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. చెత్త బంతులను బౌండరీలుగా మలుస్తూ ఒత్తిడి తగ్గించారు. అలాగే 11వ ఓవర్‌లో చెరో సిక్సర్‌తో జట్టు స్కోరు వంద దాటింది. అయితే మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేరాక కమిన్స్ వరుస ఓవర్లలో ఈ ఇద్దరినీ పెవిలియన్‌కు చేర్చాడు. కానీ హార్దిక్ (9 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 21)-తిలక్ (17 బంతుల్లో 2 ఫోర్లతో 21 నాటౌట్)ల ఎదురుదాడితో రైజర్స్ చేసేదేమీ లేకపోయింది. 17వ ఓవర్‌లో హార్దిక్ 6,4తో సమీకరణం 18 బంతుల్లో 2 రన్స్‌కు మారింది. అయితే మలింగ తర్వాతి ఓవర్‌లో ఒకే రన్ ఇచ్చి హార్దిక్, నమన్ (0)ల వికెట్లను తీశాడు. చివరకు 19వ ఓవర్ తొలి బంతిని ఫోర్‌గా మలిచిన తిలక్ ముంబైని సంబరాల్లో ముంచాడు.

కట్టడి చేశారు: టాస్ ఓడిన సన్‌రైజర్స్ మొదట బ్యాటింగ్‌కు దిగడంతో భారీ స్కోరు ఖాయమేనా? అనిపించింది. కానీ పిచ్ నుంచి సహకారం లేకపోవడంతో వారి ఇన్నింగ్స్ ఆద్యంతం నత్తనడకన సాగింది. ముంబై బౌలర్లు పకడ్బందీగా బౌలింగ్ చేయడంతో భారీ షాట్లకు వీల్లేకుండా పోయింది. అయితే చివరి మూడు ఓవర్లలో 47 పరుగులు చేయడంతో జట్టు పోరాడే స్కోరందుకుంది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్లు అభిషేక్, హెడ్ అవుట్ కావాల్సి ఉన్నా ఫీల్డర్లు క్యాచ్ పట్టలేకపోవడంతో బతికిపోయారు. ఐదో ఓవర్‌లో అభిషేక్ హ్యాట్రిక్ ఫోర్ల కారణంగా పవర్‌ప్లేలో జట్టు 43 పరుగులతో నిలిచింది. అయితే ఉన్న కాసేపు కాస్త వేగం చూపిన అభిషేక్ 8వ ఓవర్‌లో హార్దిక్‌కు చిక్కడంతో తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే ఇషాన్ కిషన్ (2) స్టంపవుట్ కావడంతో పాటు బంతికో పరుగు చొప్పున ఆడిన హెడ్ (28) వెనుదిరగడంతో రైజర్స్ ఇన్నింగ్స్ నెమ్మదించింది. మధ్య ఓవర్లలో ముంబైదే పూర్తి హవా సాగింది. క్లాసెన్ కూడా ఆదిలో ఇబ్బందిపడ్డాడు. అయితే నాలుగో వికెట్‌కు నితీశ్ (19)తో 31 పరుగులు జోడించాక క్లాసెన్ 18వ ఓవర్‌లో బ్యాట్ ఝుళిపించాడు. చాహర్ వేసిన ఈ ఓవర్‌లో వరుసగా 6,4,4,6తో 21 పరుగులు రాబట్టాడు. అయితే 19వ ఓవర్‌లో తొలి బంతికే క్లాసెన్‌ను బౌల్డ్ చేసిన బుమ్రా ఈ ఓవర్‌లో నాలుగు పరుగులే ఇచ్చాడు. కానీ ఆఖరి ఓవర్‌లో అనికేత్ 6,6, కమిన్స్ 6తో మరో 22 పరుగులు రాబట్టిన రైజర్స్ తమ స్కోరును 160 దాటించగలిగింది.

2 ఐపీఎల్‌లో తక్కువ బంతుల్లోనే (575) వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా హెడ్. రస్సెల్ (545) ముందున్నాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	6	5	1	0	10	0.744
గుజరాత్	6	4	2	0	8	1.081
బెంగళూరు	6	4	2	0	8	0.672
పంజాబ్	6	4	2	0	8	0.172
లఖ్‌నవూ	7	4	3	0	8	0.086
కోల్‌కతా	7	3	4	0	6	0.547
ముంబై	7	3	4	0	6	0.239
రాజస్థాన్	7	2	5	0	4	-0.714
హైదరాబాద్	7	2	5	0	4	-1.217
చెన్నై	7	2	5	0	4	-1.276

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (సి/సబ్) బవ (బి) హార్దిక్ 40, హెడ్ (సి) శాంట్నర్ (బి) జాక్స్ 28, ఇషాన్ (స్టంప్) రికెల్టన్ (బి) జాక్స్ 2, నితీశ్ (సి) తిలక్ (బి) బౌల్ట్ 19, క్లాసెన్ (బి) బుమ్రా 37, అనికేత్ (నాటౌట్) 18, కమిన్స్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 162/5; వికెట్ల పతనం:** 1-59, 2-68, 3-82, 4-113, 5-136; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-47-0, బౌల్ట్ 4-0-29-1, బుమ్రా 4-0-21-1, విల్ జాక్స్ 3-0-14-2, హార్దిక్ 4-0-42-1, శాంట్నర్ 1-0-8-0.

ముంబై: రికెల్టన్ (సి) హెడ్ (బి) హర్షల్ 31, రోహిత్ (సి) హెడ్ (బి) కమిన్స్ 26, విల్ జాక్స్ (సి) జీషన్ (బి) కమిన్స్ 36, సూర్యకుమార్ (సి) జీషన్ (బి) కమిన్స్ 26, తిలక్ (నాటౌట్) 21, హార్దిక్ (సి) ఇషాన్ (బి) మలింగ 21, నమన్ (ఎల్బీ) మలింగ 0, శాంట్నర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 18.1 ఓవర్లలో 166/6; వికెట్ల పతనం:** 1-32, 2-69, 3-121, 4-128, 5-162, 6-162; **బౌలింగ్:** షమి 3-0-28-0, కమిన్స్ 4-0-26-3, మలింగ 4-0-36-2, జీషన్ 3.1-0-35-0, హర్షల్ 3-0-31-1, రాహుల్ చాహర్ 1-0-9-0.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్

బెంగళూరు x పంజాబ్	వేదిక బెంగళూరు	రా.7.30 నుంచి

ఢిల్లీ కోచ్ మునాఫ్‌పై జరిమానా




న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు. రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో తను ఫోర్త్ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు. తమ ఆటగాళ్లకు సందేశం ఇచ్చేందుకు రిజర్వ్ ఆటగాడిని అంపైర్ మైదానంలోనికి అనుమతించలేదు. దీంతో మునాఫ్ వాదనకు దిగడం వీడియోలో కనిపించింది. ఈ ప్రవర్తనకు ఫైన్‌తో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా మునాఫ్ ఖాతాలో చేర్చారు.

రెండో స్థానంలో హంపి

పుణె: ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నమెంట్ నాలుగో రౌండ్ ఆఖరికి తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి (3 పాయింట్లు) రెండో స్థానంలో కొనసాగుతోంది. గురువారం జరిగిన నాలుగో గేమ్‌లో రష్యన్ గ్రాండ్‌మాస్టర్ పోలినా షువలోవాపై హంపి విజయం సాధించింది. జీఎం వైశాలీ రమేష్ బాబుతో నాలుగో రౌండ్‌ను మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక డ్రా చేసుకుంది. రెండు పాయింట్లతో హారిక నాలుగో స్థానానికి చేరింది. అలీనాపై గెలిచిన ఝు జినెర్ (చైనా, 3.5) అగ్ర స్థానంలో కొనసాగుతోంది.

వెన్‌జున్.. ఐదోసారి



షాంఘై: చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ రికార్డుస్థాయిలో ఐదోసారి ఫిడే మహిళల ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. 34 ఏళ్ల వెన్‌జున్ 6.5-2.5 తేడాతో చైనాకే చెందిన తాన్ జోంగ్యిని ఓడించి విజేతగా నిలిచింది. చెస్ చరిత్రలో ప్రపంచ చాంపియన్‌షిప్‌ను ఐదుసార్లు నెగ్గిన నాలుగో మహిళగా వెన్‌జున్ రికార్డుకెక్కింది.

సౌరవ్‌కు ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్



కార్లో (ఐర్లాండ్): భారత క్యూయిస్ట్ సౌరవ్ కొఠారి ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్ నెగ్గాడు. ఫైనల్లో సౌరవ్ 725-480తో భారత్‌కే చెందిన స్టార్ పంకజ్ అద్వానీని ఓడించి విజేతగా నిలిచాడు. 35 ఏళ్ల సౌరవ్‌కు ఇదే తొలి ఐబీఎస్ఎఫ్ వరల్డ్ టైటిల్.

ఆసియా అథ్లెటిక్స్‌లో మరో రెండు కాంస్యాలు

న్యూఢిల్లీ: ఆసియా అండర్-18 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో రెండు కాంస్య పతకాలు లభించాయి. సౌదీ అరేబియాలో గురువారం జరిగిన పోటీల్లో మహిళల డిస్కస్‌త్రోలో లక్షిత, మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో శౌర్య అంబూర్ కాంస్యాలు అందుకున్నారు.


కుళ్లిపోయిన పండ్లు


జ్యూస్ షాపులో ఈగలు, పురుగులు

వామ్మో.. పండ్ల రసాలు!

» జ్యూస్ షాపుల్లో కుళ్లిన పండ్లు.. ఫ్రిడ్జుల్లో పురుగులు

» ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో గుర్తింపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం భరించలేక బయట షాపుల్లో చల్లటి పండ్ల రసాలు తాగుతున్నారా? అయితే జాగ్రత్త పడాల్సిందే. కుళ్లిన పండ్లు, వాటిని కోసే కత్తులకు తుప్పు, పండ్లను నిల్వ చేసే రిఫ్రిజిరేటర్లలో బొద్దింకలు, పురుగులు, పరిసరాల్లో అపరిశుభ్రత.. ఇది పలు పండ్ల రసాల షాపుల్లోని పరిస్థితి. నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ(సీఎఫ్ఎస్) టాస్క్‌ఫోర్స్ బృందాలు చేపట్టిన తనిఖీల్లో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. వెంగళరావునగర్‌లోని ఏ-1 ఫ్రూట్ జ్యూస్, అమీర్‌పేట వినట కాంప్లెక్స్‌లోని కోకోనట్ జ్యూస్ బార్, జనరల్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న కేజీఎన్, తిరుమల టవర్స్‌లోని నేచురల్ ఫ్లేవర్స్, మెట్రో పిల్లర్ 1443 వద్ద ఉన్న బాంబే జ్యూస్ సెంటర్లను అధికారులు తనిఖీ చేశారు. కొన్నిచోట్ల కుళ్లిన పండ్లు, కాలం చెల్లిన ఫ్రూట్ సిరప్‌లు, ఉత్పత్తిదారు(మ్యానుఫ్యాక్చరర్), తేదీల వంటి వివరాలు లేని సోడా సీసాలు వాడుతున్నారని, నీరు కూడా స్వచ్ఛమైనవి వాడడం లేదని, సిబ్బంది యాప్రాన్, హెడ్‌క్యాప్ ధరించడం లేదని గుర్తించారు. అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న పండ్ల రసాల విక్రయ కేంద్రాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

ఇక్రిశాట్‌లో చిరుతపులి కలకలం

పటాన్‌చెరు/ మదీన, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఇక్రిశాట్ పరిశోధనా సంస్థలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. ఇక్రిశాట్ పరిశోధనా వ్యవసాయ క్షేత్రాలలో చిరుత సంచరిస్తున్నట్లు రెండు రోజుల క్రితం సిబ్బంది గుర్తించారు. దీంతో అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీశాఖ అధికారులు చిరుతను బంధించేందుకు పలు చోట్ల బోన్లను ఏర్పాటు చేశారు. ఓ బోనులో గురువారం తెల్లవారుజామున చిరుత చిక్కింది. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పట్టుబడిన చిరుత ఆరోగ్యంగా ఉందని, జూపార్క్‌కు తరలించి పరీక్షలు నిర్వహిస్తున్నామని అటవీ అధికారి శ్రీధర్‌రావు చెప్పారు.


అటవీశాఖ బోనులో చిక్కిన చిరుత

తెలంగాణ జైళ్లల్లో తమిళనాడు విధానం!

» భద్రతా చర్యల్లో భాగంగా సిబ్బందికి బాడీ వోర్న్ కెమెరాలు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జైళ్లల్లో తమిళనాడు తరహా విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నకిలీ బెయిల్ పత్రాలతో ఖైదీ విడుదల.. రిమాండ్ ఖైదీతో రీల్స్.. ఇలా ఇటీవలి కాలంలో జైళ్లలో వెలుగు చూసిన ఘటనల నేపథ్యంలో భద్రత చర్యల్లో భాగంగా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇకపై ఇలాంటి సంఘటనలకు అవకాశం లేకుండా.. భద్రతను కట్టుదిట్టం చేయడంపై ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో చర్చించారు. తమిళనాడు తరహాలో.. జైళ్లశాఖ సిబ్బందికి బాడీవోర్న్ కెమెరాలను సమకూర్చాలని తీర్మానించారు. రాష్ట్రంలోని కారాగారాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా.. భద్రత లోపాలు అడపాదడపా బయటపడుతున్నాయి. ఖైదీలతో అంటకాగే సిబ్బందిపై నిఘా అవసరమని భావించిన అధికారులు.. బాడీవోర్న్ కెమెరాలొక్కటే పరిష్కారమని భావిస్తున్నారు. ఈ కెమెరాలు వైర్‌లెస్ వ్యవస్థలకు అనుసంధానమై ఉంటాయి. దీని వల్ల కంట్రోల్ రూమ్‌లో, ఉన్నతాధికారులు తమ కార్యాలయాల్లో ఎప్పటికప్పుడు లైవ్‌గా పరిస్థితిని పర్యవేక్షించే వెసులుబాటు కలుగుతుంది.

ఆర్టీసీ బస్సులో మొబైల్ పోగొట్టుకున్న మహిళ

» ఆమె ఖాతా నుంచి రూ.1.04 లక్షలు కాజేసిన మోసగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఓ మహిళ ఆర్టీసీ బస్సులో తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. అది దొరికిన మోసగాళ్లు ఆమెకు తిరిగి ఇవ్వకపోగా ఆమె ఖాతాలో నుంచి డబ్బులు కాజేశారు. ఇటీవల కాచిగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగిని(45) తార్నాక నుంచి కాచిగూడకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ప్రయాణంలో ఆమె ఫోన్ పోగొట్టుకున్నారు. ఫోన్ పోయిందని తర్వాత ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె తన బ్యాంకు ఖాతాను పరిశీలించగా.. ఖాతా నుంచి రూ.1.04 లక్షలు మాయమైనట్లు గుర్తించారు. పోగొట్టుకున్న ఫోన్‌ను వినియోగించి మోసగాళ్లు ఖాతాలో నుంచి డబ్బు కాజేశారని ఆమె సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశారు.

'బెట్టింగ్'కు యువకుడి బలి

రాజేంద్రనగర్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌నకు ఓ యువకుడు బలయ్యాడు. బెట్టింగ్ యాప్ ద్వారా డబ్బులు పోగొట్టుకున్నాననే మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకున్నాడు. గద్వాల్‌కు చెందిన పెద్ద నర్సింహులు కుమారుడు పవన్(25) మాసబ్‌ట్యాంక్‌లోని కళాశాలలో ఎంటెక్ చేస్తున్నాడు. స్నేహితులు ఎస్.గౌతమ్, రోహిత్‌లతో కలసి అత్తాపూర్ రెడ్డి బస్తీలో ఓ గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. బెట్టింగ్ యాప్ ద్వారా నష్టపోవడంతో తండ్రికి ఫోన్ చేసి బాధపడ్డాడు. బెట్టింగ్‌లో ఐ ఫోన్ 15, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌ను కూడా పోగొట్టుకున్నాడని తెలిపాడు. భయపడవద్దని ధైర్యం చెప్పిన తండ్రి పలుమార్లు రూ.98,200లను పంపించాడు. అయినా మనస్తాపంతో బుధవారం అద్దె ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఈ విషయాన్ని పక్క ఇంట్లో ఉండే శ్రీకాంత్ అనే వ్యక్తి తండ్రి పెద్ద నర్సింహులుకు ఫోన్ చేసి చెప్పాడు.

సిజేరియన్స్ చేసే ఆస్పత్రులపై చర్యలు తీసుకోండి

» అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సరైన కారణంలేకుండా సిజేరియన్ ప్రసవాలు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. తెలంగాణ వైద్య సేవల మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఎంఎస్ఐడీసీ)లో గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిజేరియన్ డెలివరీల నియంత్రణకు సి-సెక్షన్ ఆడిట్‌ను మరింత పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి చెప్పారు. ప్రభుత్వ దవాఖానాల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలన్నారు. మాతా,శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో వసతులను మెరుగుపర్చాలని, ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీ చేయించుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియపై మంత్రి ఆరా తీశారు. ప్రమోషన్ల ద్వారా ఖాళీ అయిన పోస్టుల భర్తీపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు.

గాంధీభవన్‌ను ముట్టడించిన అధ్యాపకులు

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సర్వీసును క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు గురువారం గాంధీభవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయాలని సీఎం ఆదేశించినా, అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్య జటిలమవుతుందని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని 18నెలల నుంచి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. నిరసన తెలిపిన అధ్యాపకులను పోలీసులు అరెస్టు చేసి, పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

సన్న బియ్యం.. కొంటాం!!

» లబ్ధిదారుల చుట్టూ దళారుల ప్రదక్షిణలు

» కిలోకు 20 నుంచి 25 వరకు ధర

» ఆటోల్లో పల్లెలు, పట్టణాల్లో సంచారం

» దొడ్డు బియ్యం తినేవాళ్లే లక్ష్యంగా చక్కర్లు

» నిఘా పెంచకుంటే మళ్లీ అక్రమ రవాణా

సంగారెడ్డి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పథకానికీ దళారులు తూట్లు పొడుస్తున్నారు. మొన్నటి దాకా పల్లెలు పట్టణాల్లో దొడ్డు బియ్యం కొంటామంటూ తిరిగిన వారు.. ఇప్పుడు సన్న బియ్యం కొంటామంటూ చక్కర్లు కొడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పల్లెలు, పట్టణాల్లో ద్విచక్రవాహనాలు, ఆటోల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. ఇదేతీరులో రాష్ట్ర వ్యాప్తంగా దళారుల దందా సాగుతున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు 90 శాతానికి పైగానే లబ్ధిదారులు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం తీసుకున్నారు. మరో రెండు రోజుల్లో వంద శాతం సన్న బియ్యం పంపిణీని పూర్తి చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సన్న బియ్యం పంపిణీపై ప్రజల్లోనూ హర్షం వ్యక్తమవుతోంది. అయితే, గతంలో దొడ్డుబియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమ రవాణాకు పాల్పడిన ముఠాలు.. ఇప్పుడు సన్న బియ్యం కొనుగోలు చేస్తామంటూ తిరుగుతుండడం చర్చనీయాంశంగా మారింది. గతంలో సన్న బియ్యం తినే వారిని లక్ష్యంగా చేసుకుని.. దొడ్డుబియ్యాన్ని కిలోకు రూ.10-15 దాకా చెల్లించి కొనుగోలు చేసే వారు. ఇప్పుడేమో దొడ్డు బియ్యం తినే వాళ్ల వద్ద రూ.20-25 దాకా ధర నిర్ణయించి సన్న బియ్యం కొనుగోలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాధారణంగా దొడ్డు బియ్యం తినే అలవాటు ఉన్న వారికి సన్న బియ్యం రుచించవు. ఇలాంటి వారు మార్కెట్‌లోని పలు దుకాణాల్లో సన్న బియ్యాన్ని కిలో రూ.25 లెక్కన ఇచ్చి.. దొడ్డు బియ్యం తెచ్చుకుంటున్నట్లు తెలిసింది. అలాగే, తమ పొలంలో పండిన బియ్యాన్ని తినే రైతులు కూడా రేషన్ ద్వారా వచ్చే సన్న బియ్యాన్నే వినియోగించడం లేదన్న అంచనాలున్నాయి. ఈ రెండు వర్గాల వారే లక్ష్యంగా దళారులు గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతున్నారు. లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.25చొప్పున కొనుగోలు చేస్తున్న బియ్యాన్ని మార్కెట్‌లో రూ.40చొప్పున విక్రయించడానికి సిద్ధమవుతున్నారు. దీనిపై సర్కారు నిఘా పెంచకపోతే మళ్లీ అక్రమ రవాణా జోరందుకునే అవకాశాలున్నాయన్న చర్చ సాగుతోంది.



గ్రూప్-1పై బ్రేక్



(మొదటిపేజీ తరువాయి)

అనుమానాస్పదంగా ఉందని.. పిటిషనర్ల సమాధాన పత్రాలను సరిగా మూల్యాంకనం చేయలేదని, జనరల్ ర్యాంకింగ్ జాబితాను తప్పుగా ప్రచురించారని ఆమె ఆరోపించారు. దీనిపై కోర్టు పర్యవేక్షణలో విచారణకు ఆదేశించాలని లేదా స్వతంత్ర న్యాయవిచారణకు కమిషన్ వేయాలని కోరారు. "హైదరాబాద్‌లోని రెండు సెంటర్ల నుంచి 71 మంది ఎంపికయ్యారు. మొత్తం 563 పోస్టుల్లో ఇది 12 శాతానికి సమానం. మెయిన్స్ పరీక్షలకు 21,075 మంది ఎంపికయ్యారని ఒకసారి.. 21,085 మంది ఎంపికైనట్టు మరోసారి చెప్పారు. ఆ 10 మందీ ఎలా పెరిగారు? ఉర్దూలో 9 మంది పరీక్షలు రాస్తే 10 మంది అని వెల్లడించారు. 482 మార్కులు వచ్చిన ఓ అభ్యర్థి రీకౌంటింగ్ పెడితే 60మార్కులు తగ్గడం దారుణం. జనరల్ ర్యాంకింగ్స్‌ను కంప్యూటర్‌లో మార్చారు. కంప్యూటర్ లాగిన్ హిస్టరీని పరిశీలిస్తే నిజాలు బయటకొస్తాయి. దీనిపై వివరాలు అడిగితే ఫోర్జరీ అని బెదిరిస్తున్నారు. విషయ నిపుణులతో పేపర్లు మూల్యాంకనం చేయించామని అంటున్నారుగానీ.. రిటైర్ అయిన వారితో పేపర్లు దిద్దించారు. వీటన్నింటిపై విచారణకు ఆదేశించాలి" అని ఆమె విజ్ఞప్తి చేశారు.

కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు..

టీజీపీఎస్సీ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది పీఎస్ రాజశేఖర్.. మెయిన్స్‌కు ఎంపికైన వారంతా ఒకే ప్రాంతానికి చెందిన వారని చెప్పడంలో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు. "అక్టోబరు 27న మెయిన్స్ చివరి పరీక్ష జరిగిన రోజు సమాచారాన్ని బట్టి మొత్తం అభ్యర్థులు 21,075గా కమిషన్ ప్రకటించింది. అందులో స్వల్ప మార్పులు ఉంటాయని సైతం ముందే తెలిపారు. ఆ తర్వాత మొత్తం సంఖ్య 21,085గా తేలింది. చివరి పరీక్ష రోజు మొత్తం అభ్యర్థుల సంఖ్యను కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. రెండు సెంటర్ల నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు ఎంపికయ్యారన్న దానిలో వాస్తవం లేదు. పిటిషనర్లు ఆరోపిస్తున్న ఒక సెంటర్‌లో 792 మందికి 39 మంది (4.92శాతం) మరో సెంటర్‌లో 864 మందికి 32 మంది (3.7శాతం) మాత్రమే ఎంపికయ్యారు. హాజరైన అభ్యర్థులతో పోలిస్తే ఎంపిక శాతం చాలా తక్కువగా ఉంది. అవకతవకలు జరిగి ఉంటే అందరూ ఎంపిక కావాలి. లేదా ఆ సెంటర్లలో మిగిలిన అభ్యర్థులు అభ్యంతరం తెలిపేవారు. ఆయా సెంటర్లు మహిళా కాలేజీలు కావడం వల్ల అక్కడ మహిళా అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నారు. మెయిన్స్‌కు 45 సెంటర్లను తొలుత ప్రకటించినా ఒక సెంటర్ పెంచాల్సి వచ్చింది. అన్ని కేంద్రాలనూ ఎంపిక చేసిన తర్వాతే హాల్‌టికెట్లు జారీచేశాం" అని ధర్మాసనానికి వివరించారు. మూల్యాంకనంలో పాల్గొన్న ఎంఏ మల్లిక్ ఆర్సీరెడ్డి కోచింగ్ సెంటర్‌లో పని చేస్తున్నారనే ఆరోపణ అవాస్తవమని.. ఆయన చేవెళ్ల డిగ్రీ కాలేజీలో ప్రభుత్వ ఉద్యోగి అని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులను మూల్యాంకనం చేయడానికి తీసుకోవద్దని చట్టంలో లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్ వేసిన 20 మందిలో 19 మంది ప్రభుత్వ ఉద్యోగులని.. వారు ఎక్కడ పనిచేస్తున్నారు? అనే వివరాలు దాచిపెట్టి తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ధర్మాసనానికి నివేదించారు. "రీకౌంటింగ్‌లో మార్కులు తగ్గాయన్న మాట అవాస్తవం. సదరు అభ్యర్థికి 422మార్కులు వస్తే 482 అని ఫోర్జరీ చేశారు" అని పేర్కొన్నారు. ఇరు వర్గాల వాదనలూ విన్న ధర్మాసనం.. అభ్యర్థుల డేటా నమోదు హిస్టరీతోపాటు పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని టీజీపీఎస్సీకి ఆదేశాలు జారీచేసింది. పిటిషనర్లు సైతం తాము ఎక్కడ పనిచేస్తున్నదీ వివరాలు సమర్పించాలని ఆదేశించింది. తప్పుడు వివరాలు ఇచ్చినట్లు తేలితే చర్యలుంటాయని హెచ్చరిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

45 టీఎంసీలను తెలంగాణకే కేటాయించాలి

» బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు తెలంగాణ వాదన

» సాగర్ ఎగువ రాష్ట్రాలకు బచావత్ ట్రైబ్యునల్ వెసులుబాటు కల్పించిందని వ్యాఖ్య

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభిస్తే దాని నుంచి కృష్ణా డెల్టా సిస్టమ్ (కేడీఎస్)కు తరలించే కృష్ణా జలాల్లో 45 టీఎంసీల నీటిని నాగార్జున సాగర్ ఎగువ రాష్ట్రంగా తెలంగాణకు కేటాయించాలని జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ (కృష్ణా ట్రైబ్యునల్-2) ముందు తెలంగాణ వాదించింది. పోలవరం ప్రాజెక్టు నుంచి కేడీఎస్‌కు తరలించే 80 టీఎంసీల నీటికి బదులు నాగార్జున సాగర్ ఎగువ రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాల వాడుకోవడానికి బచావత్ ట్రైబ్యునల్ వెసులుబాటు కల్పించిందని గురువారం తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదించారు. కృష్ణా జలాల్లో మిగతా 35 టీఎంసీల నీటి వినియోగానికి ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాజెక్టులు నిర్మిస్తున్నాయని తెలిపారు. కనుక మిగతా 45 టీఎంసీలపై తెలంగాణకే పూర్తి హక్కు ఉంటుందని పేర్కొన్నారు. ఇక, పోలవరం కుడికాలువ నుంచి 10వేల క్యూసెక్కుల నీటి తరలింపునకు గోదావరి ట్రైబ్యునల్(బచావత్) అనుమతించిందని సీఎస్ వైద్యనాథన్ పేర్కొన్నారు. ఆ తర్వాత 17,500 క్యూసెక్కులకు.. తాజాగా 40 వేల క్యూసెక్కులకు కాలువ సామర్థ్యాన్ని పెంచారని నివేదించారు. పోలవరం ప్రాజెక్టు విస్తరణలో భాగంగా రూ.80వేల కోట్లతో గోదావరి - బనకచర్ల అనుసంధానానికి ఏపీ ప్రభుత్వం జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని గుర్తుచేసిన తెలంగాణ.. ఇందుకు ఏపీ సర్కారు జారీచేసిన జీవోను ట్రైబ్యునల్‌కు అందించింది. యేటా గోదావరి నది నుంచి సముద్రంలో కలుస్తున్న 3000-4000 టీఎంసీల నీటిని బనకచర్ల, చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలతో సాగర్ కుడికాలువతోపాటు కృష్ణా డెల్టా సిస్టమ్‌లోని ఎడమ కాలువ పరిధిలోని ఏపీ ప్రాంత చివరి ఆయకట్టుకు నీరు అందించే అవకాశాలున్నాయని వైద్యనాథన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఒకటో, రెండో పంటలకు కృష్ణా జలాల్లో ఎక్కువ నీటిని వాడుకుని ఇతర బేసిన్‌లకు మళ్లించాలనుకుంటే లోటు ఉన్న కృష్ణా బేసిన్ నుంచి కాకుండా గోదావరి జలాల నుంచి తరలించేలా చూడాలని కోరారు.

కేటీఆర్‌వి సిగ్గుమాలిన మాటలు: అయిలయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కేటీఆర్ సిగ్గుమాలిన మాటలు మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోకపోతే నాలుక కోస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హెచ్చరించారు. అధికారం పోవడంతో కేటీఆర్ మతి భ్రమించిందని, ప్రభుత్వాన్ని కూల్చుతామని సిగ్గుమాలిన మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. అవినీతి డబ్బుతో పెట్టిన పింక్ మీడియాతో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని కూల్చమని రియల్టర్లు, బ్రోకర్లు, భూకుంభకోణాలు చేసిన వారు చందాలు ఇస్తున్నరనే సిగ్గుమాలిన మాటలను సహించేది లేదని పేర్కొన్నారు.

చారిత్రక కట్టడాలను కూల్చట్లేదు

పాతబస్తీలో మెట్రోపై హైకోర్టుకు ప్రభుత్వ వివరణ

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండో దశ ఆరో కారిడార్‌లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకూ చేపడుతున్న పనుల్లో చారిత్రక కట్టడాలను కూల్చేయట్లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వెల్లడించింది. మెట్రో కోసం చార్మినార్ నుంచి ఫలక్‌నుమా దాకా ఉన్న చారిత్రక కట్టడాలను కూల్చేస్తున్నారని.. హెరిటేజ్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేపట్టకుండా, నిపుణుల కమిటీ వేయకుండా నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొంటూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు మొహమ్మద్ రహీంఖాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. వాటికి ఎలాంటి నష్టం కలిగించట్లేదని తెలిపారు. నిబంధనల ప్రకారం స్థలాలు సేకరించిన తర్వాతే నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మెట్రో నిర్మాణ పనులపై పూర్తిస్థాయి వివరాలు తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు. దీంతో కోర్టు తదుపరి విచారణను 22వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకూ.. చారిత్రక కట్టడాలుగా గుర్తించిన నిర్మాణాలను కూల్చరాదని స్పష్టంచేసింది.

కశ్మీర్‌పై మళ్లీ పాక్ బీరాలు

» పాక్ జీవనాడి కశ్మీర్.. వదులుకోబోం

» భారత ఆర్మీయే ఏమీ చేయలేకపోతోంది

» పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ ప్రగల్భాలు

» తిప్పికొట్టిన భారత్

» పొరుగుదేశంపై విదేశాంగ శాఖ ఆగ్రహం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ మరోసారి నోరు పారేసుకుంది. భారత సైన్యం గురించి పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. "భారత్‌కు చెందిన 13 లక్షల సైన్యమే మనల్ని ఏమీ చేయలేకపోతోంది. ఇక, ఈ ఉగ్రవాదులు ఎంత? పాక్ ఆర్మీని వీళ్ల లొంగదీసుకోగలరా? వాళ్ల వల్ల పెట్టుబడులు ఆగుతాయా?" అంటూ మునీర్ ప్రగల్భాలు పలికారు. పాకిస్థాన్ జీవనాడి కశ్మీర్ అని, ఆ భూభాగంతో ఉన్న సంబంధాన్ని మరిచిపోలేమని బీరాలు పోయారు. ఇస్లామాబాద్‌లో ప్రవాస పాక్ జాతీయులతో నిర్వహించిన కార్యక్రమంలో మునీర్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ విభజన నాటి ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రస్తావిస్తూ భారత్‌పై విషం చిమ్మారు. తాము ఉన్నత భావజాలం, సంస్కృతికి చెందినవారం అనేది మరిచిపోరాదని ఎన్ఆర్‌పీలను ఉద్దేశించి అన్నారు. భావజాలం, ఆచారాలు, సంప్రదాయాలు, ధర్మం, ఆలోచనలు, లక్ష్యాల విషయంలో హిందువుల కంటే ముస్లింలు భిన్నమైనవారు కాబట్టే పెద్దలు ద్విజాతి సిద్ధాంతం తయారుచేశారని, వేరుగా పాకిస్థాన్‌ను ఏర్పాటుచేశారన్నారు. ఏ దేశంలో పనిచేస్తున్నా పాక్ రాయబారులుగా ఎన్ఆర్‌పీలు వ్యవహరించాలని, దేశ విభజన, పాక్ ఆవిర్భావం వంటి విషయాలను పిల్లలకు కథలుగా చెప్పాలన్నారు. వేర్పాటువాదులు పది జన్మలు ఎత్తినా బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ నుంచి లాగేసుకోలేరని అసిమ్ మునీర్ అన్నారు. కాగా, పాక్ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను భారత్ గట్టిగా తిప్పికొట్టింది. "విదేశీ భూభాగం జీవనాడి ఎలా అవుతుంది? ఒక ఆక్రమిత భూభాగాన్ని వదిలిపెట్టిపోవడమే కశ్మీర్‌తో పాక్‌కు ఉన్న సంబంధం" అని విదేశాంగ శాఖ కార్యదర్శి రణధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. ప్రపంచ ఉగ్రవాద స్థావరమనే మచ్చ పోయేది కాదన్నారు. పాకిస్థాన్‌లో కూర్చున్న ముంబై బాంబుపేలుళ్ల కేసులోని ఇతర నేరగాళ్లను భారత్‌కు ఆ దేశం పట్టించాల్సిందేనని, రాణా ఉదంతం ఇదే విషయం తేల్చిచెప్పిందని జైశ్వాల్ వ్యాఖ్యానించారు.

38 మంది జిల్లా న్యాయమూర్తుల బదిలీ

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జిల్లా న్యాయమూర్తుల బదిలీలు పెద్దఎత్తున జరిగాయి. మొత్తం 38 మంది జిల్లా న్యాయమూర్తులను బదిలీ చేశారు. వీరిలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్ట్ పరిధిలోని ముగ్గురు న్యాయమూర్తులు కూడా ఉన్నారు. ఈ మేరకు హైకోర్ట్ రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

విత్తనం.. ప్రైవేటుదే పెత్తనం..!

విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా 3.5 శాతమే.. సబ్సిడీపై 64,800 క్వింటాళ్ల విత్తనాలే

» 96.5% ప్రైవేటు కంపెనీల నుంచే

» సర్కారే సరఫరా చేయాలని రైతుల డిమాండ్

» విత్తనోత్పత్తిపై ఇప్పుడిప్పుడే దృష్టిసారిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంటల సాగుకు అవసరమ్యే విత్తనాల సరఫరాలో ప్రైవేటు పెత్తనం కొనసాగుతోంది. సాగునీటి లభ్యత పెరగడంతో రాష్ట్రంలో పంటల విస్తీర్ణం కూడా పెరుగుతోంది. అందుకు తగ్గట్లుగా నాణ్యమైన విత్తనాల సరఫరా జరగడం లేదు. ప్రభుత్వ రంగ విత్తన సంస్థలు డిమాండ్‌లో 3.5% మాత్రమే అందజేస్తుండగా.. మిగతా మొత్తం సరఫరా ప్రైవేటు కంపెనీల చేతుల్లో ఉండడం రైతుల పాలిట శాపంగా మారుతోంది. ప్రైవేటు ముసుగులో నకిలీ విత్తనాలు సరఫరా అవుతూ.. రైతులకు తీరని వ్యథను మిగిలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే చొరవ తీసుకుని, నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కావాల్సింది 19.42 లక్షల క్వింటాళ్లు

రాబోయే వానాకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1.34 కోట్ల ఎకరాల్లో పంటల సాగుకు 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ ప్రణాళిక స్పష్టం చేస్తోంది. ఇందులో 66.80 లక్షల ఎకరాల్లో వరి(16.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం), 50 లక్షల ఎకరాల్లో పత్తి(పూర్తిగా ప్రైవేటు సరఫరా), ఐదున్నర లక్షల ఎకరాల్లో కంది, 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, నాలుగున్నర లక్షల ఎకరాల్లో సోయాబీన్, 1.87 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయని అధికారులు చెబుతున్నారు. అవసరమైన 19.42 లక్షల క్వింటాళ్లలో.. 18.77లక్షల క్వింటాళ్ల విత్తనాలను ప్రైవేటు కంపెనీలే సరఫరా చేస్తున్నాయి. రాష్ట్ర, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థలు కేవలం 64,800 క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేయడం గమనార్హం..! కేంద్ర ప్రభుత్వం కేవలం విత్తన ప్యాకెట్ ధరను నిర్ణయించి, చేతులు దులుపుకొంటుంది. ప్రైవేటు కంపెనీలు మాత్రం ఇష్టారాజ్యంగా విత్తనాలను విక్రయిస్తాయి. డిమాండ్ అధికంగా ఉంటే.. కృత్రిమ కొరత పేరుతో సృష్టించి, ధరలను పెంచడం రివాజుగా మారింది.



ఈ విత్తనాలకు సర్కారు దూరం?

పత్తి విత్తనాలను జాతీయ, రాష్ట్ర సంస్థలు పత్తి విత్తనాలను సరఫరా చేయడం లేదు. ఇక రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కంది, మొక్కజొన్న, సోయాబీన్, పెసర, వేరుశనగ, ఆముదం, నువ్వులు, సజ్జలు, రాగులు, పొద్దుతిరుగుడు వంటి విత్తనాలను పట్టించుకోదనే విమర్శలున్నాయి. ఈ సంస్థ విత్తన సరఫరా లక్ష్యం 17,841 క్వింటాళ్లు మాత్రమే..! జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ లక్ష్యం సుమారు 50 వేల క్వింటాళ్లు. దీంతో.. వానాకాలం విత్తన అవసరాల్లో కేవలం 3.5% విత్తనాలే ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా అందుతున్నాయి. మిగతా డిమాండ్‌లో ప్రైవేటు పెత్తనం కొనసాగనుంది.

ప్రైవేటు ముసుగులో నకిలీల జోరు

ప్రైవేటు చేతుల్లోనే సింహభాగం విత్తన సరఫరా ఉండడంతో.. నకిలీలు కూడా అదే స్థాయిలో విజృంభిస్తూ.. రైతుల పుట్టిముంచుతున్నాయి. ఏటా నకిలీ విత్తన విక్రేతలపై నమోదవుతున్న కేసులే ఇందుకు నిదర్శనం. 2017లో 25 వేల క్వింటాళ్లు, 2018లో 2 వేల క్వింటాళ్లు, 2019లో 57 వేల క్వింటాళ్లు, 2020లో 20 వేల క్వింటాళ్లు, 2021లో 24 వేల క్వింటాళ్లు, 2022లో 500 క్వింటాళ్లు, 2023లో 15 వేల క్వింటాళ్లు, 2024లో 1,300 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను అధికారులు సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ శాఖ అధికారులు జరిపిన నామమాత్రపు దాడుల్లో ఈ స్థాయిలో నకిలీలు పట్టుబడితే.. దొరకనివి టన్నుల్లో ఉంటాయని తెలుస్తోంది. నకిలీ విత్తన విక్రేతలపై పీడీ చట్టం కింద కేసులు పెడతామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా.. ఈ దందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడడం లేదు. నకిలీ విత్తనాల విక్రయాలకు సంబంధించి గత ఏడాది 57 క్రిమినల్ కేసులు నమోదవ్వగా.. 78 మంది అరెస్టయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థలే విత్తనాలను సరఫరా చేస్తే.. నకిలీలకు అవకాశం ఉండదని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పుడిప్పుడే ప్రభుత్వ దృష్టి

విత్తనోత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తోంది. 'గ్రామగ్రామానికి జయశంకర్ యూనివర్సిటీ విత్తనం' అనే కార్యక్రమానికి జూన్‌లో శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ప్రకటించారు. ఆ దిశలో అధికారులు సుమారు 40 వేల మంది రైతులకు 2,500 నుంచి 3 వేల క్వింటాళ్ల వరకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసేలా కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నలుగురైదుగురు ఆదర్శ రైతుల ద్వారా విత్తనోత్పత్తి చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో రాబోయే మూడునాలుగేళ్లలో విత్తనోత్పత్తి పెరుగుతుందని, రైతులకు స్థానికంగానే నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తోంది.

పోలీసుశాఖలో 33% మహిళా రిజర్వేషన్లు సాధ్యమేనా..?

» ఈ టార్గెట్‌కు 22 ఏళ్ల దూరంలో తెలంగాణ

» ఇండియా జస్టిస్ రిపోర్ట్ !

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) పోలీసు శాఖలో మహిళల కోటా 33 శాతం రావడానికి ఏయే రాష్ట్రానికి ఎన్నేళ్లు పట్టవచ్చనే విషయంలో ఇండియా జస్టిస్ 2025 రిపోర్టులో ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూశాయి. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, జైళ్లు, న్యాయ సహాయం ఇలా నాలుగు రంగాల్లో మహిళా ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు అన్న వివరాలను ఈ సంస్థ సేకరించింది. మరో మూడేళ్లలో ఆంధ్రా, బీహార్ రాష్ట్రాల్లోని పోలీసు విభాగాల్లో 33 శాతం మహిళల కోటా భర్తీ కావచ్చని ఈ నివేదిక పేర్కొన్నారు. మహారాష్ట్ర 12 ఏళ్లు, గుజరాత్ 13 ఏళ్లు, తమిళనాడుకు 20 ఏళ్లు, తెలంగాణకు 22 ఏళ్లు పట్టవచ్చని నివేదికలో స్పష్టం చేశారు. ఈ కోటా భర్తీ కావడానికి జార్ఖండ్ రాష్ట్రానికి ఏకంగా మరో 200 ఏళ్లు పడుతుందని, త్రిపుర, అండమాన్ నికోబార్‌లో 220 ఏళ్లకు పైగా పట్టొచ్చని పేర్కొన్నారు. పోలీసుశాఖలో భర్తీ అవుతున్న మహిళల్లో కానిస్టేబుళ్ల వాటా 13 శాతం కాగా, ఆయా రంగాల్లో ఉన్నత శాఖల్లో పని చేసే మహిళల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందని సర్వే చెబుతోంది. ఆఫీసర్ క్యాడర్‌లో వీరి వాటా కేవలం 8 శాతం మాత్రమేనని నివేదికలో పేర్కొన్నారు. ఇండియన్ పోలీసు సర్వీసు(ఐపీఎస్)లో మహిళల వాటా కేవలం 12 శాతం మాత్రమే ఉందని నివేదికలో తెలిపారు. అత్యధికంగా సబ్ ఆర్డినేట్ కోర్టుల న్యాయమూర్తులుగా 38 శాతం మహిళలుండగా, హైకోర్టు న్యాయమూర్తుల్లో వీరి వాటా 14 శాతంగా ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో మహిళల వాటా కేవలం ఆరు శాతం మాత్రమే కావడం గమనార్హం.

మానవహక్కుల సంఘం చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కమిషన్ సభ్యులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి కిశోర్, శివాది ప్రవీణ కూడా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత షమీమ్ అక్తర్ మీడియాతో మాట్లాడుతూ.. తాము బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే.. 300 పాత కేసులు పరిశీలించామన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు ఇక ముందు నమోదయ్యే కేసులను పరిష్కరించి రాజ్యాంగబద్ధంగా ప్రజలకు న్యాయం చేయడానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్‌గా జస్టిస్ గుండా చంద్రయ్య పదవీ విరమణచేసిన తర్వాత ఆరేళ్లుగా ఈ పదవి ఖాళీగా ఉంది. అన్ని రాష్ట్రాలు తప్పనిసరిగా మానవహక్కుల సంఘం చైర్మన్, సభ్యులను నియమించాలని ఇటీవల సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియామకాలు చేపట్టింది.

శరవేగంతో ఫిర్యాదుల పరిష్కారం

- అందుకే పోలీసింగ్‌లో తెలంగాణ టాప్: డీజీపీ

"కేసుల దర్యాప్తులో వేగం.. ఫిర్యాదుల పరిష్కారంలో శరవేగం.. ఆపదలో ఉన్నామంటూ డయల్ 100కి ఫోన్ వస్తే నిమిషాల్లో మేము ఉన్నామంటూ పరుగున వచ్చే పోలీసులు.. కేసుల దర్యాప్తులో నూతన సాంకేతికతను వాడటం.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చేరువలో పోలీసుల సేవలు ఉండటంతో తెలంగాణ పోలీసులు దేశంలోనే పోలీసింగ్‌లో తొలి స్థానాన్ని సాధించారు" అని డీజీపీ జితేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో 10.6 చదరపు కిలోమీటర్లకు ఒక పోలీసు స్టేషన్ ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో 282 చదరపు కిలోమీటర్లకు పోలీసుస్టేషన్ ఉండటంతో ప్రజలు పోలీసు సేవలను సమర్థంగా వినియోగించుకోగలుగుతున్నారని ఆయన వివరించారు. నియామకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్న క్రమంలో కానిస్టేబుళ్ల ఖాళీల సంఖ్య 13 శాతానికి పరిమితం చేయగలిగామని, ఇదీ దేశ సగటు కన్నా తక్కువ అని పేర్కొన్నారు. అంకితభావంతో పనిచేసే సిబ్బంది వల్ల పోలీసింగ్ విభాగంలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని 'ఇండియా జస్టిస్ నివేదిక' వెల్లడించినట్లు వివరించారు.

నేడు ఎస్ఎల్‌బీసీకి టీబీఎం బేరింగ్

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) ఔట్‌లెట్ వైపు తవ్వకాలు జరుపనున్న టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం)కు చెందిన బేరింగ్ విజయవాడ టోల్‌ప్లాజా వద్దకు చేరింది. శుక్రవారంకల్లా అచ్చంపేట మండలం అయ్యవారిపల్లికి ఔట్‌లెట్ ద్వారం వైపు చేరే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అమెరికా నుంచి చెన్నయ్ పోర్టుకు సముద్రమార్గంలో రాగా... చెన్నయ్ పోర్టు నుంచి 470 కి.మీ. దాకా రోడ్డు మార్గంలో బేరింగ్‌ను విజయవాడకు చేర్చారు. శుక్రవారం కల్లా అయ్యవారిపల్లికి చేరితే... ఆ తర్వాత దీన్ని బిగించిన అనంతరం ఔట్‌లెట్ వైపు నుంచి టీబీఎం ద్వారా టన్నెలింగ్ చేయనున్నారు. మరో వైపు ఇన్‌లెట్ (దోమలపెంట, శ్రీశైలం) వైపు నుంచి బ్లాస్టింగ్, టన్నెలింగ్ విధానంలో తవ్వకాలు చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించారు.

నెలాఖరులోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో దానకిశోర్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిషోర్ కలెక్టర్లకు సూచించారు. ఈ నెల 30లోగా దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. సచివాలయం నుంచి గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఫీజు చెల్లించిన తరువాత తక్కువ ప్రొసీడింగ్స్‌తో ఎల్ఆర్ఎస్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఓపెన్ ప్లాట్లతో పోల్చితే లేఅవుట్ల తనిఖీ వేగంగా జరగడం లేదని, ఆ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు.

హెచ్‌సీయూకు 100కోట్ల ఏఎన్ఆర్ఎఫ్ గ్రాంట్

- వైద్యరంగంలో పరిశోధనల ప్రాజెక్టుకు కేటాయింపు
- వర్సిటీ చరిత్రలో ఇదో మైలురాయి: వీసీ బీజే రావు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) మరో ఘనతను సొంతం చేసుకుంది. హెల్త్ అండ్ మెడికల్ టెక్నాలజీస్‌లో పరిశోధన, ఆవిష్కరణల నిమిత్తం హెచ్‌సీయూ నేతృత్వంలోని బృందానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.100కోట్ల గ్రాంట్ మంజూరైంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్- పార్ట్‌నర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎన్ఆర్ఎఫ్-పెయిర్) సీఈవో నుంచి హెచ్‌సీయూ వీసీ బీజే రావుకు లేఖ అందింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఏడు హబ్-ఎన్-స్పోక్ మోడల్ ప్రాజెక్టుల్లో ఒకటిగా హెచ్‌సీయూ ప్రతిపాదించిన ప్రాజెక్టు ఎంపిక కావడం సంతోషంగా ఉందని, వర్సిటీ చరిత్రలో ఇదో మైలురాయిగా నిలిచిపోనుందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు అత్యాధునిక, సహకార పరిశోధనల్లో యూనివర్సిటీ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బ్రహ్మానందం మానవతి, కో-ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సిబా కుమార్ వ్యవహరిస్తారని, యూనివర్సిటీ ఆర్అండ్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ భాగస్వామ్య సంస్థలతో సమన్వయం చేస్తారని వెల్లడించారు

వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం:షబ్బీర్ అలీ

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. రాజ్యాంగంపై ముస్లింలకు నమ్మకం ఉందని ఆయన చెప్పారు. కేంద్రం సవరణ చేసిన వక్ఫ్ బోర్డ్ బిల్లును కాంగ్రెస్ తరఫున సుప్రీంకోర్టులో సవాల్ చేశామని, దీనిపై కపిల్ సిబాల్ వాదించారని వివరించారు. కబ్జా చేసిన భూములన్నింటికీ ఒకటే చట్టం చేయాలన్నారు. కేవలం ఒక మతానికి మాత్రమే చట్టం చేయడం వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. వక్ఫ్ భూములు సర్కార్ ఇచ్చిన భూములు కావని, పేద ముస్లింల కోసం దాతలిచ్చిన భూములని గుర్తుచేశారు. అన్ని మతాలకు చెందిన భూములు కబ్జాలకు గురవుతున్నందున, అన్నింటిపైనా రక్షణకు చట్టాన్ని తీసుకొస్తే స్వాగతిస్తామని చెప్పారు.

పుప్పాలగూడ 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీజీఐఐసీ)కు సంబంధించిన దాదాపు 250 ఎకరాల భూమి ఉందని అధికారులు వివరించారు. మొత్తంగా మొదటి దశలో ఐటీ నాలెడ్జ్ హబ్ అభివృద్ధికి సుమారు 450 ఎకరాలు అందుబాటులో ఉందని చెప్పారు. మొదటి దశలో ఏర్పాటు చేయబోతున్న ఐటీ హబ్ ద్వారా 5 లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రుల బృందానికి సూచించారు.

తెలంగాణకు మారుబెనీ

(మొదటిపేజీ తరువాయి)


ఫ్యూచర్ సిటీలోని 600 ఎకరాల్లో రూ.1000 కోట్లతో దశలవారీగా ప్రపంచ స్థాయి నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీలోకి మారుబెనీ కంపెనీకి ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. ఇక్కడ ఏర్పాటు చేసే మొట్టమొదటి పార్కు ఇదేనని అన్నారు. మారుబెనీ కంపెనీ ఏర్పాటుతో తెలంగాణలో దాదాపు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, జీవనోపాధి మెరుగుపడుతుందని చెప్పారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలున్నాయని, మారుబెనీకి ప్రభుత్వం తరఫున తగినంత మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ మారుబెనీ కంపెనీ పెట్టుబడులను పెట్టేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని అన్నారు. కాగా, తెలంగాణను, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ ఎంచుకున్న దార్శనికతను మారుబెనీ నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ అధికారి దైసకాకురా అభినందించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. అక్కడున్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందు వరుసలో ఉంటామని అన్నారు.

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ఇలా..

జపాన్ కంపెనీలతోపాటు ఇతర అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తారు. ఫలితంగా, దశలవారీగా దాదాపు రూ.5,000 కోట్లకుపైగా పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలున్నట్లు అంచనా. ఇక, మారుబెనీ ఇండస్ట్రియల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరో స్పేస్‌తోపాటు రక్షణ రంగాలపై దృష్టి పెడుతుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు నైపుణ్యం కలిగిన వారికి ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును చేపడుతుంది. మారుబెనీ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాల్లో 410కిపైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరో స్పేస్, మొబిలిటీ రంగాల్లో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 50,000 మందికిపైగా ఉద్యోగులు ఈ కంపెనీల్లో పని చేస్తున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

రుణం ఇస్తే టోక్యోను మించిపోతాం

న్యూయార్క్, టోక్యో వంటి అంతర్జాతీయ స్థాయి నగరాలతో సమానంగా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, తమ ప్రభుత్వ ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందిస్తే టోక్యో నగరాన్ని మించిన అభివృద్ధి సాధిస్తామని జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ఉన్నత స్థాయి ప్రతినిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానించే రేడియల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమీకరించేందుకు జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి అధికారుల బృందం గురువారం జైకా ప్రతినిధులతో సమావేశమైంది. ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహెయ్ హరా, ఆ సంస్థ సీనియర్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, పెట్టుబడిదారులను ఆకర్షించేలా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సానుకూల విధానాలను సీఎం రేవంత్ వారికి వివరించారు. ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా.. హైదరాబాద్‌ను అత్యంత ఆకర్షణీయమైన నగరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి తెలిపారు. "కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ.24,269 కోట్ల అంచనాతో చేపట్టనున్న మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రం తుది పరిశీలనలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయంలో 48 శాతం.. అంటే రూ.11,693 కోట్లు రుణం అందించండి. ఇందుకు భారత ప్రభుత్వ విదేశీ రుణ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా పాటిస్తుంది" అని స్పష్టం చేశారు. మెట్రోతోపాటు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు, కొత్త రేడియల్ రోడ్లకు నిధులు సమకూర్చాలని కోరారు. అయితే, తెలంగాణతో జైకాకు ఏళ్ల తరబడి సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పిన షోహెయ్ హరా.. మెట్రో రైలు విస్తరణతోపాటు ఇతర ప్రాజెక్టులకు జైకా నుంచి ఆర్థిక సాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని ముఖ్యమంత్రికి స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కాగా, జపాన్ పర్యటనలో భాగంగా తెలంగాణ బృందం టోక్యో నగరంలోని మెట్రో రైలు వ్యవస్థను సందర్శించింది. టోక్యోలో తొమ్మిది లైన్లతో నిర్వహిస్తున్న రైళ్లు, కార్యాచరణ సామర్థ్యం, సాంకేతిక వినియోగంపై ఆరా తీసింది. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు ప్రణాళికలను రూపొందించడంలో భాగంగా ప్రపంచ స్థాయి రవాణా వ్యవస్థను అధ్యయనం చేసేందుకు టోక్యో మెట్రోను సందర్శించినట్లు అధికారులు తెలిపారు.



టోక్యో నగరంలో మెట్రో పనితీరును పరిశీలిస్తున్న సీఎం రేవంత్

సోనీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సీఎం టీమ్

జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బృందం.. గురువారం అక్కడి సోనీ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. కంపెనీకి చెందిన యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్ బృందాన్ని కలుసుకుంది. సోనీ కార్పొరేషన్ తయారు చేస్తున్న కొత్త ఉత్పత్తులు, చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ఆ కంపెనీ ప్రతినిధులు తెలంగాణ బృందానికి ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రంచైరోల్‌పై సీఎం రేవంత్ బృందం వివరణాత్మకంగా చర్చలు జరిపింది. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్ రంగాల్లో హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను వివరించింది. ఎండ్-టు-ఎండ్ ప్రొడక్షన్ సామర్థ్యాన్ని కలిగి ఉండే అత్యాధునిక ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయాలనే తన భవిష్యత్తు విజన్‌ను సీఎం రేవంత్ వారితో పంచుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 15 బయో గ్యాస్ ప్లాంట్లు

- ఏటా 82,125 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి
- జీపీఎస్ రెనోవేబుల్ ఆర్య సంస్థ ప్రతిపాదన
- 3 వేల మందికి ఉపాధి : తుమ్మల



హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 15 బయో గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి 'జీపీఎస్ రెనోవేబుల్ ఆర్య' సంస్థ ముందుకొచ్చిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో గురువారం మంత్రి తుమ్మలతో జీపీఎస్ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. ప్రాజెక్టు నివేదికను మంత్రికి సమర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి, వనపర్తి, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్‌లో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు (సీబీజీ ప్లాంట్లు) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ల ద్వారా 3 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఒక్కో ప్లాంటు రోజు వారీ ఉత్పత్తి సామర్థ్యం 15టన్నులు కాగా, 15 ప్లాంట్ల ద్వారా ఏడాదికి 82,125 టన్నుల కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందన్నారు. ఇది సుమారు 57.84 లక్షల గృహ వినియోగ సిలిండర్లకు సమానమని తెలిపారు. ప్రతి ప్లాంటుకు 45 ఎకరాల స్థలం అవసరమవుతుందని, ఏడాదిన్నరలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని కంపెనీ ప్రతినిధులు చెప్పినట్లు వెల్లడించారు.

టీ-ఫైబర్‌తో భాగస్వామ్యానికి ఎల్‌సీఓల్లో విశేష స్పందన

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టీ-ఫైబర్‌తో తమను భాగస్వాములుగా చేర్చుకుందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను లోకల్ కేబుల్ ఆపరేటర్లు (ఎల్‌సీఓలు) స్వాగతిస్తున్నారు. కార్పొరేట్ సంస్థల డీటీహెచ్, ఇతర ప్రైవేట్ ఆపరేటర్లతో ఎల్‌సీవోల జీవనోపాధి ప్రశ్నార్థకమైంది. ఈ నేపథ్యంలో లోకల్ కేబుల్ ఆపరేటర్లను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టీ-ఫైబర్‌తో భాగస్వాములు కావడానికి ఆన్‌లైన్‌లో.. 'ఎల్‌సీవోలు దరఖాస్తు చేసుకోవాలని గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతి ఇంటికి ఇంటర్నెట్, కేబుల్, ఓటీటీ, రిమోట్ కంప్యూటర్, ఇతర ఈ-గవర్నెన్స్ సేవలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టీ-ఫైబర్‌లో ఎల్‌సీవోల పాత్ర కీలకం కానుంది.

సోనియా, రాహుల్ కుటుంబానిది త్యాగాల చరిత్ర

- దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు ఇచ్చారు
- మన్మోహన్‌ను ప్రధాన మంత్రిని చేశారు
- నేషనల్ హెరాల్డ్ కేసులో బీజేపీ అర్థ రహిత ఆరోపణలు: జగ్గారెడ్డి

సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా

సంగారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ ప్రజల కోసం ఆస్తులను, ప్రాణాలను త్యాగం చేసిన చరిత్ర సోనియా, రాహుల్ గాంధీ కుటుంబానిదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. నెహ్రూ పుట్టి పెరిగిన స్వరాజ్ భవన్‌ను ఇందిరా గాంధీ దేశం కోసం ధారాదత్తం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం నేషనల్ హెరాల్డ్ పత్రిక విషయంలో బీజేపీ ఆరోపిస్తున్న అక్రమాల విలువ ఆ స్వరాజ్ భవన్ కిటికీలు, దర్వాజాలకు కూడా సరితూగదని అన్నారు. గురువారం సంగారెడ్డి పోస్టాఫీసు కేంద్ర కార్యాలయం వద్ద జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మహాధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడారు. ప్రధాని పదవి కోసం ఎల్‌కే అద్వానీని మోదీ అవమానిస్తే.. అదే ప్రధాని పదవిని మన్మోహన్‌సింగ్‌కు త్యాగం చేసిన ఘనత సోనియా, రాహుల్ గాంధీదని కొనియాడారు. బీజేపీని అధికారంలోకి తెచ్చిన అద్వానీని అవమానిస్తుంటే ఆర్ఎస్ఎస్ ఏం చేసిందని ప్రశ్నించారు. తనను చంపడానికి వచ్చిన పామును సైతం సముదాయించి అడవిలో వదిలేసే గుణం రాహుల్ గాంధీదైతే.. ఆ అడవిలో స్వేచ్ఛగా తిరిగే పాములను కొట్టి చంపే గుణం మోదీ, అమిత్‌షాదని దుయ్యబట్టారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు రాని ఆరోపణలు ఇప్పుడెందుకు చేస్తున్నారో తెలుసన్నారు. భారత స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రజలను చైతన్యం చేసే దిశగా పుట్టిన పత్రికే నేషనల్ హెరాల్డ్ అని.. ఆ సమయంలో మోదీ, అమిత్‌షాలు పుట్టనేలేదన్నారు. వారికి స్వాతంత్ర్య పోరాటంతో సంబంధమే లేదని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో జరిగిన మహాధర్నా

త్వరలో 6 వేల మంది సర్వేయర్లతో భూముల మ్యాపింగ్

- దేశానికి రోల్ మోడల్‌గా భూభారతి
- ఆగస్టు 15 నాటికి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు:పొంగులేటి

మహబూబ్‌నగర్, పరిగి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల మ్యాపింగ్ చేపడతామని, ఇందుకు త్వరలో మొదటి విడతగా 6వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఖాజీపూర్‌లో రెవెన్యూ సదస్సును ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో అర్హులైన గ్రామ రెవెన్యూ అధికారులను తిరిగి నియమిస్తామని చెప్పారు. భూభారతి చట్టాన్ని దేశానికి రోల్‌మోడల్‌గా అమలు చేస్తామన్నారు. ధరణి వల్ల తమకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ తన వద్దకు వచ్చి చెప్పారని, భూ భారతి చట్టంతో వారు కూడా సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ధరణితో వేలాది ఎకరాలను కొల్లగొట్టి పేదలు అడిగితే కోర్టుకు వెళ్లమన్నారని, కానీ తాము అసైన్డ్ భూములకు కూడా హక్కులు కల్పిస్తామని తెలిపారు. కోర్టు పరిధిలో లేని ప్రతి భూసమస్య పరిష్కరించడమే లక్ష్యంగా భూ భారతిని తీసుకువస్తున్నామన్నారు. పైలట్ గ్రామాల్లో స్వీకరించిన సమస్యలు మే నెలాఖరు వరకు పరిష్కరిస్తామని, జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం చేస్తామని తెలిపారు. మంచిని కూడా చెడుగా ప్రతిపక్షం ప్రచారం చేస్తే వచ్చే ఎన్నికల్లో రెండంకెల సీట్లు కూడా రావని మంత్రి జోస్యం చెప్పారు. కాగా భూ భారతి-2025 చట్టం ద్వారా భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని మంత్రి పొంగులేటి అన్నారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రంలో ఈ చట్టంపై అవగాహన సదస్సులో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. పొంగులేటి మాట్లాడుతూ కేసీఆర్ తెచ్చిన ధరణి-2020 చట్టం భూములున్న ఆసాముల గుండెల్లో రైళ్లు పరుగెత్తేలా చేసిందన్నారు. పార్ట్-బీలో 18 లక్షల ఎకరాల భూములను చేర్చి వాటి యజమానాలను నానాహింసలు పెట్టారన్నారు. భూ భారతి చట్టంలో సాదాబైనామా దరఖాస్తులపై విచారణ జరిపించి, వాస్తవంగా ఉంటే సత్వరమే పట్టాలు ఇప్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం పైలట్‌గా తీసుకున్న 4 జిల్లాల్లోని 4 మండలాల్లోనేకాకుండా మే మొదటి వారంలో మిగతా 28 జిల్లాలో ఒక్కో మండలాన్ని మోడల్‌గా తీసుకుని భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆగస్టు 15 నాటికి భూములున్న రైతులు, ఆసాముల సమస్యలు వంద శాతం పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలుతో 70 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. మండలి చీఫ్‌విప్ పి.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూభారతి చట్టం దేశంలోని రెవెన్యూ శాఖకే ఆదర్శం కానుందని చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మండే ఎండలు.. వడగండ్ల వానలు!

- ఆదిలాబాద్ జిల్లా బేలలో 43.3 డిగ్రీలు
- ఏటూరునాగారంలో వడదెబ్బకు ఒకరి మృతి
- పలు జిల్లాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): ఓ వైపు మండే ఎండలు.. మరోవైపు ఈదురుగాలులు, వడగండ్ల వానలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. గురువారం కూడా పొద్దంతా ఎండలు కాయగా.. సాయంత్రానికి చల్లబడి పలుచోట్ల వర్షాలు పడ్డాయి. ఆదిలాబాద్ జిల్లా బేలలో అత్యధికంగా 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గద్వాల జిల్లా మల్దకల్‌లో 42.6, ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో 42.3, అదే జిల్లా తాంసిలో 42.2, జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో 41.7, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 41.6, కరీంనగర్ జిల్లా గంగాధరలో 41.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో వ్యవసాయ కూలీ పలిశెట్టి వెంకటేశ్వర్లు (52) వడదెబ్బ తగిలి మృతి చెందాడు. ఇటు వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, ఆసిఫాబాద్ జిల్లాల్లో కురిసిన వర్షాలతో పలు పంటలకు నష్టం వాటిల్లింది. వికారాబాద్ జిల్లాలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పెద్దేముల్, బొంరాస్‌పేట్, మర్పల్లి మండలాల్లో వడగండ్ల వాన కురిసింది. వికారాబాద్, యాలాల్‌లో పలుచోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. బొంరాస్‌పేట్ మండలంలోని మైసమ్మగడ్డ తండాలో పిడుగు పడి 20 గొర్రెలు మృతి చెందాయి. పూడూరు, దోమ మండలాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. తాండూరులో గంట సేపు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇందిరాచౌక్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్వాగత తోరణం ఈదురుగాలులకు కుప్పకూలి రాకపోకలు స్తంభించాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్, జరాసంఘం మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఝరాసంగం మండలం కుప్పానగర్‌లో పిడుగుపాటుకు 23 మేకలు మృతి చెందాయి. మెదక్ జిల్లా నర్సాపూర్, పాపన్నపేట, చిన్నశంకరంపేట మండలాల్లో అక్కడక్కడ వడగళ్లు పడ్డాయి. పలుచోట్ల రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. ఆసిఫాబాద్‌లో అరగంట పాటు వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు పట్టణంలో పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు కూలి కరెంట్ సరఫరా నిలిచిపోయింది.



మర్పల్లిలో వడగండ్ల వర్షానికి పూర్తిగా దెబ్బతిన్న క్యాలీఫ్లవర్ పంట

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 33% పంటలకు నష్టం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత రెండు రోజులుగా (మంగళ, బుధవారాల్లో) కురిసిన అకాల వర్షాలతో 33 శాతానికి పైగా పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఖమ్మం జిల్లాలో ప్రధానంగా కల్లూరు, తల్లాడ, వైరా, మధిర, పెనుబల్లి మండలాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, నువ్వు తదితర పంటలు దెబ్బతిన్నాయి. 2,947 ఎకరాల్లో వరి, 226 ఎకరాల్లో మామిడి, 37 ఎకరాల్లో మొక్కజొన్న, 12 ఎకరాల్లో నువ్వుల పంటలకు నష్టం జరిగింది. రైతులు కోతకు వచ్చిన వరితో పాటు మామిడి, కోసి ఉన్న మొక్కజొన్న పంటలు కోల్పోవడంతో తీవ్రంగా నష్టపోయారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు మండలాల్లో పంట నష్టం ఎక్కువగా చోటుచేసుకుంది. అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, ములకలపల్లి మండలాల్లో 741 ఎకరాల్లో పలు పంటలకు నష్టం వాటిల్లింది.

పేద ముస్లింల హితం కోసమే చట్ట సవరణ

- తెలంగాణలో వక్ఫ్ బోర్డుకు రూ.5 లక్షల కోట్ల ఆస్తులు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డుకు వేల కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులున్నా, వాటి ఆదాయం పేద ముస్లింలకు దక్కడం లేదని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. పేద ముస్లింల హితం కోసమే వక్ఫ్ బోర్డు చట్ట సవరణ చేసినట్లు ఆయన తెలిపారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'వక్ఫ్ సుధార్ జనజాగరణ అభియాన్' వర్క్‌షాప్‌లో కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డుకు తెలంగాణవ్యాప్తంగా రూ.5 లక్షల కోట్ల విలువ గల ఆస్తులు ఉన్నాయని, వాటిపై ఎంత ఆదాయం వస్తుందో సీఎం రేవంత్‌రెడ్డి, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో వక్ఫ్ బోర్డు పరిధిలోని ఆస్తుల ద్వారా ఎంతమంది పేదలకు మేలు జరిగిందో చెప్పే ధైర్యముందా? అని అసదుద్దీన్ ఒవైసీ, రాహుల్‌లకు సవాల్ చేశారు. అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు వక్ఫ్ సవరణ చట్టం ఏ వర్గానికి వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. మసీదుల నిర్వహణ వేరు, వక్ఫ్ భూముల నిర్వహణ వేరని, ఈ రెండింటిని కలిపి చెప్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయవద్దని అన్నారు. వక్ఫ్ బోర్డు పరిధిలో మసీదులు ఉండవని, వాటికి వేరే కమిటీలు ఉన్నాయని వెల్లడించారు.

కాంగ్రెస్ కాదు స్కాంగ్రెస్

- నేషనల్ హెరాల్డ్ కేసుపై గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు బీజేవైఎం యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. యువమోర్చా నాయకుల అరెస్టు

కవాడిగూడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని అనేక సంవత్సరాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలకు పాల్పడి స్కాంగ్రెస్‌గా రూపుచెందిందని భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆరోపించింది. నేషనల్ హెరాల్డ్ కేసుపై గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా గురువారం బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు ఖైదీ దుస్తులు ధరించి, సోనియా, రాహుల్, రాబర్ట్ వాద్రా, ప్రియాంక ఫొటోలు మెడలో వేసుకొని, హైదరాబాద్ లోయర్‌ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపేందుకు ర్యాలీగా వచ్చారు. అయితే నిరసనకు అనుమతి లేదంటూ వారిని పోలీసులు అడ్డుకున్నారు. దాంతో బీజేవైఎం నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగగా.. పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కొంతమంది బీజేవైఎం నాయకులు కార్యకర్తలు పోలీసుల నుంచి తప్పించుకొని రోడ్డుపై బైఠాయించడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయింది. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి చిత్తశుద్ధి ఉంటే నిజాయితీపరులుగా నిరూపించుకోవాలి కాని కార్యకర్తలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం దారుణమని అన్నారు.

దేవన్నపేట టన్నెల్‌లో నెలాఖరుకల్లా పైపులు!

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఎత్తిపోతల పథకంలోని దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించే డెలివరీ సిస్టర్న్ టన్నెల్‌లో వెంటనే పైపులు బిగించాలని ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి వీరితో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా ఈ మేరకు ఆదేశాలిచ్చారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలోని మూడో దశలో దేవన్నపేట పంప్‌హౌస్ ఉంది. ఇటీవలే ఈ పంప్‌హౌస్‌లో ఒక మోటార్‌ను ప్రారంభించారు. అయితే డెలివరీ సిస్టర్న్‌లో ప్రెషర్ మెయిన్స్‌ల స్థానంలో టన్నెల్ తవ్వారు. అయితే టన్నెల్‌కు మధ్యలో రంధ్రాలు పడి పంపింగ్ చేసిన నీరంతా లీకవడంతో వందల ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. దాంతో 200 మీటర్ల దాకా టన్నెల్‌లో పైపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేస్తే తాగునీటి అవసరాలకు ఇబ్బందులుండవు. కామారెడ్డిలో అందుబాటులో ఉన్న 48 పైపులను ఇప్పటికే దేవన్నపేటకు తరలించారు. ఇందులో ఒక టన్నెల్‌లో 30 పైపులను బిగించే ప్రక్రియ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఈఎన్‌సీ ఆదేశించారు.

ఆ భూములను హెచ్‌సీయూకు ఎందుకివ్వలేదు..?

- పదేళ్లు బీఆర్ఎస్ పార్టీనే అధికారంలో ఉంది కదా
- కేటీఆర్‌కు ఎంపీ రఘునందన్ రావు సూటి ప్రశ్న

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల వివాదం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని తెలిసినా.. కేటీఆర్ ఏమాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా ప్రధానిపై విమర్శలు చేశారని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. హెచ్‌సీయూ పేరిట 2,185 ఎకరాలను బదలాయించాలని 2012లోనే రంగారెడ్డి కలెక్టర్, సీసీఎల్ఏకు నివేదించారని తెలిపారు. 2014 నుంచి పదేళ్లు అధికారంలో ఉన్నా, ఎందుకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదో చెప్పాలని కేటీఆర్‌ను నిలదీశారు. ములుగులో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన యూనివర్సిటీని కేంద్రం మంజూరు చేస్తే, వెంటనే దాని పేరిట అప్పటి కేసీఆర్ ప్రభుత్వం భూ బదలాయింపు చేసిందని గుర్తుచేశారు. మరి సెంట్రల్ యూనివర్సిటీ విషయంలో అలా ఎందుకు స్పందించలేదని కేటీఆర్‌ను నిలదీశారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. "నేను రేవంత్‌ను కాపాడుతున్నానని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. మరి ఢిల్లీలో ఒకాయనను కొట్టిన కేసులో హరీశ్‌కు వకాలత్ చేసిన సంగతి మరచిపోయారా..? అప్పుడు మిమ్మల్ని కాపాడలేదా..?" అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. హెచ్‌సీయూకు భూమి బదలాయింపునకు సంబంధించిన గెజిట్‌ను సుప్రీంకోర్టు సాధికారత కమిటీకి తానే అందజేశానని రఘునందన్ తెలిపారు.

38 మంది జిల్లా న్యాయమూర్తుల బదిలీ

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జిల్లా న్యాయమూర్తుల బదిలీలు పెద్దఎత్తున జరిగాయి. మొత్తం 38 మంది జిల్లా న్యాయమూర్తులను బదిలీ చేశారు. వీరిలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్ట్ పరిధిలోని ముగ్గురు న్యాయమూర్తులు కూడా ఉన్నారు. ఈ మేరకు హైకోర్ట్ రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.



తల్లీకుమారులను సత్కరిస్తున్న ఉస్మానియా పాలకవర్గం

17 ఏళ్ల యువకుడికి కాలేయ మార్పిడి

- 18 గంటలపాటు శ్రమించిన ఉస్మానియా వైద్యులు
- సగం కాలేయం దానం చేసిన కన్నతల్లి

అఫ్జల్‌గంజ్/మంగళ్‌హాట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి అరుదైన కాలేయ వ్యాధితోపాటు ఊపిరితిత్తులు, ఇతర సమస్యలతో బాధపడుతున్న యువకుడికి ఉస్మానియా వైద్యులు 18 గంటలపాటు శ్రమించి పునర్జన్మ ప్రసాదించారు. ఉస్మానియా గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులు యువకుడి తల్లి నుంచి 60% సేకరించిన కాలేయాన్ని బాలుడికి అమర్చి కాపాడారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో అయితే ఈ తరహా శస్త్రచికిత్సకు సుమారు రూ.కోటి వరకు ఖర్చు అవుతుందని, అలాంటిది ముఖ్యమంత్రి సహాయనిధి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని ఉస్మానియా వైద్యులు తెలిపారు. గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ మధుసూదన్, సూపరింటెండెంట్ రాకేశ్ సహాయ్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. మచిలీపట్నానికి చెందిన యువకుడు నెలరోజుల క్రితం తమను సంప్రదించాడని, అడ్మిట్ చేసుకుని జనరల్ సర్జరీ, నెఫ్రాలజీ, యురాలజీ, అనస్తీషియా విభాగాల సలహాలు తీసుకున్నట్లు వెల్లడించారు. యువకుడి తల్లి నుంచి కాలేయాన్ని సేకరించి అమర్చామన్నారు. ప్రస్తుతం తల్లీ కుమారుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

కాంగ్రెస్ సర్కార్‌ను పడగొట్టే కర్మ మాకేంటి?

- ప్రజలే ప్రభుత్వాన్ని కూలగొడతారు
- ఈ పార్టీకి 20 ఏళ్ల పాటు ఓట్లేయరు
- సిగ్గూశరం లేకనే రేవంత్ రాజీనామా చేయలేదు:కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): "దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే కర్మ మాకు లేదు.. ఎవరూ పడగొట్టకుండానే.. రేవంత్ రెడ్డి చేస్తున్న లుచ్ఛాపనులకు జనమే రోడ్లమీదకు వచ్చి బంగ్లాదేశ్‌లో మాదిరిగా ప్రభుత్వాన్ని పడగొడతారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఐదేళ్లు సీఎంగా రేవంతే ఉండాలని తాము కోరుకుంటున్నామని, అప్పుడే మరో 20ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు ప్రజలెవరూ ఓట్లు వేయరని వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఆత్మాభిమానం, పౌరుషం, సిగ్గుంటే.. రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేసేవారన్నారు. కానీ, ఆయనకు సిగ్గూశరం లేకనే.. ఎన్ని విమర్శలొచ్చినా దులుపుకొని బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. పర్యావరణ చట్టాలను తుంగలో తొక్కుతూ కంచ గచ్చిబౌలి భూముల్లోని చెట్లను ఉద్దేశపూర్వకంగానే టీజీఐఐసీ నరికి వేసిందన్నారు. పలు డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాత ఆ 400 ఎకరాల భూమి సెంట్రల్ యూనివర్సిటీదని కేంద్ర సాధికార కమిటీ తేల్చిందని, భూయాజమాన్య హక్కులు తేలేదాకా తనఖా, లీజుతోపాటు అక్కడ కట్టడాలు నిర్మించడాన్ని తక్షణమే ఆపేలా చొరవ చూపాలని సుప్రీంకోర్టుకు చెప్పిందన్నారు. తెలంగాణ పోలీసుల్లో కొంత మంది రేవంత్‌రెడ్డి ప్రైవేట్ సైన్యంలా పని చేస్తున్నారని, వారిపై సుప్రీంకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తీరుపై ఏడాదికోసారి విమర్శలు చేయడం ప్రధాని మోదీకి అలవాటుగా మారిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అక్రమాలు, అరాచకాలను ఆపాలనుకుంటే కేంద్ర సాధికారిక కమిటీ నివేదిక ఆధారంగా తక్షణమే సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నిర్ణయం కోసం కొద్ది రోజులు ఎదురు చూస్తామని, పట్టించుకోకుంటే.. ఏప్రిల్ 27తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థల వద్దకు వెళ్లి ఆధారాలు అందిస్తామని తెలిపారు. అప్పుడూ స్పందించకపోతే ప్రజాక్షేత్రంలో బీజేపీని ఎండగడతామని హెచ్చరించారు.

రేవంత్ పాలనలో రైజింగ్ కాదు.. ఫాలింగ్:హరీశ్



రాష్ట్ర ఆర్థిక వృద్ధి పడిపోతుండటం ఆందోళనకరమని, రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రైజింగ్ కాదు... ఫాలింగ్ అన్నట్టుగా పరిస్థితి ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. కాగ్ విడుదల చేసిన కీ ఇండికేటర్ల ప్రకారం రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం2023-24లో రూ.1,24,146.19 కోట్లు కాగా, 2024-25 నాటికి రూ.1,24,054.38 కోట్లకు తగ్గిందని 'ఎక్స్' వేదికగా తెలిపారు. కొవిడ్ సమయంలో తప్ప రాష్ట్ర పన్నుల ఆదాయంలో ఎప్పుడూ తగ్గుదల లేదని బీఆర్ఎస్ పాలనలో సొంతపన్నుల ఆదాయ వృద్ధి 12శాతం మేర నమోదైనట్లు తెలిపారు.

కన్న బిడ్డలపై తల్లి కొడవలి వేటు!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోందో.. తామేం తప్పు చేశామో అర్థం కాని పిల్లలు.. గాయాలతో నెత్తురు కారుతున్న స్థితిలో ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీసినా వెంబడించి మరీ చంపేసింది. జీడిమెట్ల పరిధిలోని గాజులరామారంలో ఈ ఘోరం జరిగింది. ఎక్కడికక్కడ రక్తధారలతో చూస్తేనే ఒళ్లు జలదరించేలా ఆ ఇల్లంతా నెత్తుటిమయమైంది. చిన్నారులకు కొసరి కొసరి గోరుముద్దలు తినిపించే తల్లి.. వారిని ఒళ్లో కూర్చోబెట్టుకొని హోంవర్కు చేయించే తల్లి.. వారి కాలికి ముల్లు దిగితే తాను తల్లడిల్లిపోయి కన్నీరు పెట్టుకునే తల్లి ఎందుకంత రాక్షసంగా ప్రవర్తించింది? ఆమెకు, పెద్ద కుమారుడికి అనారోగ్య సమస్యలు ఉండటం.. చిన్నకుమారుడి ఆరోగ్యం కూడా దెబ్బతింటుండటం.. భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు.. అన్నింటికి మించి తీవ్ర మానసిక సమస్యలతోనే ఆ తల్లి ఇంతటి దారుణానికి తెగబడింది! పిల్లలను చంపి.. తాను చావాలని ముందే అనుకుందేమో.. పిల్లలపై దాడి చేసి.. వారు నెత్తుటిమడుగులో కొట్టుకుంటుండగానే, ఆమె తాముంటున్న అపార్ట్‌మెంట్‌పై నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకుంది. సూసైడ్ నోట్‌లోని వివరాలు.. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి హైస్కూల్ రోడ్డు ప్రాంతానికి చెందిన గంగ్రవెంకటేశ్వర్ రెడ్డి, తేజస్విని రెడ్డి (35) భార్యాభర్తలు. వీరికి ఆశిష్ రెడ్డి(8), హర్షిత్ రెడ్డి(6) సంతానం. మొదటి భార్యతో విడాకులు తీసుకున్నాక తేజస్వినిని, వెంకటేశ్వర్ రెండో వివాహం చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం ఈ దంపతులు హైదరాబాద్‌కొచ్చారు. గాజులరామారంలోని బాలాజీ లేఅవుట్‌లో ఉన్న సహస్ర మహేశ్ హైట్స్ అపార్టుమెంట్‌లో రెండో అంతస్తులోని ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నారు. వెంకటేశ్వర్ బొంతపల్లి గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్‌లో క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య తేజస్విని ఇంటివద్దే ఉంటూ పిల్లలను చూసుకుంటోంది. ఆశిష్, హర్షిత్ గాజులరామారం బాలాజీ లేఅవుట్‌లోని న్యూ ఎరా ది లీడ్‌స్కూల్‌లో రెండో తరగతి, ఒకటో తరగతి చదువుతున్నారు. తేజస్విని కొన్నాళ్లుగా కంటి సమస్యతో బాధపడుతోంది. పెద్ద కుమారుడు ఆశిష్ ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో ఇబ్బందిపడుతున్నాడు. ఏంతిన్నా వాంతులు చేసుకుంటున్నాడు. చిన్న కుమారుడైన హర్షిత్‌కు కూడా అప్పుడప్పుడు ఇదే సమస్య వస్తోంది. బేగంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పెద్ద కుమారిడికి ఆమె చికిత్స చేయిస్తోంది. పిల్లల స్వస్థత కోసం గూగుల్‌లోనూ వెతుకుతూ మందులు వాడుతోంది. తనతోపాటు పిల్లలు కూడా తరచూ అనారోగ్యానికి గురవుతుండటాన్ని జీర్ణించుకోలేక ఆమె ఉన్మాదిగా మారింది. గురువారం సాయంత్రం నాలుగింటికి 6పేజీల సూసైడ్ నోట్ రాసింది. ఇంట్లోనే ఆడుకుంటున్న ఆశిష్, హర్షిత్‌ను పట్టుకొని.. అప్పటికే బయట నుంచి తెచ్చుకున్న వేటకొడవలితో మెడ, ఇతర శరీర భాగాలపై విచక్షణారహితంగా దాడి చేసింది. ఇద్దరు పిల్లలూ గాయాలతో నెత్తురోడుతున్న స్థితిలోనూ ప్రాణభయంతో వంటింట్లోకి.. పడక గదిలోకి పరుగులు తీసినా వెంబడించి పట్టుకొని వేటు మీద వేటు వేసింది. ఈ ఘటనలో ఆశిష్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హర్షిత్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ లోపే.. తేజస్విని, అపార్ట్‌మెంట్‌లోని ఆరో అంతస్తు నుంచి కిందకు దూకింది. ఈ ఘటనలో తీవ్రగాయాలుకావడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కాగా ఇంట్లోంచి తేజస్విని సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పిల్లలు, తాను అనారోగ్యంతో బాధపడుతున్నా.. భర్త కనీసం పట్టించుకోవడం లేదని, తమ సమస్యలు చెబితే ముగ్గురు చచ్చిపోండని కోప్పడటంతోనే తాము చచ్చిపోతున్నామని నోట్‌లో తేజస్విని రాసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, 7 నెలల క్రితం ఇదే పక్క అపార్టుమెంట్‌లో ఓ వ్యక్తి భార్య, ఇద్దరు పిల్లలకు ఉరేసి తాను ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనను స్థానికులు గుర్తు చేసుకున్నారు.



సూసైడ్‌నోట్‌ను పరిశీలిస్తున్న డీసీపీ సురేశ్ కుమార్

ఏపీలో వర్గీకరణకు జై.. డీఎస్సీకి సై!

- ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ.. తక్షణం అమలులోకి వచ్చినట్లే
- కేబినెట్ తీర్మానించిన రెండు రోజుల్లోనే గవర్నర్ ఆమోద ముద్ర
- డీఎస్సీ నోటిఫికేషన్‌కు మార్గం సుగమం

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేసింది. దీనిపై ఆర్డినెన్స్ జారీ చేసింది. ఎస్సీ ఉప కులాలను మూడు కేటగిరీలుగా విభజిస్తూ, దానికి అనుగుణంగా రిజర్వేషన్లను పంచే 'వర్గీకరణపై గురువారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఇది వెంటనే అమలులోకి వచ్చినట్లుగా ప్రకటించారు. దీంతో... 16 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి మార్గం సుగమమైంది. ఈనెల 20 లేదా 23వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చేందుకు వీలుగా కసరత్తు జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఆర్డినెన్స్ ముసాయిదాను రాష్ట్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. దీనిపై త్వరలోనే ఆర్డినెన్స్ జారీ చేస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. దీనిని వెంటనే గవర్నర్ ఆమోదానికి పంపింది. గురువారమే గవర్నర్ దీనిపై ఆమోద ముద్ర వేశారు. గురువారం 'ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఆర్డినెన్స్ - 2025 జారీ చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు లేనందున, వర్గీకరణను వెంటనే అమలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడినందున ఆర్డినెన్స్ జారీచేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీని ప్రకారం గ్రూప్-1 కేటగిరీకి చెందిన రెల్లి, 12 ఉపకులాలకు ఒక శాతం... గ్రూప్-2కు చెందిన మాదిగ, 18 ఉప కులాలుకు 6.5 శాతం... గ్రూపు-3కు చెందిన మాల, 29 ఉప కులాలకు 7.5 శాతం చొప్పున, మొత్తం 15 శాతం రిజర్వేషన్ కేటాయిస్తారు. మూడు ఎస్సీ గ్రూపుల విషయంలో 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని అవలంబిస్తారు. ఈ విధానాన్ని ఒక్కొక్కటి 1 నుంచి 100 సంఖ్యతో రెండు సైకిల్స్ అమలు చేయాలి. ఆర్డినెన్స్ జారీ నేపథ్యంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ గురువారం సచివాలయానికి వచ్చి సీఎస్ విజయానంద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన జూలై కోటాను టీటీడీ శనివారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం భక్తులు ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక అనారోగ్య భక్తులకు టోకెన్లు విడుదల చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదుల కోటా అందుబాటులో ఉంచుతారు.

మతమార్పిడిలో విషాదం

బాప్టిజం తీసుకుంటూ నదిలో మునిగి ఇద్దరి మృతి

- మరో ముగ్గురిని కాపాడిన స్థానికులు
- బాపట్ల జిల్లా పెనుమూడిలో ఘటన

రేపల్లె, భట్టిప్రోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మతమార్పిడి సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. బాప్టిజం తీసుకుంటూ కృష్ణానదిలో మునిగి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. బాపట్ల జిల్లా పెనుమూడిలో గురువారం ఈ ఘటన జరిగింది. రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు తెలిపిన వివరాల మేరకు భట్టిప్రోలు మండలం వేమవరానికి చెందిన 30 మంది గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మతమార్పిడి కోసం పెనుమూడిలో కృష్ణానది వద్దకు వచ్చారు. నదిలో దిగి బాప్టిజం తీసుకుంటుండగా పెనుమాల దేవదాసు, తలకాయల గౌతమ్, పెనుమాల సుధీర్‌బాబు, పెనుమాల హర్షవర్ధన్, పెనుమాల రాజా నీటిలో మునిగిపోయారు. స్థానికులు గుర్తించి ముగ్గురిని కాపాడారు. పెనుమాల దేవదాసు(19), తలకాయల గౌతమ్(18) గల్లంతయ్యారు. గాలింపు చేపట్టి కొంతసేపటికి వారి మృతదేహాలను వెలికితీసి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుధీర్‌బాబు, హర్షవర్ధన్, రాజా రేపల్లెలోని సురక్ష వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అక్కడ నదిలో లోతు ఎక్కువగా ఉంటుందని చెప్పినా వినకుండా దిగారని స్థానికులు తెలిపారు.

ఇంట్లో చెప్పకుండానే..

గౌతమ్ ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్ కోచింగ్ తీసుకుంటుండగా, దేవదాసు పాలిటెక్నిక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్నారు. వీరు ఇంట్లో చెప్పకుండానే బాప్టిజం స్వీకరించేందుకు వెళ్లినట్టు తెలిసింది. గౌతమ్ తల్లిదండ్రులు సుధాకర్, రజని, దేవదాసు తల్లిదండ్రులు దేవేంద్ర, నాగలత వ్యవసాయ కూలీలు. యువకులు మృతి చెందిన విషయాన్ని కుటుంబసభ్యులు వారి తల్లులకు తెలియనీయలేదు. యువకుల మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

అవినీతి సొమ్ముతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర

- కేటీఆర్ ఆదేశాలతోనే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలు
- మీడియాతో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గత పదేళ్లలో కూడబెట్టిన అవినీతి సొమ్ముతో ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ ఆదేశాలతోనే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి... కాంట్రాక్టర్లు, బిల్డర్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కోరుకుంటున్నారనే వ్యాఖ్యలు చేశారన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో చామల మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల మాటున రాష్ట్రాన్ని దోచుకుని, ఆ డబ్బులను కేటీఆర్.. కొందరు కాంట్రాక్టర్లు, బిల్డర్ల దగ్గర దాచారని ఆరోపించారు. ఆ బినామీల దగ్గరున్న డబ్బుతోనే ప్రభుత్వాన్ని కూలుస్తామని ప్రభాకర్ రెడ్డి అంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సీఎస్ సోమేశ్ కుమార్‌ను కోర్టులు అనేకసార్లు హెచ్చరించాయని చామల గుర్తు చేశారు. కేటీఆర్ నేతృత్వంలోని సోషల్ మీడియా కంచ గచ్చిబౌలి భూములపై ఏఐతో కూడిన కల్పిత చిత్రాలతో అసత్య ప్రచారం చేసిందన్నారు. ఏఐ ఫొటోలు, వీడియోలను కిషన్ రెడ్డి అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో పోస్టు చేశారని, తర్వాత డిలీట్ చేశారని ఆయన గుర్తు చేశారు. ఫేక్ వీడియో కాకుంటే ఎందుకు డిలీట్ చేశారో చెప్పాలన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.